


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక





Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 23 శనివారం | ఆగస్టు 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 339
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

## సురవరం ఇక లేరు

- అనారోగ్యంతో హైదరాబాద్‌లో తుదిశ్వాస
- ప్రజల సందర్శనార్థం ఆదివారం ఉదయం
- మగ్దూంభవన్‌కు సుధాకర్ రెడ్డి భౌతికకాయం
- వైద్య పరిశోధనల కోసం గాంధీ ఆస్పత్రికి ఆయన పార్థివ దేహం..
- ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి నేత్రదానం
- ఏఐఎస్ఎఫ్ సభ్యుడి నుంచి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి దాకా కమ్యూనిస్ట్ దిగ్గజం

హైదరాబాద్-నవభూమిబ్యూరో

రాజకీయాల్లో అజాతశత్రువు... తాడిత, పీడితవర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన తెలంగాణ మట్టి బిడ్డ... భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మాజీ ప్రధాన కార్యదర్శి.. సురవరం సుధాకర్ రెడ్డి (84) ఇక లేరు. కొంత కాలంగా శ్వాసకోశ సమస్యతో బాధపడుతు న్న ఆయనను కుటుంబసభ్యులు రెండు రోజుల క్రితం గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఐసీయూలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 10.20 గంటల సమయంలో సుధాకర్ రెడ్డి తుదిశ్వాస విడిచినట్లు సీపీఐ అధికారికంగా ప్రకటించింది. కొన్నాళ్లుగా



2

## 50 గంటల అరెస్టుతో ఉద్యోగిని సస్పెండ్ చేస్తుంటే

# సీఎం, పీఎంలకు ఎందుకు వర్తించదు?

### జైలుకెళ్లిన సీఎంలు, పీఎంలపై బిల్లు - లోక్‌సభలో గందరగోళం

- ప్రతిపక్షాల వ్యతిరేకతపై మండిపడ్డ మోదీ
- జైల్లో ఉంటూ పాలన సాగిస్తారా? : ప్రధాని మోదీ విపక్షాలపై దాడి
- ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలపై మోదీ సెటైర్లు
- కేజ్రీవాల్‌పై పరోక్ష విమర్శలు - జైల్లో నుంచే ఫైళ్లపై సంతకాలు
- అవినీతిపరులకు ఇక ప్రజలపై పాలనా అవకాశం లేదు - మోదీ హెచ్చరిక
- అమిత్ షా ప్రవేశపెట్టిన బిల్లు జేపీసీకి పంపిణీ



2

న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

క్లర్క్, ప్యూన్‌లకు ఒక రూల్.. సీఎం, పీఎంలకు ఒక రూలా.. తీవ్రంగా మండిపడ్డ ప్రధాని మోదీ ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కేంద్రమంత్రులు, మంత్రులు ఎవరైనా నెల రోజులకు పైగా జైలులో ఉంటే.. వారిని పదవుల నుంచి తొలగించేందుకు.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త బిల్లుపై ప్రతిపక్షాలు తీవ్ర వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆ బిల్లును కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టగా.. దాన్ని జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆ బిల్లును విపక్షాలు వ్యతిరేకించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

మరికొన్ని రోజుల్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని మోదీ.. గయాజీలో నిర్వహించిన బహిరంగ సభలో కాంగ్రెస్, ఆర్జేడీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలు ఉంటే జైలులో లేకపోతే బెయిల్ తీసుకుని బయటికి వచ్చి ఉన్నారని సెటైర్లు వేశారు. ప్రభుత్వ ఉద్యోగులు 50 గంటలు జైలు శిక్ష అనుభవిస్తే.. వారి ఉద్యోగం పోతుందని గుర్తు చేశారు. క్లర్క్, ప్యూన్ వంటి ప్రభుత్వ ఉద్యోగులకు ఒక రూల్.. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులకు ఇంకో రూలా అంటూ ప్రతిపక్షాలను ప్రశ్నించారు.

ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలపై కేసులు ఉన్నాయని.. అందుకే అవినీతికి వ్యతిరేకంగా తాము చేస్తున్న పోరాటంలో భాగంగా తీసుకువచ్చిన బిల్లును వ్యతిరేకిస్తున్నారని ప్రధాని మోదీ విమర్శించారు. 50 గంటలు జైలు శిక్ష అనుభవించే ప్రభుత్వ ఉద్యోగిని.. తన ఉద్యోగం నుంచి తొలగిస్తున్నప్పుడు.. జైలు శిక్ష అనుభవించిన ఒక ముఖ్యమంత్రి గానీ, ఒక ప్రధానమంత్రి గానీ, మంత్రులు గానీ తమ పదవి నుంచి దిగిపోకుండా ఎలా ఉంటారని ప్రధాని ప్రశ్నించారు. జైలులో ఉండి.. పాలన కొనసాగిస్తారా అని నిలదీశారు.

కొన్ని రోజుల క్రితం కొందరు నాయకులు.. జైళ్ల నుంచి ఫైళ్లపై సంతకాలు చేయడం, ప్రభుత్వాన్ని నడిపేందుకు ఆదేశాలు ఇవ్వడం మనం చూశామని.. పరోక్షంగా ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై విమర్శలు చేశారు. అవినీతి చేసిన నేతలే ప్రజలను పరిపాలిస్తే.. ఇక దేశంలో పెరిగిపోతున్న అవినీతిని ఎలా నిర్మూలిస్తాం అంటూ మోదీ ప్రశ్నలు వేశారు. ఇక నుంచి అలాంటి క్రిమినల్ నాయకులకు.. ప్రజలను పాలించే అవకాశం ఇవ్వమని తేల్చి చెప్పారు. దేశంలో అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేయడానికి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువస్తున్న చట్టానికి ఎవరూ అతీతులు కారని ఇందులో ప్రధానమంత్రి కూడా ఉంటారని స్పష్టం చేశారు.ఎవరైనా ప్రధాని, ముఖ్యమంత్రి, మంత్రులపై తీవ్రమైన నేరారోపణలు వచ్చి.. 30 రోజులపాటు జైలులో

## తుపాకులు వదిలి

# డ్రగ్స్ దందా

- ఇండియాలో దావూద్ ఇబ్రహీం కొత్త వ్యాపారం
- భోపాల్‌లో 92 కోట్ల డ్రగ్స్ ఫ్యాక్టరీ బట్టబయలు
- డీఆర్ఐ దాడి -61.20 కిలోల మెఫిడ్రోన్ స్వాధీనం
- 541 కిలోల కెమికల్స్ సీజ్ - సింథటిక్ డ్రగ్స్ తయారీ
- ముంబై, గుజరాత్ నుంచి భోపాల్‌కి రసాయనాల రవాణా
- డి-కంపెనీ కొత్త వ్యూహం - మధ్యప్రదేశ్‌లో విస్తరణ
- సలీం డోలా, ఇస్మాయిల్ ఉమైద్ రెహ్మాన్ కీలక పాత్రధారులు
- హవాలా మార్గంలో పాకిస్థాన్, దుబాయ్ నుంచి నిధుల సరఫరా



2

భోపాల్ -నవభూమి బ్యూరో

మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ శివారులోని ఓ మారుమూల గ్రామంలో అండర్ గ్రౌండ్ డాన్ దావూద్ ఇబ్రహీం ముఠా నడుపుతున్నట్లు భావిస్తున్న భారీ డ్రగ్స్ ఫ్యాక్టరీని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు ఛేదించారు. ప్రశాంతంగా కనిపించే జగదీశ్‌పుర గ్రామంలోని ఓ ఇంట్లో రహస్యంగా నిర్వహిస్తున్న ఈ స్థావరంపై ఈ నెల 16న దాడి చేసి, సుమారు రూ. 92 కోట్ల విలువైన సింథటిక్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో అండర్‌వరల్డ్ కార్యకలాపాలు మధ్యప్రదేశ్‌కు ఎంతలా విస్తరించాయో వెలుగులోకి వచ్చింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ దాడిలో 61.20 కిలోల ద్రవరూప మెఫిడ్రోన్ (ఎండి డ్రగ్), దాని తయారీకి ఉపయోగించే 541 కిలోల రసాయనాలను సీజ్ చేశారు. ముంబై, గుజరాత్‌లలో పట్టు బిగించిన పోలీసులు, నిఘా వర్గాల నుంచి తప్పించుకోవడానికి దావూద్ ముఠా తమ కార్యకలాపాలను మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలకు విస్తరిస్తున్నట్లు స్పష్ట మవుతోంది. తుపాకులు, బెదిరింపుల నుంచి డి-కంపెనీ ఇప్పుడు అత్యంత లాభదాయకమైన సింథటిక్ డ్రగ్స్ వ్యాపారం వైపు మళ్లిందని నిఘా వర్గాలు వెల్లడిం చాయి. ఈ మొత్తం నెట్‌వర్క్‌ను దావూద్ ఇబ్ర హీం ఆయన అనుచరులు సలీం డోలా ఇస్మాయిల్ ఉమైద్ ఉర్ రెహ్మాన్ నిర్వహిస్తున్నారు. పాకిస్థాన్, దుబాయ్ నుంచి హవాలా మార్గంలో వస్తున్న నిధులతో ఈ దందాను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముంబై, థానే ప్రాంతాల నుంచి రసాయనాలను మినీ ట్రక్కుల్లో భోపాల్‌కు తరలించి, ఇక్కడ డ్రగ్స్‌ను తయారుచేసి దేశవ్యాప్తంగా సరఫరా చేయాలనేది వారి ప్రణాళిక అని వెల్లడించారు. ఈ ఫ్యాక్టరీని గుజరాత్‌లో శిక్షణ పొందిన ఫైసల్ ఖురేషీ అనే ఫార్మసీ డిప్లొమా హోల్డర్, అతడి సహచరుడు రజాక్ ఖాన్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఏడేళ్లుగా ఖాళీగా ఉన్న ఇంటికి, డీఆర్ఐ దాడులకు కేవలం రెండు రోజుల ముందు అంటే ఆగస్టు 14న

# కేసీఆర్, హరీష్‌లకు షాక్!

- కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్
- కమిషన్ నివేదిక కొట్టివేయాలని హైకోర్టులో పిటిషన్
- మధ్యంతర ఉత్తర్వులు అవసరం లేదన్న హైకోర్టు
- 3 వారాల్లో కౌంటర్ దాఖలుకు పిటిషనర్లకు ఆదేశం
- తదుపరి విచారణ 4 వారాలకు వాయిదా



హైదరాబాద్-నవభూమిబ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో చోటు చేసుకున్న అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను కొట్టివేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేసీఆర్, హరీష్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ కొనసాగుతోంది. అందులో భాగంగా శుక్రవారం కేసీఆర్, హరీష్‌రావు పిటిషన్లపై వాదనలు ముగిశాయి. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశించింది. దీనిపై మధ్యంతర ఉత్తర్వులు అవసరం లేదన్న హైకోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక.. పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ఉంటే.. దానిని వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ 4 వారాలకు వాయిదా వేసింది. అయితే పిటిషనర్లు కోరిన విధంగా స్టే మాత్రం ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో బీఆర్ ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుకు హైకోర్టులో నిరాశ ఎదురైనట్లు అయింది.

**కోర్టులో వాదనలు ఇలా..**

పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టుకు అడ్వకేట్ జనరల్ (ఏజీ) శుక్రవారం తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అందిన నివేదకను అసెంబ్లీలో ప్రవేశపెడతామని కోర్టుకు స్పష్టం చేశారు. అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. అంటే.. ఈ నివేదికపై అసెంబ్లీలో చర్చించిన అనంతరం ప్రభుత్వం నిర్ణయం తీసుకుం టుందని కోర్టుకు ఏజీ వివరించారు.

అంతలో హరీష్ రావు తరపు న్యాయవాది సుందరం తన వాదనలు వినిపిస్తూ.. మొత్తం కమిషన్ నివేదికపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ నివేదికను అడ్డం పెట్టుకుని తమ పిటిషనర్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆయన కోర్టుకు విన్నవించారు. ఈ నేపథ్యంలో తమ వారిపై ఎలాంటి చర్యలు తీసుకో వద్దని కోరుతున్నామని కోర్టు దృష్టికి న్యాయవాది సుందరం తీసుకు వెళ్లారు. అంతేకాకుండా.. జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను అసెంబ్లీలో కంటే.. ముందే మీడియాకు ఇచ్చి.. తమ పిటిషనర్ల పరువుకు భంగం కలిగించారని కోర్టుకు న్యాయవాది సుందరం తెలిపారు. తమకు

## సిట్ అదుపులో

# మాజీ డిప్యూటీ సీఎం?

- రోజుకో మలుపు తిరుగుతున్న ఏపీ మద్యం కుంభకోణం కేసు
- కేసులో కీలక పరిణామం..డిప్యూటీ మాజీ సీఎంపై దృష్టి
- విచారణకు రావాలంటూ డిప్యూటీ మాజీ సీఎం
- నారాయణ స్వామిని గతంలో కోరిన సిట్ అధికారులు
- విచారణకు గైర్హాజరు అవుతూ రావడంతో అదుపులోకి..
- 6 గంటల పాటు నారాయణ స్వామి విచారించిన సిట్?



2

**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీ లిక్కర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసులో సిట్ దూకుడు ప్రదర్శిస్తూ.. నిందితులను ఒక్కొక్కరిగా బయటకు లాగుతుంది. తాజాగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామిని సిట్ అధికారులు అదుపులోకి తీసుకోని 6 గంటల పాటు విచారించినట్లు సమాచారం. గతంలో కూడా నారాయణ స్వామిని విచారణకు రావాలని సిట్ అధికారులు కోరినట్లు తెలిపారు. అయితే.. గతంలో వివిధ కారణాలు చెబుతూ.. విచారణకు గైర్హాజరు అవుతూ వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయనను అదుపులోకి తీసుకోనే అవకాశం. అదుపులోకి తీసుకుని విజయవాడ సిట్ ఆఫీస్‌కు తరలించనున్నట్లు సమాచారం. ఎక్సైజ్ పాలసీలో మార్పుల వెనుక ఉన్నవారి పాత్రపై సిట్ విచారణ చేయనున్న అధికారులు. లిక్కర్ పాలసీ ఆమోదానికి సంబంధించి ఆరా తీయనున్నట్లు సమాచారం. కాగా, లిక్కర్ కేసులో నారాయణ స్వామి పాత్ర కూడా కీలకమని సిట్ అధికారులు భావిస్తున్నారు.

అయితే తాజాగా.. లిక్కర్ కేసులో ప్రధాన నిందితుడు

## కొత్త జిల్లాల


# ఏర్పాటు

- ఏపీలో కొత్త జిల్లాల ఏర్పాటు కసరత్తు వేగం
- మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయ సేకరణలో దూకుడు
- కొత్త జిల్లాల పేర్లపై ప్రజల వినతుల వెల్లువ
- వంగవీటి, తిరుపతి -బాలాజీ, పల్నాడు -జాషువా ప్రతిపాదనలు
- ఆరు కొత్త జిల్లాల ప్రతిపాదన : పలాస, అమరావతి, మార్కాపురం, గూడూరు, మదనపల్లె, రాజంపేట
- జిల్లాల సంఖ్య 26 నుంచి 32కి పెరిగే అవకాశాలు

2

అమరావతి-నవభూమి ప్రతినిధి


ఏపీ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు పైన కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం ఈ మేరకు అభిప్రాయ సేకరణ చేస్తోంది. ఎన్నికల



## సహస్రను చంపింది

# పదో తరగతి బాలుడే..!

- కూకట్‌పల్లిలో బాలిక దారుణ హత్య
- 20 కత్తిపోట్లతో పదేళ్ల సహస్ర హత్య
- తలుపు తెరిచే సరికి రక్తపు మడుగులో చిన్నారి
- నిందితుడు 10వ తరగతి చదివే విద్యార్థి
- హుండీ కోసం ప్లాన్, ఆపై హత్య
- హౌ-టు గైడ్ రాసుకున్న బాలుడు
- హత్య 9.30-10.30 మధ్య జరిగిందని పోలీసుల వెల్లడి



2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

కూకట్‌పల్లికి చెందిన పదేండ్ల సహస్ర హత్య కేసులో సంచలన విషయాలు వెలుగు చూశాయి. దొంగతనం కోసం వెళ్లి సహస్రను చంపినట్లు బాలుడు అంగీకరించినట్లు సమాచారం. సహస్ర ఇంటి పక్కన బిల్డింగ్‌లోనే ఆ బాలుడు ఉంటున్నాడు. దొంగతనానికి వెళ్లే ముందు ఒక ప్రణాళికను రచించుకున్నాడు. ఆ ప్రణాళిక ప్రకారం దొంగతనం చేయాలని నిర్ణయించుకున్న తర్వాత.. చోరీకి వెళ్ళేటప్పుడు తన వెంట కత్తి తీసుకెళ్లాడు. సహస్ర తల్లిదండ్రులు బయటికి వెళ్లిన తర్వాత, ఇంట్లోకి చొరబడి రూ.80 వేలు దొంగతనం చేశాడు. దొంగతనం చేస్తుండగా బాలుడిని చూసి సహస్ర కేకలు పెట్టింది. దీంతో దొరికిపోతానని భావించిన బాలుడు.. ఆమెపై కూర్చుని గొంతు నులిమి చంపేశాడు. చనిపోయిందో లేదో అని ఆ తర్వాత గొంతు కోసి కింద పడిపోయిన సహస్ర కడుపులో 18 కత్తిపోట్లు

## కాంగ్రెస్‌లోకి వైసీపీ ఎంపీ?

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో వైసీపీ రాజ్యసభ ఎంపీ మేడా రఘునాథ్ రెడ్డి భేటీ
- ఇండియా కూటమిలో పోటీ చేస్తున్న తెలుగు వ్యక్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇచ్చే అవకాశం
- మేడా కాంగ్రెస్‌లోకి వెళ్తారన్న ప్రచారంపై స్పందించని వైసీపీ

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** ఏపీలో గతేడాది అధికారం కోల్పోయిన తర్వాత విపక్ష వైసీపీకి ఏదీ కలిసి రావడం లేదు. ఇప్పటికే పార్టీకి చెందిన కీలక నేతలు గుడ్ బై చెప్పేసి కూటమిలో చేరిపోతున్నారు. ఇలాంటి వేళ మరో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. వైసీపీకి చెందిన పలువురు ఎంపీలు ఇప్పటికే పార్టీని వీడి బీజేపీ, టీడీపీలో చేరిపోతుండగా.. ఇప్పుడు అనూహ్యంగా మరో ఎంపీ కాంగ్రెస్ పార్టీ తలుపు తట్టారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో ఆయన భేటీ అయ్యారు. వైసీపీ రాజ్యసభ ఎంపీ మేడా రఘునాథ్ రెడ్డి నిన్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో ఢిల్లీలో భేటీ అయినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఓ ఫొటో వైరల్ అవుతోంది. ఇందులో ఆయన ఖర్గేకు పూలగుచ్ఛం ఇస్తున్న దృశ్యం కనిపించింది. దీంతో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారన్న ఊహాగానాలు మొదలయ్యాయి.

## శ్రీలంక మాజీ అధ్యక్షుడు


# రణిల్ విక్రమసింఘే అరెస్టు

- ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసు విచారణ

కొలంబో-నవభూమి ప్రతినిధి

శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘేని అరెస్టు చేశారు. సీఐడీ ఆయన్ను అదుపులోకి తీసుకున్నది. స్థానిక ఛానల్ అదా దెరనా ఈ వార్తను రిపోర్ట్ చేసింది. ఓ కేసులో

2లో



# 8.1 తీవ్రతతో భూకంపం

### అంటార్కిటికా మంచు ఫలకాల్లో భారీ చీలిక

దక్షిణ అమెరికా-నవభూమిబ్యూరో

దక్షిణ అమెరికాలో భారీ భూకంపం సంభవించింది. దీని ప్రభావం అంటార్కిటికాపై తీవ్రంగా పడింది.



2లో

అక్కడి మంచు ఫలకాలు కదలిపోయాయి. డ్రెక్ ప్యాసేజ్ అల్లకల్లోలానికి గురైంది. ఈ భూకంపం వల్ల దక్షిణ అమెరికాలోని చిలీలో పలు నివాసాలు

## చైనాలో చరిత్రలోనే

# అతిపెద్ద సదస్సు!

### మోదీ సహా హాజరుకానున్న 20 మంది ప్రపంచ నేతలు

చైనా-నవభూమిబ్యూరో

2లో

చైనాలోని టియాంజిన్ నగరం ఒక భారీ అంతర్జాతీయ సదస్సుకు వేదిక కానుంది. షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) శిఖరాగ్ర సమావేశం ఈ నెల 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనుందని, ఇది సంస్థ చరిత్రలోనే

## రికార్డు స్థాయిలో తగ్గిన

# బంగారం ధరలు

హైదరాబాద్-నవభూమిబ్యూరో

శుక్రవారం, ఆగస్టు 22న బంగారం ధరలు స్వల్పంగా తగ్గినప్పటికీ, గత కొంతకాలంగా బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం



2లో

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 | హైదరాబాద్ | శనివారం | 23 । ఆగస్టు । 2025







## ఆయనకు రాజకీయంగా మెచ్యురిటీ రాలేదు: జగ్గారెడ్డి

**హైదరాబాద్-నవభూమి:** బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు ఆ పార్టీ ఎమ్మెల్యే కేటీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి మరోసారి మండిపడ్డారు. శుక్రవారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. పదేళ్ల మంత్రిగా పని చేసిన కేటీఆర్‌కి రాజకీయంగా మెచ్యూరిటీ రాలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ దీక్ష.. కాంగ్రెస్ పార్టీ చేసిన డిజైన్ అని అభివర్ణించారు. కేసీఆర్ జాక్‌పాట్ కొట్టాడు. కానీ మా వాళ్ళు కొట్ట లేక పోయారన్నారు. అస్సలు లేకుండా కేసీఆర్ ఉండగలడా? అంటూ ఈ సందర్భంగా ఆయన సందేహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన కేటీఆర్ నోరు జారుతున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో కేటీఆర్ అమ్మమ్మ, తాతయ్య ఉండి ఉంటే.. అతడి చెంపపై కొట్టేవారన్నారు. కేసీఆర్ కుటుంబమంతా డ్రామా ఆర్టిస్టులని ఎద్దేవా చేశారు. తన ప్రశ్నలకు సమాధానం చెప్పే పరిజ్ఞానం కేటీఆర్‌కి ఉందా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబానికి క్యారెక్టర్ లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇవ్వక పోతే మీరెవరో ప్రజలకు కూడా తెలియక పోయేదని వ్యంగ్యంగా అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నీకు చిల్లర పార్టీ అయిందా? అంటూ కేటీఆర్‌పై నిప్పులు చెరిగారు. నీ కుటుంబమంతా.. సోనియా గాంధీ ఇంటికి వెళ్లినప్పుడు చిల్లర పార్టీ అనిపించ లేదా? అంటూ కేటీఆర్‌కు ఈ సందర్భంగా జగ్గారెడ్డి చురకలంటించారు. కేసీఆర్ కుటుంబం.. రాజకీయంగా వెలుగుతుందంటే అందుకు కారణం కాంగ్రెస్ పార్టీనే అని ఆయన వివరించారు. కాంగ్రెస్ వల్లే తెలంగాణ వచ్చిందని కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన విషయాన్నికేటీఆర్ అప్పుడే మర్చిపోయాడా? అంటూ ప్రశ్నించారు. కేసీఆర్ రాజకీయ పాఠాలు నేర్చుకున్నది కాంగ్రెస్ పార్టీ నుంచే కదా అని ఆయన వివరించారు.

## శ్రీలంక మాజీ అధ్యక్షుడు రాణిల్ విక్రమసింఘే అరెస్టు

**(1వపేజీ తరువాయి)**వాంగ్మూలం ఇచ్చేందుకు సీఐడీ ఆఫీసుకు వెళ్లిన ఆయన్ను అరెస్టు చేశారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులో విక్రమ్‌సింఘేను ప్రశ్నిస్తున్నారు. సెప్టెంబర్ 2023లో ఆయన లండన్ పర్యటనకు వెళ్లారు. ఆ అంశానికి సంబంధించిన కేసులో విక్రమసింఘేను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. బ్రిటీష్ యూనివర్సిటీలో విక్రమసింఘే భార్యను సత్కరించే కార్యక్రమం కోసం ఆయన వెళ్లారు. విక్రమసింఘేను కొలంబో ఫోర్ట్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తున్నట్లు అధికారి తెలిపారు. వ్యక్తిగత కారణాల కోసం ప్రభుత్వ నిధులను వాడుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయని ఆ అధికారి చెప్పారు.

## సహస్రను చంపింది పదో తరగతి బాలుడే..!

**(1వపేజీ తరువాయి)**పొడిచాడు. అనంతరం పక్క బిల్డింగ్ లోకి దూకి పదిహేను నిమిషాల పాటు తల దాచుకున్నాడు. అయితే బాలుడు పారిపోతుండగా.. ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గమనించి, పోలీసులకు సమాచారం అందించాడు. దాంతో సహస్ర హత్య వెలుగు చూసింది. ప్రస్తుతం బాలుడు కూకట్‌పల్లి పోలీసులు అదుపులో ఉన్నట్లు తెలుస్తుంది.

దొంగతనానికి వచ్చే ముందు దొంగతనం ఎలా చేయాలో, ఎలా తప్పించుకోవాలో, అడ్డొస్తే ఏం చేయాలో పక్క ప్లాన్‌తో ఒక పేపర్‌పై ప్రణాళికను రాసిపెట్టుకున్నాడు. హౌ టూ ఓపెన్ డోర్, హౌ టు బ్రేక్ హుండీ, హౌ టు ఎస్కేప్ హౌస్ అంటూ రాసుకున్నాడు. ఈ పేపర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఇక ఈ కేసు విచారణలో భాగంగా బాలుడు పలు కట్టుకథలు చెప్పాడు. కానీ చివరకు నేరాన్ని అంగీకరించినట్లు సమాచారం. నోరు విప్పకపోవడంతో బాలుడి ఇంట్లో తనిఖీలు చేయగా కత్తి, రక్తపు గుర్తులతో ఉన్న బట్టలు లభ్యమవడంతో అవి స్వాధీనం చేసుకొని బాలుడిని అరెస్టు చేసి విచారించగా నిజాన్ని ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. తర్వలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

## 8.1 తీవ్రతతో భూకంపం అంటార్కిటికా మంచు ఫలాకాల్లో భారీ చీలిక


**(1వపేజీ తరువాయి)**దెబ్బతిన్నట్లు సమాచారం అందింది. దక్షిణ అమెరికా- అంటార్కిటికా మధ్య చిలీ సమీపంలో అక్కడి కాలమానం ప్రకారం.. ఈ తెల్లవారు జామున 2:16 నిమిషాలకు భూకంపం సంభవించినట్లు యునైటెడ్ స్టేట్స్ జియాలాజికల్ సర్వే తెలిపింది. అర్జెంటీనా సదరన్ సిటీ ఉషుయ్ కు దక్షిణ దిశగా 700 కిలోమీటర్ల దూరంలో గల ప్రాంతాన్ని భూకంప కేంద్రంగా గుర్తించింది. ఈ భూకంపం ధాటికి 7.5 తీవ్రతతో డ్రెక్ ప్యాసేజ్ కంపించింది. దక్షిణ అమెరికా- అంటార్కిటిక్ ద్వీపకల్పం మధ్య ఉన్న కీలక ప్రాంతం ఇది. డ్రెక్ పాసేజ్ దక్షిణ అమెరికా భూభాగానికి దగ్గరగా ఉండటం, దాని టెక్టోనిక్ ప్లేట్ల నిర్మాణం కారణంగా సునామీ ముప్పు ఎక్కువగా ఉంటుంది. డ్రెక్ పాసేజ్ అంటే ఏమిటి? ఎక్కడ ఉంది? డ్రెక్ పాసేజ్.. సుమారు 800 నుండి 1,000 కిలోమీటర్ల వెడల్పు ఉన్న సముద్ర మార్గం. చిలీలోని కేప్ హార్న్, అంటార్కిటికా సమీపంలోని సౌత్ షెట్లాండ్ దీవుల మధ్య ఉంటుంది. ఈ సీ రూట్.. నైరుతి అట్లాంటిక్ మహాసముద్రంతో ఆగ్నేయ పసిఫిక్ మహాసముద్రాన్ని కలుపుతుంది. అంటార్కిటికా వెళ్లడానికి ఇదే ప్రధాన సముద్ర మార్గం. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన అంటార్కిటిక్ సర్కమ్ పోలార్ కరెంట్ ఇక్కడి నుంచే ప్రవహిస్తుంది. భౌగోళికంగా- డ్రెక్ పాసేజ్ వాతావరణ మార్పులు- నియంత్రణ, సముద్ర జీవ వైవిధ్యానికి అత్యంత కీలకమైనదిగా శాస్త్రవేత్తలు భావిస్తుంటారు.

### చైనాలో చరిత్రలోనే అతిపెద్ద సదస్సు!

## మోదీ సహా హాజరుకానున్న 20 మంది ప్రపంచ నేతలు

**(1వపేజీ తరువాయి)**అతిపెద్దదిగా నిలవనుందని చైనా శుక్రవారం ప్రకటించింది. ఈ కీలక సమావేశానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ సహా సుమారు 20 మంది ప్రపంచ దేశాల అధినేతలు హాజరుకానున్నారు. ఈ వివరాలను చైనా విదేశాంగ శాఖ సహాయ మంత్రి లియు బిన్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఎస్సీఓ కూటమికి ఈ ఏడాది చైనా అధ్యక్షత వహిస్తోందని, ఆతిథ్య దేశంగా నిర్వహిస్తున్న ఐదో సదస్సు ఇదేనని ఆయన తెలిపారు. ఈ సదస్సులో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటారని ధృవీకరించారు. వీరితో పాటు టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రభోవో సుబియాంటో, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, వియత్నాం ప్రధాని ఫామ్ మిన్ చిన్ వంటి ప్రముఖ నేతలు కూడా ఈ భేటీలో పాల్గొంటారని లియు బిన్ వివరించారు. దక్షిణాసియా నుంచి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీ, మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు కూడా హాజరవుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్‌తో పాటు 10 అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా ఈ సదస్సుకు రానున్నారు. ప్రస్తుతం ఎస్సీఓ కూటమిలో రష్యా, భారత్, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిజ్‌స్థాన్, పాకిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, బెలారస్, చైనా సభ్యదేశాలుగా ఉన్నాయి.

## గుడ్ న్యూస్.. ఆ శాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. 1623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి రేవంత్ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని హాస్పిటల్‌లో 1616, ఆర్టీసీ హాస్పిటల్‌లో 7 పోస్టులు భర్తీ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆయా దరఖాస్తులకు సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ గడువు విధించింది తెలంగాణ ప్రభుత్వం. ఈ పోస్టుల భర్తీతో తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరుగనున్నాయి. జిల్లా, ఏరియా హాస్పిటళ్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు మరింత మెరుగవనున్నాయి. పల్లెలకు స్పెషాలిటీ వైద్య సేవలు చేరువ అవనున్నాయి. ఆరోగ్యశాఖలో ఇప్పటికే సుమారు 8 వేల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. మరో 7 వేల పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది.

# కేసీఆర్, హరీష్‌లకు షాక్!

**(1వపేజీ తరువాయి)**8 బి, 8డి కింద నోటీసు ఇవ్వలేదని కోర్టుకు తెలిపారు. దీంతో హైకోర్టు న్యాయమూర్తులు జోక్యం చేసుకుని.. 8బి నోటీస్ కాకుండా సెక్షన్ 5(1) ఎందుకు ఇచ్చారంటూ ప్రభుత్వ తరపు న్యాయవాది ఏజీని సూటిగా ప్రశ్నించారు. తాము ఇచ్చిన నోటీస్ 8బి లాంటి నోటీసని కోర్టుకు ఏజీ తెలిపారు. హరీష్ రావు, కేసీఆర్ అసెంబ్లీలో సభ్యులుగా ఉన్నారని ఈ సందర్భంగా కోర్టుకు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో ఈ నివేదిక పెట్టిన తర్వాతే చర్యలు తీసుకుంటామన్న ఏజీ వెల్లడించారు. ఆ క్రమంలో ఈ నివేదిక అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి ఆరు నెలలు సమయం ఉంటుందని కోర్టుకు ఏజీ వివరించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు పగుళ్లు ఏర్పాడ్డాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. దాదాపు 13 నెలల పాటు వందలాది మందిని విచారించింది. అలాగే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, ఈటల రాజేందర్‌లను సైతం విచారించి.. కమిషన్ నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి కర్మ, కర్త, క్రియా అంతా కేసీఆర్ అంటూ ఈ విచారణలో తేటతెల్లమైంది. ఈ నేపథ్యంలో ఈ కమిషన్ నివేదికను రద్దు చేయాలంటూ బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, హరీష్ రావులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై గురువారం విచారణ జరిపింది.

ఈ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన అనంతరం బీఆర్ఎస్ అగ్రనేతలపై చర్యలు ఉంటాయా? లేకుంటే ముందే ఉంటాయా అంటూ ఏజీని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై తమకు రేపటి వరకు గడువు ఇవ్వాలని కోరింది. దీంతో శుక్రవారం ఈ కేసును హైకోర్టు విచారించింది. దీంతో హైకోర్టు న్యాయమూర్తులు పై విధంగా స్పందించారు.

## రికార్డు స్థాయిలో తగ్గిన బంగారం ధరలు

**(1వపేజీ తరువాయి)**ధర రూ. 1,02,460 గా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 92,700 గా ఉంది. అదేవిధంగా, కిలో వెండి ధర రూ. 1,17,096 వద్ద రికార్డ్ స్థాయిలో ఉంది. బంగారం ధరలు పెరగడానికి కారణాలు గత నెలరోజులుగా బంగారం ధరలు లక్ష రూపాయల పైనే ట్రేడ్ అవుతున్నాయి. ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణం అంతర్జాతీయ మార్కెట్లో ఏర్పడిన అనిశ్చితి. ముఖ్యంగా, అమెరికా మార్కెట్లపై ప్రపంచవ్యాప్తంగా నెగిటివ్ సెంటిమెంట్ పెరిగిన నేపథ్యంలో, పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను సురక్షితమైన మార్గాల వైపు మళ్ళిస్తున్నారు. బంగారం అనేది ఎప్పుడూ ఒక సురక్షితమైన పెట్టుబడి సాధనంగా పరిగణించబడుతుంది. అందుకే, అనేక మంది ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను పెద్ద మొత్తంలో బంగారం వైపు మళ్లిస్తున్నారు. ఇది బంగారం ధరలు భారీగా పెరగడానికి ముఖ్య కారణమని చెప్పవచ్చు. ' వెండి ధరలు పెరగడానికి కారణాలు బంగారంతో పాటు వెండి ధరలు కూడా చరిత్రలో ఎన్నడూ లేనంతగా పెరిగాయి. కిలో వెండి ధర రూ. 1.28 లక్షల వరకు చేరి, బంగారం ధరతో పోటీ పడుతోంది. వెండి ధరల పెరుగుదలకు ప్రధాన కారణం పారిశ్రామిక డిమాండ్. ఎలక్ట్రానిక్స్ రంగం: ఎలక్ట్రానిక్ వాహనాలు, వస్తువుల తయారీలో వెండిని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. సోలార్ ప్యానెల్స్: సోలార్ ప్యానెల్స్ తయారీలో కూడా వెండికి పెరుగుతున్న డిమాండ్, దాని ధరను గణనీయంగా పెంచుతోంది. ' పెరుగుతున్న ఈ డిమాండ్ కారణంగా పెట్టుబడిదారులు వెండి వైపు కూడా ఆకర్షితులవుతున్నారు. మొత్తంగా, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, పారిశ్రామిక డిమాండ్ వంటి అనేక కారణాల వల్ల బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిలో పెరిగి, పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. భవిష్యత్తులో ఈ ధరల ఒడిదుడుకులు ఎలా ఉంటాయో చూడాలి.

# సురవరం ఇక లేరు

**(1వపేజీ తరువాయి)**ఆయన ప్రాణవాయువును అందించే ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను వినియోగిస్తున్నా రు. సురవరం సుధాకర్ రెడ్డికి భార్య విజయలక్ష్మి, కుమారులు నిఖిల్, కపిల్ ఉన్నారు. అమెరికాలో ఉన్న పెద్ద కుమారుడు నిఖిల్ ఆదివారం ఉదయానికి భారత్ చేరుకుంటారని సమాచారం. అప్పటివరకు సుధాకర్‌రెడ్డి భౌతికకాయాన్ని గచ్చిబౌలి కేర్ మార్చురీలో ఉంచుతామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. పార్టీ కార్యకర్తలు, అభిమానుల సందర్శనార్థం హిమాయత్‌నగర్‌లోని మగ్దూం భవన్‌లో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ భౌతికకాయాన్ని ఉంచనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గాంధీ వైద్యకళాశాలకు సుధాకర్‌రెడ్డి భౌతికకాయాన్ని అప్పగిస్తామని నారాయణ వెల్లడించారు. కాగా.. సురవరం నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి ఇచ్చారు.


తెలంగాణ వైతాళికుడు, గోల్కొండ పత్రిక వ్యవస్థాపకుడు సురవరం ప్రతాపరెడ్డి తమ్ముడు వెంకటరామిరెడ్డి కుమారుడు సుధాకర్‌రెడ్డి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కొండ్రావుపల్లి గ్రామంలో 1942, మార్చి 25న జన్మించారు. ఉన్నత, కళాశాల విద్య కర్నూలులో పూర్తిచేసి... హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం(ఎల్ఎల్‌బీ) చదివారు. ఒకవైపు పెదనాన్న సాంస్కృతిక ఉద్యమ ఆదర్శాలను, మరోవైపు తండ్రి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని పుణికిపుచ్చుకున్న సుధాకర్‌రెడ్డి... చిన్నవయసులోనే సమస్యలపై పోరుబాట పట్టారు. కర్నూలులో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సమయంలో బ్లాక్‌బోర్డు, చాక్‌పీస్ వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంపై నిరసన చేపట్టారు. అది ఉద్యమంగా రూపుదిద్దుకొని నగరంలోని మిగతా విద్యాలయాలకు వ్యాపించింది. విద్యార్థి దశలోనే సమస్యలపై శంఖారావం పూరించిన సురవరం... తర్వాత ఏఐఎస్ఎఫ్ కర్నూలు పట్టణ కార్యదర్శిగా, తర్వాత జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. డిగ్రీ పూర్తి చేసిన అనంతరం విజయవాడ విశాలాంధ్ర పత్రికలో చేరారు. అందులో విలేకరిగా పనిచేస్తున్న సమయంలో.. పార్టీ ఆదేశానుసారం హైదరాబాద్‌లో విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు 1965లో ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీలో చేరారు. ఆ మరుసటి ఏడాది ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రెండు దశాబ్దాల పాటు 21 ఏళ్లు నిండిన వారికే ఓటు హక్కు ఉండేది. మరో యువజన నేత కేరళకు చెందిన చంద్రప్పన్‌తో కలసి సురవరం... 18ఏళ్లకే ఓటు హక్కు కల్పించాలని పెద్ద ఉద్యమాన్ని లేవదీశారు. వారి పోరాట ఫలితంగానే ఓటు హక్కు వయసు 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించినట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతారు. రాజకీయ, సామాజిక, చారిత్రక విషయాలను విశ్లేషణాత్మకంగా వివరిస్తూ ఉపన్యసించడం ఆయన ప్రత్యేకత. ఆ వాగ్ధాటితో ఎంతోమందిని ప్రభావితం చేశారు. యువజన ఉద్యమంలో ఉన్న సమయంలోనే ప్రత్యేక శిక్షణ తరగతులకు రష్యా వెళ్లిన సమయంలో.. తమ పార్టీకి చెందిన విజయలక్ష్మితో పరిచయం ఏర్పడింది. అలా కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంస్థలలో పనిచేస్తున్న ఇరువురు 1974 ఫిబ్రవరి 19న వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. సుధాకర్‌రెడ్డి పార్లమెంటు సభ్యుడిగా ఉన్న సమయంలోనే.. తన ఇద్దరు కుమారులకూ సాదాసీదాగా ఒకే రోజు, ఒకే పెళ్లి పందిరిలో ఒకే ముహూర్తానికి వివాహాలు జరిపించారు.

సీపీఐలో క్రియాశీల కార్యకర్తగా చేరిన సురవరం సుధాకర్‌రెడ్డి.. పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. 1971లో జాతీయ సమితి సభ్యునిగా పనిచేశారు. మూడేళ్లపాటు ఢిల్లీలో ఉన్నారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి ఇక్కడి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1985, 1989, 1994 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేశారు. తొలిసారి 1998 లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించారు. అదే ఏడాది సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆతర్వాత 2004లో ఎంపీగా ఎన్నికయ్యాక.. కార్మికశాఖ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేయటంతోపాటు అనేక పార్లమెంటరీ కమిటీలకు ఛైర్మన్‌గా పనిచేశారు. 2012 మార్చి 31న జరిగిన 21వ పార్టీ కాంగ్రెసలో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2012 నుంచి 2019 వరకు ఆ పదవిలో మూడు పర్యాయాలు సేవలందించారు. చంద్ర రాజేశ్వరరావు తర్వాత సీపీఐ పగ్గాలు చేపట్టిన తెలుగు నేత సురవరం సుధాకర్‌రెడ్డి కావడం విశేషం.

సురవరం సుధాకర్ రెడ్డి 1998లో.. 12వ లోక్‌సభకు నల్లగొండ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 2004లో రెండోసారి అదే నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. ఎంపీగా.. నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్య శాశ్వత పరిష్కారానికి విశేషంగా కృషి చేశారు. జిల్లాలో సాగునీటి పథకాల పూర్తికి, కేంద్రం నుంచి అవసరమైన అనుమతి సాధించేందుకు కృషి చేశారు. జిల్లాలో కరువు, సాగునీటి ఎద్దడిపై ఆయన పోరాటం చేశారు. ఒకప్పుడు విశాలాంధ్ర ఉద్యమానికి ఊనికగా నిలిచిన భారత కమ్యూనిస్టు పార్టీ.. మలిదశ తెలంగాణ పోరాటంలో తన పంథా మార్చుకోడానికి ప్రధాన కారణం సురవరం సుధాకర్‌రెడ్డి వ్యూహాత్మక నిర్ణయమని ఆ పార్టీ నేతలు చెబుతారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నా, అనారోగ్యంతో ఉన్నా... సుధాకర్‌రెడ్డి పార్టీ కార్యక్రమాలకు హాజరుకాకుండా ఎప్పుడూ ఉండలేదు. ప్రతి కార్యక్రమంలో, పోరాటంలో చురుగ్గా పాల్గొనేవారు. చివరిసారిగా గత డిసెంబరు నెలలో నల్లగొండలో సీపీఐ బహిరంగసభకు హాజరయ్యారు.

## రాష్ట్ర బీజేపీ చీఫ్ అరెస్ట్.. ఖండించిన కేంద్ర మంత్రి




**హైదరాబాద్-నవభూమి:**గ్రేటర్ హైదరాబాద్‌లోని ప్రజా సమస్యలై సెక్రటేరియ్ వద్ద నిరసన కార్యక్రమానికి బీజేపీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో చేవెళ్ల పర్యటనలో ఉన్న బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావును మొయినాబాద్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో అక్రమ అరెస్టులతో రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకనే ప్రయత్నం చేస్తుందని బీజేపీ రాష్ట్ర చీఫ్ రామచందర్ రావు మండిపడ్డారు.

**అరెస్ట్‌పై స్పందించిన కేంద్ర మంత్రి..**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. చేవెళ్లలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న ఆయన్ని ఎందుకు అరెస్ట్ చేశారని ఈ సందర్భంగా పోలీసులను ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం గత బీఆర్ఎస్ బాటలోనే పయనిస్తుందని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తల అరెస్టులతో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలనుకుంటుందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. అయినా బీజేపీ అంటే అంత భయమెందుకు అని రేవంత్ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు.

ప్రజాస్వామ్య పద్దతిలో నిరసన చేస్తున్న బీజేపీ కార్యకర్తలను అరెస్ట్ చేయడం సిగ్గుచేటు అని అభివర్ణించారు. తక్షణమే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే అరెస్టయిన బీజేపీ కార్యకర్తలందరినీ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి సూచించారు. లేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

## తాను చనిపోతూ.. మరో ఏడుగురికి ప్రాణదానం



**హైదరాబాద్-నవభూమి:** బ్రెయిన్ డెడ్‌కు గురైన ఓ యువకుడి అవయవ దానంతో ఏడుగురికి ప్రాణదానం చేశారు. జీవన్‌దాన్ వైద్యులు తెలిసిన వివరాల ప్రకారం రంగా రెడ్డి జిల్లా జనప్రియ వెస్ట్ సిటీ, మియాపూర్‌కు చెందిన భువనగిరి కృష్ణ సుమంత్ (37) ప్రైవేట్ ఉద్యోగి. ఈనెల 18న ద్విచక్రవాహనంపై వెళుతూ బైక్‌పై నుంచి పడిపోయాడు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణ సుమంత్ బ్రెయిన్‌డెడ్‌కు గురైనట్టు వైద్యులు నిర్ధారించారు. జీవన్‌దాన్ ప్రతి నిధులు అవయవ దానంపై ఆయన తండ్రి నరేందర్‌కు అవగాహన కల్పించడంతో ఆయన అందుకు అంగీకరించారు

## సిట్ అదుపులో మాజీ డిప్యూటీ సీఎం?

**(1వపేజీ తరువాయి)**రాజ్ కెసిరెడ్డికి చెందిన మరిన్ని విలువైన ఆస్తులు, బ్యాంకు ఖాతాలను సీజ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో కెసిరెడ్డి సహా పలువురు నిందితులు, పలు సంస్థలకు చెందిన రూ.62 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండు జీవోల ద్వారా ఇప్పటికే అనుమతులు ఇచ్చింది. మరో రూ.13 కోట్లకు పైగా విలువ చేసే ఆస్తులు, బ్యాంకు ఖాతాలను జప్తు చేసేందుకు సీఐడీకి అనుమతులు జారీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో అక్రమ మద్యం అమ్మకాలతో వచ్చిన ముడుపుల ద్వారా పలు చోట్ల తన కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట రూ.కోట్ల విలువ చేసే ఆస్తులు కొనుగోలు చేసినట్టు సీఐడీ విచారణలో తేలింది. వీటిని సీజ్ చేసేందుకు అనుమతించాలని సీఐడీ రాష్ట్రప్రభుత్వాన్ని కోరడంతో అనుమతి మంజూరు చేసింది. కేసిరెడ్డి ప్రస్తుతం విజయవాడ జిల్లా జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.

## కాంగ్రెస్‌లోకి వైసీపీ ఎంపీ?

**(1వపేజీ తరువాయి)**ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ కు మద్దతిస్తూ వైసీపీ నిర్ణయం తీసుకున్న వేళ ఆయన ప్రత్యర్థిగా నిలబడిన తెలుగువ్యక్తి సుదర్శన్ రెడ్డికి మద్దతిచ్చిన కాంగ్రెస్ పార్టీ ఛీఫ్ ను అదే పారీ గతేడాది ఫిబ్రవరిలో వైసీపీ తరఫున మేడా రఘునాథ్ రెడ్డి రాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యారు. ఆయన పదవీకాలం మరో ఐదేళ్లు ఉంది. ఇలాంటి సమయంలో ఆయన కాంగ్రెస్ అధ్యక్షుడి ని కలవడంతో రాష్ట్రంలో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. ఇప్పటికే వైసీపీకి పార్లమెంట్‌లో ఉన్న మొత్తం 11 మంది ఎంపీల్లో నలుగురు పార్టీని వీడారు. వీరిలో మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్ కృష్ణయ్య, విజయసాయిరెడ్డి ఉన్నారు. మరో ఎంపీ మిథున్ రెడ్డి మద్యం స్కాం కేసులో రాజమండ్రి జైల్లో ఉన్నారు. మరో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి వివేకా హత్య కేసులో రేపోమాపో బెయిల్ రద్దు అయితే జైలుకు వెళ్లక తప్పదు. ఈ నేపథ్యంలో మిగిలిన ఐదుగురు ఎంపీల్లో ఒకరైన మేడా రఘునాథ్ రెడ్డి ఇలా కాంగ్రెస్ బాస్‌ను కలవడం రాజకీయంగా చర్చనీయాంశమవుతోంది. దీనిపై వైసీపీ ఇప్పటివరకూ స్పందించలేదు.

## తుపాకులు వదిలి డ్రగ్స్ దందా

**(1వపేజీ తరువాయి)**గంటల వ్యవధిలోనే విద్యుత్ మీటర్ మంజూరు కావడంపై అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అధికారుల ప్రమేయం లేకుండా ఇంత పెద్ద డ్రగ్స్ ఫ్యాక్టరీని నడపడం అసాధ్యమని, ఈ కోణంలో కూడా దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసుకు సంబంధించి సూరత్, ముంబై నగరాల్లో మరో ఐదుగురిని అరెస్టు చేయడంతో ఈ నెట్‌వర్క్ దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్నట్లు స్పష్టమైంది.

### 50 గంటల అరెస్టుతో ఉద్యోగిని సస్పెండ్ చేస్తుంటే

## సీఎం, పీఎంలకు ఎందుకు వర్తించదు?

**(1వపేజీ తరువాయి)**ఉంటే వారిని పదవి నుంచి తొలగించేలా రూపొందించిన బిల్లును ఇటీవలె అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టగా.. దాన్ని జేపీసీ పరిశీలనకు పంపించారు. కనీసం 5 ఏళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడిన నేతలు అరెస్ట్ అయి.. నెల రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారిని పదవి నుంచి తొలగించేలా ఈ బిల్లులో నిబంధన పెట్టారు. వారు రాజీనామా చేయకపోయినా ఈ చట్టం ప్రకారం ఆటోమేటిగ్‌గా పదవిని కోల్పోతారు. అయితే నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. ప్రతిపక్ష పాలిత సీఎంలపై, మంత్రులపై రాజకీయ కక్ష తీర్చుకునేందుకే ఇలాంటి బిల్లును తీసుకువస్తోందని ఆరోపిస్తున్న ప్రతిపక్ష పార్టీలు.. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.


## కొత్త జిల్లాల ఏర్పాటు

**(1వపేజీ తరువాయి)**సమయంలో ఇచ్చిన హామీల అమలుతో పాటుగా అవసరమైన మార్పుల దిశగా నిర్ణయం చేయనుంది. జిల్లాల వారీగా సబ్ కమిటీలోని మంత్రులు పర్యటనలు చేసి.. తుది నివేదిక సిద్దం చేయనున్నారు. కొత్తగా జిల్లా పేర్ల విషయంలోనూ వినతులు వస్తున్నాయి. అదే విధంగా మండలాల పైనా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. దీనికి సంబంధించి తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏపీలో కొత్త జిల్లాలు – మండలాలు ఏర్పాటు... పేర్ల మార్పు పైన సుదీర్ఘ కసరత్తు జరుగుతోంది. ఈ అంశం పైన ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం ఇప్పటికే సమావేశాలు నిర్వహిస్తోంది. పలు జిల్లా ల పేర్లు మార్పు పైన వినతులు వస్తున్నాయి. క్రిష్ణా జిల్లాకు వంగవీటి పేరు, తిరుపతికి బాలాజీ పేరు, పల్నాడుకు జాషువా పేర్లు పెట్టాలనే ప్రతిపాదనలు అందాయి. ఇక.. రాష్ట్రంలో 6 కొత్త జిల్లాలు ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. ప్రతిపాదిత కొత్త జిల్లాలుగా పలాస, అమరావతి, మార్కాపురం, గూడూరు, మదనపల్లె, రాజంపేట మారనున్నట్లు తెలిసింది. ఇందులో ఒకట్రెండు స్థానాల్లో మార్పులు, చేర్పులు ఉండొచ్చు. ఇప్పటికే ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం జిల్లాల్లో పర్యటించి ప్రభుత్వానికి తుది నివేదిక ఇవ్వనుంది. కాగా, ప్రస్తుతం ఉన్న 26 జిల్లాలు 32కు పెరగనున్నట్లు తెలిసింది. అలాగే పునర్విభజనలో భాగంగా కొన్ని జిల్లాల కేంద్రాల మార్పు, రెవెన్యూ డివిజన్ల సర్దుబాట్లు ఉండే అవకాశం ఉంది. ఇక.. రాజధాని అమరావతిని ప్రత్యేక జిల్లాగా ఖరారు చేసే అవకాశం కనిపిస్తోంది. మంత్రివర్గ ఉప సంఘ సభ్యులు జిల్లాల వారీగా పర్యటించి అభిప్రాయ సేకరణ చేయనున్నారు. మూడు బృందాలుగా మంత్రులు జిల్లా పర్యటన చేయాలని నిర్ణయించారు. ఈ నెల 29 30 తేదీల్లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల్లో మంత్రులు అనగాని సత్యప్రసాద్, బిసి జనార్దన్ రెడ్డి, అనిత పర్యటించనున్నారు. అదే విధంగా సెప్టెంబర్ 2న అల్లూరి జిల్లాలో పర్యటన ఉంటుంది. ఈ నెల 29 న పశ్చిమగోదావరి కృష్ణా జిల్లాల్లో మంత్రులు మనోహర్, నారాయణ పర్యటన చేయనున్నారు. 30 న చిత్తూరు, కడప జిల్లాల్లో.. అదే రోజున ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మంత్రులు రామానాయుడు, సత్యకుమార్ పర్యటించున్నారు. గంటూరులో సెప్టెంబర్ 2న పర్యటించనున్న మంత్రివర్గ ఉప సంఘం తమ వద్దకు వచ్చిన అన్ని అభిప్రాయాలు.. సూచనలకు క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. దీని పైన సంక్రాంతి వేళ ప్రభుత్వం కొత్త జిల్లాల పైన నిర్ణయం వెల్లడించే అవకాశం కనిపిస్తోంది.

## రూ.5 వేలు లంచం తీసుకుంటు పట్టుబడ్డ సబ్ రిజిస్ట్రార్

**ఆదిలాబాద్ -నవభూమి:** ఏసీబీ వలకు మరో అధికారి చిక్కాడు. లంచం తీసుకుంటూ ఆదిలాబాద్ జిల్లా సబ్ రిజిస్ట్రార్ పట్టుబడ్డాడు. శుక్రవారం మధ్యాహ్నం రిజిస్ట్రార్ కార్యాయంలో బాధితుడు మన్నూర్‌ఖాన్ నుంచి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ రెడ్డి రూ. 5 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. బేల మండలం సిరిసన్నకు చెందిన మన్నూర్ ఖాన్ గిఫ్ట్ డీడ్ కోసం డాక్యుమెంట్ రైటర్ ద్వారా రిజిస్ట్రార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు.






## త్వరలో భారత్‌లో ఓపెన్ ఏఐ తొలి ఆఫీస్.. ఉద్యోగ నియామకాలు చేపట్టిన సంస్థ..!

**న్యూఢిల్లీ-నవభూమి:** చాట్‌జీపీటీ మాతృసంస్థ ఓపెన్‌ఏఐ భారత్‌లో తన కార్యకలాపాలను విస్తరించడంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. ఇందులో భాగంగానే ఇటీవలే 'చాట్‌జీపీటీ గో' పేరుతో సరికొత్త, చవకైన సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. కేవలం రూ.399కే ఈ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. భారత్‌లో ఓపెన్ ఏఐ టూల్స్‌కు మంచి డిమాండ్ దృష్ట్యా భారత వినియోగదారులకు చవకైన సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ను తెచ్చింది. ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లో తన తొలి ఆఫీస్‌ను ఓపెన్ చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఈ ఏడాది చివరికల్లా దేశరాజధాని న్యూ ఢిల్లీ లో కార్యాలయం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. భారత్‌లో చాట్ జీపీటీ వినియోగం గణనీయంగా పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే ఉద్యోగ నియామకాలు కూడా చేపట్టినట్లు తెలిపాయి. ఈ మేరకు కంపెనీ వర్గాలను ఊటంకిస్తూ ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ నివేదించింది. మరోవైపు భారత్‌లో ఏఐకి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని ఓపెన్ ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మాన్ అన్నారు. భారత్‌లో తొలి ఆఫీస్‌ను ప్రారంభించి స్థానిక టీమ్‌ను ఏర్పాటు చేయడం, ఆ మిషన్‌కు కట్టుబడి భారత్‌లో కృత్రిమ మేధను మరింత అందుబాటులోకి తెస్తామన్న నిబద్ధతకు ఇది తొలి మొట్టు అని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
శనివారం
23 । ఆగస్టు । 2025

## బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పదేళ్లలో 20 తొక్కిసలాటలు.. అసెంబ్లీ వేదికగా ప్రతిపక్షాలపై కర్ణాటక సీఎం ఫైర్




**బెంగళూరు-నవభూమి:** బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన తీవ్ర విమర్శలకు దారితీసింది. కర్ణాటక సర్కారు వైఫల్యంవల్లే తొక్కిసలాట జరిగిందని నాటి నుంచి ఈ ఘటనపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ విమర్శలపై సీఎం సిద్ధరామయ్య శుక్రవారం అసెంబ్లీ వేదికగా స్పందించారు. గత పదేళ్లలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 20 తొక్కిసలాట ఘటనలు జరిగాయని, వాటిపై భాజపా నేతలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. 2008లో హిమాచల్ ప్రదేశ్‌లోని నైనాదేవి ఆలయంలో తొక్కిసలాట, అదే ఏడాది జోధ్‌పూర్ తొక్కిసలాట, 2021లో హరిద్వార్ తొక్కిసలాట, 2013లో రతన్‌గఢ్ తొక్కిసలాట, 2023లో మధ్యప్రదేశ్‌లో తొక్కిసలాట, 2024 హాత్రాస్‌లో తొక్కిసలాట ఘటనలు జరిగాయని, ఆ ఘటనల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయినప్పుడు బీజేపీ నేతలు ఏం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఏడాది జనవరిలో ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన కుంభమేళాలో తొక్కిసలాట జరిగి 39 మంది ప్రాణాలు కోల్పోతే ఆ రాష్ట్ర ప్రభుత్వం మృతుల వివరాలు కూడా వెల్లడించలేదని సిద్ధరామయ్య ఆరోపించారు. 'ఆర్సీబీ తొలిసారి ఐపీఎల్ టైటిల్ గెలువడంతో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో సంబురాలు నిర్వహించారు. ఈ సంబురాలకు అభిమానులు భారీ సంఖ్యలో హాజరుకావడంతో తొక్కిసలాట జరిగింది. ఒక్కోసారి ప్రజల అభీష్టానికి తలవంచాల్సి వస్తుంది. కాబట్టి మేం కూడా విజయోత్సవాల్లో పాల్గొన్నాం' అని చెప్పారు. కాగా ఈ ఏడాది జూన్‌లో చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందగా.. 50 మందికిపైగా గాయపడ్డారు. ఈ ఘటన అప్పట్లో కలకలం రేపింది. ఘటనపై దర్యాప్తునకు కర్ణాటక ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఈ కమిషన్ పలువురు ప్రత్యక్ష సాక్షులు, క్రికెట్ సంఘం అధికారులు, పోలీస్ అధికారుల వాంగ్మూలాలను రికార్డు చేసింది. ఆర్సీబీ విజయోత్సవ ఈవెంట్‌లో తీవ్ర భద్రతా వైఫల్యం ఉన్నట్లు గుర్తించింది. స్టేడియం లోపల కేవలం 79 మంది పోలీసులను మాత్రమే మోహరించారని, ఘటనా స్థలం వద్ద అంబులెన్స్‌లు లేవని తెలిపింది. పోలీసు యంత్రాంగం వైఫల్యం స్పష్టంగా ఉందని నివేదికలో కమిషన్ పేర్కొంది. ఇప్పటికే ఈ ఘటనకు సంబంధించి ఆర్సీబీ, కర్ణాటక క్రికెట్ బోర్డు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థపై పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. కర్ణాటక హైకోర్టు కూడా ఈ కేసును విచారిస్తున్నది.

## వెబ్‌సీరిస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మాజీ బాడీగార్డ్



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రధాని నరేంద్ర మోదీ మాజీ బాడీగార్డ్ , రా ఏజెంట్‌గా పనిచేసిన లక్కీబిష్త్ నటుడిగా అరంగేట్రం చేశారు. 'సేన గార్డియన్స్ ఆఫ్ ది నేషన్ )' వెబ్‌సిరీస్‌లో అతిథి పాత్రలో ఆయన మెరిశారు. మేకర్స్ ప్రత్యేక ఆహ్వానం మేరకు తాను అందులో నటించినట్లు వెల్లడించారు.'నిజమైన సైనికుడిని తెరపై చూపించాలని మేకర్స్ భావించారు. నా మిలిటరీ నేపథ్యం, అనుభవం దృష్ట్యా ఆ అవకాశం ఇచ్చారు. ఈ నటన నాకు పూర్తిగా కొత్త. కానీ కొత్త అనుభవాన్ని ఇచ్చింది. నిజ జీవితంలో మన విధులను మనం నిర్వర్తిస్తాం. క్షేత్రస్థాయిలో సైనికుడిగా ఉన్నప్పుడు మన భుజాలపై ఎంతో బాధ్యత ఉంటుంది. నిజమైన యుద్ధాల్లో మన త్యాగాలు, భయాలు అన్నీ ఉంటాయి. సైనికుడిగా నటించడం అంటే అలాంటి ఉద్వేగాలనే కెమెరా ముందుకు తీసుకురావడానికి ప్రయత్నించాలి' అని లక్కీ బిష్త్ మీడియాతో తన కొత్త జర్నీ గురించి చెప్పారు. 'సేన-గార్డియన్స్ ఆఫ్ ది నేషన్' ఎంఎక్స్ ప్లేయర్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. విక్రమ్ సింగ్ చౌహాన్ ప్రధాన పాత్రలో నటించారు. యశ్పాల్ శర్మ, షిర్లే సేథియా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇందులో కార్తీక్ అనే యువకుడు అమెరికాలో చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి భారత సైన్యంలో చేరి, దేశానికి సేవ చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆయన మిలిటెంట్లను ఎదుర్కొన్న తీరును దర్శకుడు అభినవ్ ఆనంద్ ఈ సిరీస్‌లో చక్కగా చూపించారు. కాగా ఉత్తరాఖండ్‌కు చెందిన లక్కీ బిష్త్ భారత మాజీ స్పై, స్నైపర్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్ కమాండో. ఆయన ప్రముఖ నేతలు ఎల్‌కే అద్వాణీ, రాజ్‌నాథ్ సింగ్, తరుణ్ గొగోయ్ లాంటి వారికి బాడీగార్డ్‌గా పనిచేశారు. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేశారు. 2010లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా మన దేశంలో పర్యటించినప్పుడు భద్రత పర్యవేక్షించిన అధికారుల్లో బిష్త్ కూడా ఒకరు. భారత సైన్యం, రా, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్, అస్సాం రైఫిల్స్ లాంటి ఏజెన్సీల్లో పనిచేసిన ఆయన దేశం తరఫున పలు ఆపరేషన్లలో పాల్గొన్నారు.

## ఫ్లాట్ కొనుగోలు చేసిన సచిన్ టెండూల్కర్ భార్య.. ధర తెలిస్తే షాకే..!




**న్యూఢిల్లీ-నవభూమి:** భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ సతీమణి అంజలి టెండూల్కర్ కొత్త ఇంటిని కొనుగోలు చేశారు. ముంబై సమీపంలోని విరార్ ప్రాంతంలో చాలా తక్కువ ధరకే ఫ్లాట్‌ను కొన్నారు. దాని ధర తెలిస్తే అంతా షాక్ అవుతారు. రిజిస్ట్రేషన్ పత్రాల ప్రకారం.. అంజలి కొనుగోలు చేసిన ఫ్లాట్ విస్తీర్ణం కేవలం 391 చదరపు అడుగులు మాత్రమే. విరార్‌లోని పెనిన్సులా హైట్స్‌లో ఈ ఫ్లాట్ ఉంది. దీని ధర కేవలం రూ.32 లక్షలు మాత్రమే. ఈ ఏడాది మే 30న అంజలి ఈ ఫ్లాట్ కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించి ఆమె రూ. 1.92 లక్షల మేర స్టాంప్ డ్యూటీ చెల్లించారు. ఇక రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ. 30 వేలు చెల్లించినట్లు జాప్‌కీ.కామ్ వెల్లడించింది. కాగా, స్టార్ సెలబ్రిటీ భార్య ఇంత తక్కువ ధరకు ఫ్లాట్ కొనుగోలు చేయడం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. కాగా మహారాష్ట్రలో మహిళలు ఇళ్లను కొనుగోలు చేస్తే పలు రాయితీలు పొందుతారు. మహిళలు ఫ్లాట్లు కొనుగోలు చేస్తే స్టాంపు డ్యూటీ కింద ఒక శాతం రాయితీ ఉంటుంది. దీని ప్రకారం అంజలి కూడా స్టాంప్ డ్యూటీపై 1శాతం రాయితీని పొందారు. అయితే, పట్టణాలు, జిల్లాలను బట్టి ఈ రాయితీ 5 నుంచి 7 శాతం వరకు ఉంటుంది.

# ఆధార్ కార్డును ఎన్నికల సంఘం అంగీకరించాల్సిందే.. తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు



**బిహార్ -నవభూమి:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ.. ఓటర్ల జాబితా సవరణ తీవ్ర దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. బిహార్ ఎన్నికలకు ముందు సుమారు 65 లక్షల మంది ఓట్లను ఓటర్ లిస్ట్ నుంచి తొలగించారంటూ వస్తున్న వార్తలు దేశవ్యాప్తంగా రాజకీయంగా తీవ్ర సంచలనంగా మారాయి. చివరికి ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో.. తాజాగా అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు ఇచ్చింది. ఓట్ల తొలగింపుపై దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. తొలగించిన ఓట్లను తిరిగి చేర్చేందుకు.. అవసరమైన ధృవపత్రాల జాబితాలో ఆధార్ కార్డు ను కూడా చేర్చాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీఐ) ఆదేశించింది. ఓటర్ల జాబితా సవరణ కోసం సమర్పించాల్సిన 11 ధృవపత్రాల్లో ఆధార్ కార్డు కూడా ఉండేలా చూడాలని ఈ సందర్భంగా ఈసీకి సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు తమ ఓట్లను జాబితా నుంచి తొలగించారని.. లక్షలాది ఓటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. దీనికోసం ఆ రాష్ట్రంలో ప్రస్తుతం ఓటర్ల జాబితాకు సంబంధించి.. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కొనసాగుతోంది. ఈ ప్రక్రియపై సుప్రీంకోర్టు శుక్రవారం కీలక ఆదేశాలు ఇచ్చింది. జాబితా నుంచి పేర్లు తొలగించిన వారు.. నివాస ధృవీకరణ కోసం ఆధార్ కార్డును కూడా సమర్పించవచ్చని సూచించింది. వారు సమర్పించిన ఆధార్ కార్డులను ఎన్నికల సంఘం తప్పకుండా ఆమోదించాలని తేల్చి చెప్పింది. రాజకీయ పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు ఏం చేస్తున్నారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రాజకీయ పార్టీలు తమ పనిని తాము సరిగా నిర్వహించడం లేదని మండిపడింది. ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించబడిన వారికి రాజకీయ పార్టీలు తప్పనిసరిగా సహాయం చేయాలని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. తమ ఓటర్లను ఓటర్ లిస్ట్ నుంచి తొలగిస్తున్నారని పార్టీలు ఆరోపిస్తున్నప్పటికీ.. తమ ఏజెంట్ల ద్వారా అభ్యంతరాలను సమర్పించడం లేదని.. కేవలం ఎంపీలు, ఎమ్మెల్యేలు మాత్రమే ముందుకు వచ్చినట్లు కోర్టు తెలిపింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా ఆదేశాలతో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో మరింత పారదర్శకత వస్తుందని భావిస్తున్నారు. అర్హులైన వారు.. తమ పేర్లను మళ్లీ ఓట్ల కోసం నమోదు చేసుకునే అవకాశం లభిస్తుందని చెబుతున్నారు.

### అలాంటి వాటిని మాత్రమే షెల్టర్లలో ఉంచాలి..
## వీధి కుక్కలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలో వీధి కుక్కల సమస్యకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడంతో తాజాగా సర్వోన్నత న్యాయస్థానం స్పందించింది. ఇంతకు ముందు ఇచ్చిన ఆదేశాలను సవరించింది. బహిరంగ ప్రదేశాలు, రోడ్లు, వీధుల్లో శునకాలను ఆహారం ఇవ్వడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. నిర్దేశిత ప్రాంతాల్లోనే వాటికి ఆహారం అందివ్వాలని సూచించింది. ఇందుకోసం ప్రతి వార్డులో ప్రత్యేక కేంద్రాలను అధికారులు ఏర్పాటుచేయాలని ఆదేశించింది. ఆ కేంద్రాల్లో మాత్రమే వీధి కుక్కలకు ఆహారం అందివ్వాలని సూచిస్తూ నోటీసు బోర్డులను ఏర్పాటుచేయాలని తెలిపింది. ఎట్టి పరిస్థితుల్లోనూ కుక్కలను వీధుల్లో ఆహారం ఇవ్వకూడదని తేల్చిచెప్పింది. దీనికి విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించింది. ఎక్కడబడితే అక్కడ వీధి కుక్కలకు ఆహారం ఇవ్వడం వల్ల అవాంఛనీయ ఘటనలు జరుగుతున్నాయనే నివేదికలను పరిగణనలోకి తీసుకొని ఈ ఆదేశాలు వెలువరించినట్టు చెప్పింది. వీధుల్లో నడిచే సాధారణ పౌరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి చర్యలకు స్వస్తి పలకాలని అభిప్రాయప౦డింది. ఢిల్లీ- నేషనల్ క్యాపిటల్ రీజియన్ ప్రాంతం నుంచి వీధి శునకాలను షెల్టర్లకు తరలించాలంటూ ఆగస్టు 11న అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీచేసిన సంగతి తెలిసిందే. కుక్కల దాడులు పెరిగిపోవడంపై ఆందోళన వ్యక్తంచేసిన సుప్రీంకోర్టు.. అవి బయట రోడ్లపై కనిపించడానికి వీల్లేదని, షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులపై తీవ్ర విమర్శలు, నిరసనలు, అభ్యంతరాలు రావడంతో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ క్రమంలో టీకాలు వేసిన తర్వాతే వీధి కుక్కలను వదిలిపెట్టాలని సూచించింది. అయితే, రేబిస్ లక్షణాలు, విపరీత ప్రవర్తన కలిగినవాటిని మాత్రం షెల్టర్లలోనే ఉంచాలని ఆదేశించింది. మిగతావాటికి టీకాలు, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత ఎక్కడ నుంచి తీసుకొచ్చారో అక్కడే వదిలేయాలని పేర్కొంది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు ఆదేశాలిచ్చిన సుప్రీంకోర్టు.. దీనికి సంబంధించి గత విచారణలో (ఆగస్టు 11న )ఇచ్చిన ఆదేశాలను సవరించింది. అనంతర తదుపరి విచారణ 8 వారాలకు వాయిదా వేసింది. ఇక, వీధి కుక్కల దాడుల్లో చాలా మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇటీవల ఉత్తర్ ప్రదేశ్‌లో ఓ రెండేళ్ల బాలుడికి గాయం కాగా.. దానిని వీధి కుక్క నాకడంతో అతడికి రేబిస్ సోకింది. పరిస్థితి విషమించి ఆ చిన్నారి ప్రాణాలు కోల్పోయాడు. ఆ బాలుడు ఆడుకుంటుండగా నెల రోజుల కిందట కేవలం నాకిందని, కరవలేదని కుటుంబసభ్యులు చెప్పారు.

## సంపూర్ణ స్వేచ్ఛ కావాలంటే పెళ్లిళ్లు చేసుకోకండి: సుప్రీం కోర్టు సంచలనం



**న్యూఢిల్లీ-నవభూమి:** భార్యాభర్తల బంధం, విడాకులు, పిల్లల సంరక్షణకు సంబంధించిన ఒక కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తున్నాయి. వివాహం చేసుకున్న తర్వాత ఒక భాగస్వామి మరొకరిపై ఆధారపడకుండా ఉండటం అనేది అసాధ్యమని సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. "సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలంటే పెళ్లే చేసుకోకూడదు" అని న్యాయస్థానం తేల్చి చెప్పింది. జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ఇద్దరు పిల్లలున్న ఒక జంట విడాకుల కోసం కోర్టుకు వచ్చారు. భార్య మాట్లాడుతూ.. తాను తన భర్తపై ఆధార పడకుండా ఉండాలని కోరుకుంటున్నానని కోర్టుకు తెలిపింది. దీనిపై జస్టిస్ నాగరత్న భావోద్వేగంతో స్పందించారు. "నేను పాతకాలపు మనిషిని కావొచ్చు. కానీ ఒక భార్య నేను నా భర్తపై ఆధార పడనని చెప్పడం అసాధ్యం" అని ఆమె వ్యాఖ్యానించారు. ఆర్థికంగా కాకపోయినా ఒకరిపై ఒకరు మానసికంగా, భావోద్వేగంగా ఆధారపడటమే వివాహ బంధంలోని అంతర్లీన లక్షణం అని ఆమె నొక్కి చెప్పారు.

ఈ కేసులో భార్యాభర్తలు ఇద్దరు కూడా విద్యావంతులు, స్థిరపడినవారు. భర్త సింగపూర్‌లో పని చేస్తుండగా.. భార్య హైదరాబాద్ నుంచి విచారణలో వర్చువల్‌గా పాల్గొన్నారు. ముఖ్యంగా భార్య.. తన భర్తతో కలిసుండాలని లేదని చెప్పింది. గతంలో అతడితోపాటు సింగపూర్ వెళ్తే.. తమను సరిగ్గా చూసుకోలేదని వాపోయింది. డబ్బుల విషయంలో గొడవలు జరిగినట్లు వివరించింది. అందుకే తాను ఎవరిపై ఆధార పడకుండా జీవించాలని నిర్ణయించుకున్నట్లు వివరించింది. కానీ న్యాయస్థానం మాత్రం.. విడాకులు తీసుకోకుండా ఇద్దరు పిల్లల భవిష్యత్తు కోసం ఆలోచించాలని కోర్టు దంపతులకు సూచించింది. "పిల్లలు విచ్ఛిన్నమైన కుటుంబాన్ని చూడకూడదు" అని న్యాయమూర్తులు తీవ్ర భావోద్వేగంతో పేర్కొన్నారు. వారాంతాల్లో భర్త పిల్లలను తీసుకెళ్లవచ్చు. విడాకుల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసి.. రాజీ పడేందుకు ప్రయత్నించాలని చెప్పారు. భార్య, పిల్లల నిర్వహణ ఖర్చుల కోసం భర్త రూ. 5 లక్షలు జమ చేయాలని.. అలాగే వారాంతాల్లో పిల్లలను తన వద్దకు తీసుకెళ్లాలని కోర్టు తాత్కాలిక ఆదేశాలు జారీ చేసింది. ఈ విచారణలో భర్త రాజీకి సిద్ధమని చెప్పగా.. భార్య మాత్రం విముఖత చూపినట్లు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారం వివాహ వ్యవస్థపై సుప్రీం కోర్టుకున్న సంప్రదాయ వైఖరిని మరోసారి బయటపెట్టింది. వివాహ బంధాన్ని కాపాడటం, ముఖ్యంగా పిల్లల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడమే కోర్టు ప్రధాన లక్ష్యమని ఈ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

# భూరికార్డుల్లో తప్పులు సరిచేసేందుకు
## సర్కార్ చర్యలు.. ఇంటివద్దకే అధికారులు



**న్యూఢిల్లీ-నవభూమి:** మరికొన్ని నెలల్లో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అధికార జేడీయూ, బీజేపీ కూటమి.. ప్రతిపక్ష కాంగ్రెస్, ఆర్జేడీ కూటములు పోటాపోటీగా ఇప్పటికే ప్రచార కార్యక్రమాల్లో మునిగిపోయాయి. కేంద్ర ప్రభుత్వం కూడా బిహార్‌కు ఆర్థిక సహాయం, ప్రాజెక్టులు, వరాల జల్లు కురిపిస్తోంది. ఇక ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కూడా.. బిహార్ వాసులకు హామీల వర్షం కురిపిస్తున్నారు. ఉచితాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు హామీ ఇస్తూ.. బిహార్ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇక అధికార పక్షం తీరును ఎండగడుతూ ప్రతిపక్ష కాంగ్రెస్-ఆర్జేడీ తీవ్రస్థాయిలో నితీష్ కుమార్ సర్కార్‌పై విరుచుకుపడుతోంది. ఇలాంటి సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమస్యను పరిష్కరించేందుకు నితీష్ కుమార్ ప్రభుత్వం నడుం బిగించింది. బిహార్‌లో భూ రికార్డుల సవరణకు చర్యలు చేపట్టింది.

బిహార్‌లో రాజస్వ మహా అభియాన్ పేరుతో నితీష్ కుమార్ సర్కార్ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రజల భూ రికార్డుల్లోని లోపాలను సవరించడానికి.. వాటిని అప్‌డేట్ చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం.. వచ్చే నెల 20వ తేదీ వరకు కొనసాగుతుంది. రెవెన్యూ, భూ సంస్కరణల విభాగం అధికారులు.. బిహార్‌లోని ఇంటింటికీ వెళ్లి.. తప్పులు ఉన్న భూ రికార్డులను సరిచేయనున్నారు. ఉదాహరణకు భూ రికార్డుల్లో పేరు, తండ్రి పేరు, ఖాటా-ఖస్రా, విస్తీర్ణం లేదా అద్దె వంటి వివరాల్లో ఏమైనా పొరపాట్లు ఉంటే వాటిని సవరిస్తారు. అలాగే భూ రికార్డులు ఉమ్మడిగా ఉన్నా లేదా పూర్వీకుల పేరు మీద ఉన్నా.. వాటిని విభజించనున్నారు. డిజిటలైజ్ చేసిన భూ రికార్డుల్లో ఉన్న తప్పులను సరిచేయడం.. పూర్వీకుల పేర్ల మీద ఉన్న భూములను వారి వారసులకు హక్కులు కల్పించడం.. భాగస్వాముల మధ్య పరస్పర అంగీకారం, రిజిస్ట్రేషన్ దస్త్రాలు లేదా కోర్టు ఉత్తర్వుల ఆధారంగా భూమిని విభజించడం.. డిజిటలైజ్ కాని భూ రికార్డులను డిజిటలైజ్ చేయడం.. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఆగస్టు 19వ తేదీ నుంచి సెప్టెంబర్ 20వ తేదీ వరకు గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తారు. వీటి సమాచారాన్ని మహా అభియాన్ పోర్టల్ లేదా రెవెన్యూ అధికారులను సంప్రదించి తెలుసుకోవచ్చు. ఆగస్టు 16వ తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు రెవెన్యూ బృందాలు దరఖాస్తుదారుల ఇంటి వద్దకే వెళ్లి.. వారి డిజిటలైజ్డ్ భూ రికార్డులను, దరఖాస్తు ఫారమ్‌లను అందిస్తాయి. ప్రతి గ్రామంలో సుమారు 10 మంది అధికారులు.. దరఖాస్తులను కంప్యూటర్‌లో నమోదు చేసి.. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్‌లో అదనపు కలెక్టర్‌కు రిపోర్ట్ పంపిస్తారు. భూ రికార్డుల్లో మార్పులు చేసుకోవాలనుకున్న దరఖాస్తుదారులు.. తమ అప్లికేషన్లను అధికారులకు సమర్పించిన తర్వాత.. వారి పేర్లు, మొబైల్ నంబర్లను పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఆ తర్వాత దరఖాస్తు ఏ స్థితిలో ఉందో ఎప్పటికప్పుడు తెలిపేందుకు వారి ఫోన్‌కు మెసేజ్‌ల రూపంలో అప్‌డేట్‌లు ఇస్తారు.

## చెన్నైని ముంచెత్తిన భారీ వర్షం.. ఐఎండీ హెచ్చరికలు



**చెన్నై-నవభూమి:** తమిళనాడు రాజధాని చెన్నైని భారీ వర్షం ముంచెత్తింది. శుక్రవారం ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షానికి రోడ్లన్నీ పూర్తిగా జలమయమయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు నేడు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, కడలూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ఇచ్చింది.

చెన్నై ప్రాంతీయ వాతావరణ శాఖ ప్రకారం.. నుంగంబాక్కం, అడయార్, రాజా అన్నామలైపురం, వడపళని సహా అనేక ప్రాంతాల్లో ఉదయం 5 గంటల నుంచి ఇప్పటి వరకూ దాదాపు 4 నుంచి 5 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఆగస్టు 23 వరకూ తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

## పాఠశాలకు వెళ్లిన పిల్ల ఏనుగు.. ఆశ్చర్యానికి గురైన విద్యార్థులు..



**కేరళ-నవభూమి:** కేరళలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. వయనాడ్‌లోని ఓ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఊహించని అతిథి వచ్చి విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆశ్చర్యానికి గురిచేసింది. కెకాడిలోని ప్రభుత్వ ఎల్‌పీ పాఠశాల ఆవరణలోకి ఓ పిల్ల ఏనుగు ప్రవేశించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఆ పాఠశాలలో వంద మందికిపైగా విద్యార్థులు ఉంటారు. స్కూల్ అడవికి సమీపంలో ఉండటంతో సాయంత్రం వేళల్లో తరచూ ఏనుగుల గుంపులు అటుగా వెళ్తుంటాయని సిబ్బంది తెలిపారు. అయితే, స్కూల్ టైమింగ్స్‌లో ఇలా లోపలికి రావడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. పిల్ల ఏనుగు తమ స్కూల్ ఆవరణలోకి రావడంతో పిల్లలు ఆశ్చర్యానికి గురయ్యారు. మరోవైపు సెక్యూరిటీ కారణాలతో ఉపాధ్యాయులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. పిల్లల్ని తరగతి గదుల్లో ఉంచి తలుపులు వేశారు. దాదాపు గంటసేపు ఆ పిల్ల ఏనుగు పాఠశాల ఆవరణలో చక్కర్లు కొట్టినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అక్కడికి వచ్చి పిల్ల ఏనుగును అడవిలోకి వదిలినట్లు చెప్పారు. పిల్ల ఏనుగు స్కూల్ ఆవరణలో చక్కర్లు కొడుతున్న వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

## ఆస్పత్రిలో చేరిన ముకేశ్ అంబానీ తల్లి.. ఆందోళనలో ఫ్యామిలీ



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ తల్లి కోకిలాబెన్ అంబానీ ఆస్పత్రిలో చేరారు. శుక్రవారం ఉదయం కోకిలాబెన్ అంబానీ అస్వస్థతకు గురికావడంతో ముంబై లోని హెచ్‌ఎన్ రిలయన్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు జాతీయ మీడియా పేర్కొంది. అంబానీ కుటుంబ సభ్యులు హుటాహుటిన దక్షిణ ముంబైలోని రిలయన్స్ ఆస్పత్రికి వెళ్తున్న వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. అందులో అనిల్ అంబానీ , ఆయన భార్య ఓ కారులో వెళ్తుండగా.. ముకేశ్ అంబానీ ఫ్యామిలీ ఫుల్ సెక్యూరిటీతో ఆస్పత్రికి చేరుకుంది. ప్రస్తుతం కోకిలాబెన్ ఆరోగ్య పరిస్థితి గురించి ఎలాంటి సమాచారం లేదు. అయితే, ప్రస్తుతం ఆమె వయసు 91 ఏండ్లు. వయో సంబంధిత సమస్యలతో ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీనిపై అంబానీ కుటుంబం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు. ఆస్పత్రి వర్గాలు కూడా కోకిలాబెన్ ఆరోగ్యం గురించి ఇంకా స్పందించలేదు.

## వరుసగా ఐదోరోజు.. ఢిల్లీలోని పాఠశాలకు బాంబు బెదిరింపు..!

**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీలోని పాఠశాలలకు బాంబు బెదిరింపులు ఆగడం లేదు. వరుసగా ఐదోరోజు ఈ-మెయిల్స్ వచ్చాయి. శుక్రవారం ద్వారకా సెక్టార్-7లోని ఒక పాఠశాలకు ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీ ఫైర్ సర్వీసెస్‌కు ఉదయం 7 గంటలకు సమాచారం అందగా.. పోలీసులు, అగ్నిమాపక దళ బృందాలు సంఘటనా స్థలంలో తనిఖీలు నిర్వహిస్తున్నాయి. గురువారం వరకు ఢిల్లీలోని 50కిపైగా పాఠశాలలకు ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. దాంతో పోలీసులతో పాటు ఇతర అత్యవసర సేవలన్నీ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టగా.. ఇప్పటి వరకు అనుమానాస్పద వస్తువులు మాత్రం కనిపించలేదు. బాంబు బెదిరింపులు వచ్చిన పాఠశాలల జాబితాలో రాహుల్ మోడల్ స్కూల్, మాక్స్‌ఫోర్ట్ స్కూల్, మాలవీయనగర్‌లోని ఎస్‌కేవీ, ప్రసాద్ నగర్‌లోని ఆంధ్రా స్కూల్స్ ఉన్నాయి. ఆగస్టు 18న, ఢిల్లీలోని 32 పాఠశాలలకు ఇలాంటి బెదిరింపులు వచ్చాయి. గతంలో ఢిల్లీలోని ద్వారకలోని సెయింట్ థామస్ స్కూల్, ఢిల్లీ యూనివర్సిటీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజ్‌లకు కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. గత ఏడాది మే నెలలో పాఠశాలలకు కూడా మెయిల్స్ వచ్చాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్
శనివారం
23 । ఆగస్టు । 2025



## బిగ్‌బాస్ విన్నర్ ఇంటిపై కాల్పులు..




ఫరీదాబాద్-నవభూమి: యూట్యూబర్, హిందీలో ప్రసారమైన బిగ్‌బాస్ ఓటీటీ సీజన్-2 విజేత ఎల్విష్ యాదవ్ ఇంటిపై గతవారం ఇద్దరు దుండగులు కాల్పులు జరిపారు. సుమారు 24 బుల్లెట్లు ఆయన ఇంట్లోకి దూసుకెళ్లాయి. అయితే ఆ సమయంలో ఎల్విష్ ఇంట్లో లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు. తాజాగా ఆ కాల్పులు జరిపిన ఇద్దరిలో ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. అతడిని ఇషాంత్ అలియాస్ ఇషు గాంధీగా గుర్తించారు. ఫరీదాబాద్‌లోని జవహర్‌నగర్ కాలనీకి చెందిన వాడని పేర్కొన్నారు. %నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అతనికి సంబంధించిన సమాచారం అందడంతో నిఘా పెట్టారు. శుక్రవారం ఉదయం నీరజ్ ఫరీద్ పురియా మురాను కలిసేందుకు ఇషాంత్ వెళ్తుండగా వెంబడించారు. దీంతో పోలీసులపై ఆటోమేటిక్ పిస్టల్‌తో ఆరు రౌండ్ల కాల్పులు జరిపాడు. ప్రతిగా పోలీసులు అతని కాలిపై గన్‌తో కాల్చడంతో గాయపడ్డాడు. అనంతరం అతడిని అరెస్టు చేసి దవాఖానకు తరలించారు. ఆదివారం (ఆగస్టు 17) ఉదయం 5.30 గంటల నుంచి 6 గంటల మధ్య బైక్‌లపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఎల్విష్ యాదవ్ ఇంటిపైకి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులపైకి దాదాపు రెండు డజన్ల తూటాలను పేల్చినప్పటికీ, ఎవరూ గాయపడలేదు. నిందితులు వెంటనే తప్పించుకుని పారిపోయారు. సంఘటన సమయంలో యాదవ్ ఇంట్లో లేరు. కేర్‌టేకర్ మాత్రమే ఆ ప్రాంగణంలో ఉన్నారు.

## సీఎం, ప్రధానిని తొలగించే చట్టం సాధ్యమా..?

కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు తీసుకొచ్చిన ఓ బిల్లు దేశ రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతోంది. తీవ్రమైన నేరాలకు పాల్పడ్డినట్టు ఆరోపణలు ఎదుర్కొనే ప్రజాప్రతినిధులు అరెస్టై నెల రోజులు వరుసగా నిర్బంధంలో ఉంటే వారిని పదవి నుంచి తప్పించేలా రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. అయితే, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో సర్కారలను నేరుగా కూల్చే అవకాశం రాజ్యాంగ దర్యాప్తు సంస్థలకు కట్టబెడుతుందని పలు పార్టీలు తీవ్రంగా మండిపడుతున్నాయి. అయితే, ఈ బిల్లును అసలు గట్టెక్కుతుందా? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.
తీవ్రమైన నేరారోపణలతో అరెస్టై వరుసగా 30 రోజుల పాటు జైల్లో ఉంటే ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రి లేదా ముఖ్యమంత్రిని కూడా పదవి నుంచి తొలగించేలా కేంద్ర ప్రభుత్వం ఓ బిల్లును తీసుకొచ్చింది. ఇందుకు సంబంధించిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాల ఆందోళనల నడుమే హెూం మంత్రి అమిత్ షా లోక్‌సభలో బుధవారం (ఆగస్టు 20న) ప్రవేశపెట్టారు. ఈ బిల్లు రాజ్యాంగవిరుద్ధమని, అత్యంత క్రూరమైందని ఆరోపిస్తోన్న ప్రతిపక్షాలు.. దేశాన్ని బీజేపీ 'పోలీస్ రాజ్యంగా, నియంతృత్వం'గా మార్చడానికి ప్రయత్నిస్తోందని మండిపడుతున్నాయి. విపక్ష పాలిత రాష్ట్రాల సీఎంలను తొలగించడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను చట్టబద్ధంగా వినియోగించుకునేందుకు బీజేపీ చేస్తోన్న కుట్రలని దుయ్యబడుతున్నాయి. అయితే, రాజకీయాల్లో క్షీణిస్తున్న నైతిక ప్రమాణాలు పెంచడానికి, సమగ్రతను కాపాడటమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం వాదిస్తోంది. కానీ, ఇంతకీ ఈ బిల్లులో ఏముంది? పార్లమెంట్‌లో ఈ బిల్లు ఆమోదం పొందుతుందా? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇవన్నీ పరిశీలిస్తే ఆసక్తికరమైన అంశం బయటపడుతుంది. ఇది రాజ్యాంగ సవరణ బిల్లు కాబట్టి.. పార్లమెంట్ ఆమోదం పొందాలంటే ఉభయ సభలలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించాలి. కాంగ్రెస్ వంటి కీలక ప్రతిపక్ష పార్టీ మద్దతు ఇస్తే తప్ప ప్రస్తుతం ఉన్న మెజార్టీతో ఎన్డీయేకు బిల్లు గట్టెక్కించడం సాధ్యం కాదు. ప్రతిపక్షం ఈ పనిచేయడానికి సిద్ధంగా లేదు. మరి అలాంటప్పుడు ప్రస్తుత రూపంలో అమలు చేయలేని చట్టాన్ని ప్రవేశపెట్టడం ద్వారా పార్లమెంటులో గందరగోళాన్ని సృష్టించి, రాజకీయ వివాదానికి ఎందుకు పాల్పడుతుంది అనేది అందరి మదిలో సందేహం. నిశితంగా పరిశీలిస్తే ఈ బిల్లు ప్రతిపక్షాలపై ఎదురుదాడిని లక్ష్యంగా చేసుకోవచ్చని తెలుస్తోంది. చట్టం ఏం చెబుతుంది?:కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం.. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టై వరుసగా 30 రోజులు జైల్లో ఉన్నా, ఐదేళ్లు జైలు శిక్ష ఖరారైన ఎవరైనా మంత్రి, సీఎం లేదా ప్రధాన మంత్రిని తొలగించాలంటే ఆర్టికల్ 75, 164, 29ఏఏలకు సవరణ చేయాల్సి ఉంటుంది. ఈ బిల్లు ఆమోదం పొంది చట్టంగా మారితే ఆరోపణలు ఆధారంగానే తొలగించవచ్చు. ఆ కేసులో దోషిగా నిర్ధారించాల్సిన అవసరం లేదు. కానీ, అలా పదవిని కోల్పోయిన వ్యక్తి జైలు నుంచి విడుదలైన తర్వాత తిరిగి ఆ పదవి చేపట్టకుండా అడ్డుకోదని పేర్కొంది. బిల్లులో "ఎన్నికైన ప్రజాప్రతినిధులు భారత ప్రజల ఆకాంక్షలు, ఆశలను ప్రతిబింబిస్తారు.. వారు రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా ప్రజా ప్రయోజనాల కోసమే, ప్రజల సంక్షేమం కోసం మాత్రమే పనిచేయాలని ఆశించబడుతుంది.. పదవిలో ఉన్న మంత్రుల స్వభావం, ప్రవర్తన అనుమానాస్పదంగా కాకుండా, పూర్తిగా నిష్కళంకంగా ఉండాలి' అని ముసాయిదా బిల్లు లక్ష్యాలుగా పేర్కొన్నారు. బిల్లును లోక్‌సభలో కేంద్ర హెూమ్ మంత్రి అమిత్ షా ప్రవేశపెడుతున్న సమయంలో ప్రతిపక్ష ఎంపీలు రచ్చరచ్చ చేశారు. బిల్లు ప్రతులను చింపి.. కాగితాలను అమిత్ షాపైకి విసిరేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ దుర్వినియోగం చేస్తోందని కొంతకాలంగా ఆరోపిస్తోన్న విపక్షాలు.. ఈ కొత్త చట్టం భారతదేశాన్ని 'పోలీస్ రాజ్యాని'కి దగ్గరగా తీసుకువెళుతుందని ధ్వజమెత్తుతున్నాయి. దీనిని అవినీతిని అడ్డుకునే చర్య అని చెప్పడం అంటే ప్రజల కళ్లకు గంతలు కట్టడమేనని, ఎన్నికల్లో ఓడించలేకపోయినా ఏకపక్ష అరెస్టుల ద్వారా ప్రతిపక్షపాలిత రాష్ట్రాల సీఎంలను తొలగించేందుకు బీజేపీ కొత్త కుట్రలకు తెరతీసిందని ఆరోపిస్తున్నాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగియడానికి ఒక్క రోజు ముందు ఈ బిల్లును కేంద్రం సభ ముందుకు తీసుకొచ్చింది. ఆపై వెను వెంటనే దానిని సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపింది. అంటే, ఈ బిల్లును హడావుడిగా పాస్ చేయించే ఉద్దేశం తమకు లేదని సంకేతాలు ఇచ్చింది. వాస్తవానికి వివాదాస్పద బిల్లులను నిశితంగా పరిశీలించడానికి హౌస్ ప్యానెల్‌లకు పంపుతారు. కానీ, అరుదుగా కొన్నింటిని కేంద్రం జాబితాను చేస్తుంది. ఈ బిల్లు విషయంలోనూ అలాగే జరిగింది. పార్టీలకు అతీతంగా 21 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యులతో కూడిన జేపీసీ ద్వారా బిల్లును పరిశీలించాలని నిర్ణయించారు. జేపీసీలో సభ్యులను స్పీకర్, రాజ్యసభ ఛైర్‌పర్సన్ నియమిస్తారు. పార్లమెంట్ సమావేశాలు ముగియడంతో ఈ వ్యవహారం చాలా కాలం పాటు సాగనుంది. 2010లో గుజరాత్ హెూంమంత్రిగా ఉన్నప్పుడు అమిత్ షా అరెస్టు గురించి కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ ప్రస్తావించడంతో లోక్‌సభలో వాగ్వాదం చోటుచేసుకుంది. షా ఎదురుదాడి చేసి "నైతికత గురించి మీరు పాఠాలు బోధిస్తున్నారు? ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ అరెస్టుకు ముందే నేను రాజీనామా చేశాను" అని కౌంటర్ ఇచ్చారు. ఎవరి బలాలు ఏంటి?:పార్లమెంట్‌లో ఏదైనా బిల్లు ప్రవేశపెట్టి.. దానికి రాజ్యాంగ సవరణ అవసరమైతే మూడింట రెండొంతుల సభ్యులు మద్దతు తప్పనిసరి. ప్రస్తుతం లోక్‌సభలో 542 మంది సభ్యులు ఉండగా.. బిల్లు ఆమోదానికి 361 మంది మద్దతు తెలపాలి. కానీ, ఎన్డీయేకు లోక్‌సభలో కేవలం 293 మంది మాత్రమే ఉన్నారు. కొన్ని తటస్థ పార్టీలు మద్దతు ఇచ్చినా.. ఆ సంఖ్యను చేరుకోవడం కష్టసాధ్యం. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి. ప్రస్తుతం 239 సభ్యులు ఉండగా.. బిల్లు గట్టెక్కడానికి కనీసం 160 ఓట్లు సాధించాలి. కానీ, ఎన్డీయే బలం కేవలం 132 మాత్రమే. అంటే ఉభయసభల్లోనూ ప్రతిపక్షాల మద్దతు లేకుండా బిల్లు ఆమోదం సాధ్యం కాదు. ఒకవేళ, ఏదైనా అద్భుతం జరిగి బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందితే.. అమలు అంత ఆషామాషీ కాదు. ఈ బిల్లు దేశ సమాఖ్య నిర్మాణాన్ని ప్రభావితం చేస్తుంది. కనీసం సగం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆమోదం అవసరం. అయితే, చాలా రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంది కాబట్టి ఇది సమస్య కాకపోవచ్చు. అలాగే, ఈ బిల్లు రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి విరుద్ధంగా ఉందని, 'దోషిగా నిరూపించబడే వరకు నిర్దోషి' అనే సూత్రాన్ని సవాలు చేస్తుందని పలువురు ఎంపీలు చెబుతున్నట్టు దీనిని సుప్రీంకోర్టులో సవాలు చేయవచ్చు. ఇన్ని అడ్డంకులు ఉన్నప్పటికీ, ప్రభుత్వం అలాంటి బిల్లును ఎందుకు ప్రవేశపెడుతుందనే సందేహం కలగక మానదు. దీనికి సమాధానం అవగాహన పోరాటం కావచ్చు. బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, కాంగ్రెస్ 'ఓట్ల చోరీ' ఆరోపణలతో ప్రభుత్వాన్ని ప్రతిపక్షం ఇరుకున పెట్టడానికి ప్రయత్నిస్తోంది.

## ప్రత్యర్థులపై బ్రహ్మాస్త్రాలు ..రాజకీయ నైతికతా? లేక అధికారం దుర్వినియోగమా?

భారత పార్లమెంటులో ఇటీవల ప్రవేశపెట్టబడిన మూడు బిల్లులు దేశ రాజకీయ వాతావరణాన్ని మంటగలిపాయి. ఈ బిల్లుల ఉద్దేశ్యం నేరారోపణలు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకోవడమేనని ప్రభుత్వం చెబుతుంటే, విపక్షాలు మాత్రం ఇవి ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే ఆయుధాలని అంటున్నాయి. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టై వరుసగా ముప్పై రోజులపాటు నిర్బంధంలో ఉన్న మంత్రులు, ముఖ్యమంత్రులు, ఇంతేకాదు ప్రధానిని సైతం పదవి నుండి తొలగించే సామర్థ్యం ఈ బిల్లులకు ఉందని హెూంమంత్రి సభలో స్పష్టంచేయడం, దీనికి జోడీగా చేసిన వ్యాఖ్యలు, హితవులు ఆందోళనకరంగానూ, ఆసక్తికరంగానూ మారాయి. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులు విశ్వసనీయతకు ప్రతీకలు కావాలని, ఎటువంటి సందేహానికీ, అనుమానానికీ ఆస్కారం లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలనే ఆశయం ఈ బిల్లుల వెనుక ఉన్నదని పాలకపక్షం చెబుతోంది. ఒక నాయకుడు అరెస్టై, ముప్పై రోజులపాటు నిర్బంధంలో ఉంటే, అతడు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాడనే వాదనను ఈ బిల్లులు ముందుకు తెస్తున్నాయి. రాజకీయం మలినమవుతూ, అవినీతి విస్తరిస్తూ వస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి సంస్కరణల అవసరం ఉందని బీజేపీ శ్రేణులు వాదిస్తున్నాయి. నిజానికి రాజకీయాల్లో నేరగాళ్ల ప్రవేశాన్ని అరికట్టాలనే ఉద్దేశ్యం చాలా ఉన్నతమైనదే. అయితే, ఆ ఉద్దేశ్యం ఆచరణలోకి రాగానే అనేక గోధుమలు బయల్పడతాయి. ఈ బిల్లులపై విపక్షాల ఆగ్రహం ఊహించదగ్గదే. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఇతర



విపక్షాలు కలిసి బిల్లులను తీవ్రంగా వ్యతిరేకించాయి. లోక్‌సభలో హెూంమంత్రి దగ్గరికి దూసుకొచ్చిన విపక్ష సభ్యులను వెనక్కు నెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. తృణమూల్ ఎంపీలు బిల్లుప్రతులను చించి విసరడం, కాంగ్రెస్ వర్గం దీన్ని రాజ్యాంగ విరుద్ధమని, ఫెడరల్ వ్యవస్థకు ముప్పని వాదించడం ప్రతిపక్ష ఆందోళనను స్పష్టంచేశాయి. రాహుల్ గాంధీ తన వ్యాఖ్యల్లో ఈ బిల్లుల అసలు ఉద్దేశ్యం రాజకీయ ప్రత్యర్థులను గట్టిగా కట్టేయడమేనని చెప్పారు. "ఏముంది? ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్‌ను పిలుస్తారు, కేసు కడతారు, ప్రజలు ఎన్నుకున్న నేతను జైలుకెళతారు. ముప్పై రోజుల్లో అతడి రాజకీయ జీవితం ముగిసిపోతుంది" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రతిపక్షాల భావజాలానికి ప్రతిబింబమయ్యాయి. ఇక్కడ ప్రధాన సమస్య దుర్వినియోగానికి అవకాశం. నిజంగా ఒక నాయకుడు నేరానికి పాల్పడితే, అతడు పదవిలో ఉండకూడదనే నైతిక దృక్పథం ఎవరికీ అభ్యంతరకరం కాదు. కానీ, దోష నిర్ధారణ జరగకముందే కేవలం నేరారోపణల ఆధారంగా, లేదా కేసు నమోదు కాగానే పదవినుంచి తొలగించడం న్యాయపరమైన, ప్రజాస్వామ్యపరమైన అనేక ప్రశ్నలకు తావిస్తుంది. ముఖ్యంగా ఈడీ, సీబీఐ, ఐటీ శాఖలు వంటి కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు పక్షపాతంతో వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు స్వయంగా సుప్రీంకోర్టు స్థాయిలో వినిపిస్తున్నాయి. ఇలాంటి వాతావరణంలో ఈ బిల్లులు విపక్ష నాయకులను ఇబ్బందిపెట్టడానికి బ్రహ్మాస్త్రాలుగా మారతాయనే భయం సహజం. నిజానికి ప్రజాస్వామ్య వ్యవస్థలోని నైతికతను పెంపొందించడం కోసం చట్టాలను తేవడం తప్పు కాదు. కానీ, నైతికతను రుద్దే ప్రయత్నం, ముఖ్యంగా అది ఒకే రాజకీయ శక్తి చేతిలో ఉండబోతే, అది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ప్రజాప్రతినిధులను ఎంచుకునేది ప్రజలు. వారిని తిరస్కరించేది కూడా ప్రజలే. కానీ ఒక కేసు, ఒక ఆరోపణ ఆధారంగా ఎంపికైన నాయకుడిని పదవి నుంచి తప్పించడం ప్రజాస్వామ్య నిర్ణయాన్ని తిరస్కరించడం వంటిదే. ఈ బిల్లులు ప్రస్తుతం సంయుక్త పార్లమెంటరీ విచారణ సంఘానికి వెళ్ళాయి. అక్కడ పెద్ద సమయం ఇవ్వకుండా, కేవలం శీతాకాల సమావేశాల్లో నివేదిక సమర్పించమని ఆదేశించడం కూడా హడావుడి నిర్ణయమేనన్న అనుమానాలు రేకెత్తిస్తోంది. అంతే కాకుండా వర్షాకాల సమావేశాల చివరి రోజుల్లో, ఎజెండాలో లేకుండా ఈ బిల్లులను హఠాత్తుగా ప్రవేశపెట్టడం, పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, ట్రంప్ వ్యాఖ్యలు, బిహార్ సర్ లాంటి అంశాల్లో పాలకపక్షం రక్షణాత్మకంగా నిలిచిన సమయంలో ప్రత్యర్థులను దారి మళ్లించేందుకు తీసుకొచ్చిందన్న విమర్శలకు బలం ఇస్తోంది. రాజకీయాల్లో నైతికత, ప్రజల విశ్వాసం అత్యంత ప్రధానమైనవి. కానీ వాటిని కాపాడే మార్గాలు ప్రజాస్వామ్యాన్నే దెబ్బతీయకూడదు. న్యాయస్థానాలు స్వతంత్రంగా, వేగవంతంగా తీర్పులు ఇస్తేనే అవినీతి, నేరాలు ఉన్న నాయకులను తొలగించవచ్చు. ఒక కేసు నమోదు కాగానే ముప్పై రోజుల నిర్బంధం తర్వాత ఆటోమేటిక్‌గా పదవి కోల్పోవడం అనేది న్యాయం కాదని చెప్పకతప్పదు. ఈ బిల్లులు ఒకవైపు ప్రజాస్వామ్యానికి సంరక్షణ కవచాలుగా నిలిచే అవకాశం ఉన్నా, మరోవైపు అవే ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసే బ్రహ్మాస్త్రాలుగా మారే ప్రమాదం ఉంది. కేంద్రానికి వ్యతిరేకంగా నిలబడే రాష్ట్ర ప్రభుత్వాలపై ఇవి ఆయుధాలుగా వాడబడతాయనే భయం చిన్నది కాదు. ప్రధానమంత్రిని కూడా ఇదే నియమం వర్తించాలనేది సత్యమే అయినా, వాస్తవానికి కేంద్ర ఏజెన్సీలు ఆయనపై కేసులు వేస్తాయని ఎవ్వరూ నమ్మడం లేదు. అందువల్ల ఈ బిల్లుల సారం ఏమిటంటే %-% నైతికత పేరుతో ప్రవేశపెట్టబడినవి అవి, కానీ వాస్తవ రాజకీయాల్లో అవి ప్రత్యర్థులపై బ్రహ్మాస్త్రాలుగా వాడబడతాయనే అనుమానం గట్టిగా వినిపిస్తోంది. ప్రజాస్వామ్యంలో నిజమైన సంస్కరణ కావాలంటే న్యాయవ్యవస్థను బలోపేతం చేయాలి, విచారణ సంస్థలను స్వతంత్రంగా మార్చాలి, రాజకీయ జోక్యాన్ని పూర్తిగా తొలగించాలి. లేకపోతే ఎంత బిల్లులు తెచ్చినా అవి అధికారపక్షానికి శత్రువులను నాశనం చేసే ఆయుధాలుగానే నిలుస్తాయి.

## వలస కార్మికుల ఓటుహక్కు ప్రాముఖ్యత -ప్రజాస్వామ్యానికి అసలైన పరీక్ష



భారతదేశ ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే అతిపెద్దది అని గర్వంగా చెప్పుకుంటాం. అయితే ఆ ప్రజాస్వామ్యానికి మూలమైన ఓటు హక్కు ప్రతీ పౌరుడికి సమానంగా అందుతున్నదా అనే ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వలేని స్థితి ఏర్పడింది. ముఖ్యంగా ఉపాధి కోసం తమ స్వస్థలాలను వదిలి ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు వలస వెళ్ళే లక్షలాది కార్మికుల విషయంలో ఈ సమస్య మరింత తీవ్రమైందని చెప్పక తప్పదు. తాజాగా బిహార్ రాష్ట్రంలో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో గోపాల్‌గంజ్ వంటి జిల్లాల్లో లక్షల సంఖ్యలో ఓట్లు గల్లంతు కావడం దీనికి ఉదాహరణ. వీరిలో ఎక్కువ మంది తాత్కాలిక వలస కార్మికులే. మరణించిన వారు లేదా శాశ్వతంగా స్వస్థలం వదిలి వెళ్ళిపోయిన వారు ఓటర్ల జాబితాలో ఉండకూడదనడంలో ఎవరికి వాదం లేదు. కానీ పొట్టపోటు కోసం, కూలి పనికోసం లేదా గల్ఫ్ దేశాలలో జీవనోపాధికోసం బయటకు వెళ్ళిన వారి ఓటు హక్కు కూడా తీసివేయబడడం ప్రజాస్వామ్య మూల సూత్రాలకే విరుద్ధం. వలస కార్మికులు భారత సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గాలలో ఒకరు. చదువుల్లేని, పేదరికంలో మగ్గుతున్న వారు స్వగ్రామాల్లో ఉపాధి అవకాశాలు లేక బతుకుదెరువు కోసం వలస వెళ్ళడం తప్ప వేరే మార్గం ఉండదు. ఒకసారి వలస వెళ్ళాక వారిని "సాధారణ నివాసులు" గా పరిగణించాలా వద్దా అన్న విషయంలో చట్టాలు స్పష్టత ఇవ్వలేవు. ప్రజా ప్రతినిధ్య చట్టం1950లోని నిబంధన 20 ప్రకారం ఒక వ్యక్తి సాధారణ నివాసిగా పరిగణించడానికి అవసరమైన ప్రమాణాలు క్లిష్టంగా ఉండటంతో, చాలా మంది వలస కార్మికుల పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగిపోతాయి. ఇది ఒక పౌరుడికి ఉన్న ప్రాథమిక హక్కును లాక్కోవడమే. బిహార్ గోపాల్‌గంజ్ జిల్లాను ఉదాహరణగా తీసుకుంటే పరిస్థితి మరింత స్పష్టమవుతుంది. మూడు లక్షల పది వేల ఓట్ల తొలగింపుతో జిల్లాలో 15 శాతం ఓట్లు గల్లంతయ్యాయి. గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న బిహారీ కార్మికులలో అత్యధికులు ఈ జిల్లాకు చెందినవారే. తెలుగునాట తూర్పు గోదావరి, నిజామాబాద్ జిల్లాలు ఎడారి వలసలతో ప్రసిద్ధి చెందినట్లే బిహార్‌లో గోపాల్‌గంజ్ వలసల కేంద్రం. అంతర్జాతీయంగా, అంతర్గతంగా వలస వెళ్ళిన వారి కారణంగా ఎన్నికల ఫలితాలపై ప్రత్యక్ష ప్రభావం చూపే స్థాయిలో ఓట్ల సంఖ్య తగ్గిపోవడం ప్రజాస్వామ్యంలో ప్రతినిధిత్వమే ప్రశ్నార్థకమవు తుంది. ప్రజాస్వామ్యంలో సమానత్వం కేవలం రాజ్యాంగ పత్రాలపై మాత్రమే ఉండకూడదు. ఆ సమానత్వం ఆచరణలో కనిపించాలి. ఒక పేదవాడికి ఉన్న ఏకైక ఆస్తి ఓటు హక్కు. ఆ హక్కును తీసివేయడం అనేది అతని గళాన్ని మూయించడమే. మిర్యాలగూడ రైస్ మిల్లుల్లో పనిచేసే బిహారీ కార్మికులు లేదా హైదరాబాద్ భవన నిర్మాణ రంగంలో పనిచేసే కూలీలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి బిహార్ వెళ్లలేరు. అదే విధంగా బెంగళూరులో పనిచేసే తెలుగు యువకులు లేదా గల్ఫ్ దేశాలలో కష్టపడుతున్న కార్మికులు తమ స్వగ్రామాలకు ఎన్నికల సమయంలో రాలేకపోవచ్చు. ఆ కారణంగా వారి పేర్లు జాబితాలో లేకపోవడం న్యాయం కాదు. ఈ సమస్యను పరిష్కరించడానికి కొన్ని స్పష్టమైన మార్గాలు అవసరం. మొదటగా, వలస కార్మికుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసే జాతీయ డేటాబేస్ ఏర్పాటుచేయాలి. కోవిడ్ సమయంలో ప్రత్యేక రైళ్ళ ద్వారా స్వగ్రామాలకు చేరుకున్న వలస కార్మికుల సమాచారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకెంతగానో ఉపయోగపడింది. అదే తరహా శాశ్వత డేటాబేస్ అవసరం. రెండవది, వలస కార్మికులు పనిచేస్తున్న ప్రదేశంలోనే వారికి తాత్కాలిక ఓటుహక్కును కల్పించే విధానం ఆచరణలోకి రావాలి. ఆధార్, ఓటరు కార్డులను లింక్ చేసి సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సమస్యను పరిష్కరించవచ్చు. మూడవది, 'ప్రజా ప్రతినిధ్య చట్టం1950'లో 'సాధారణ నివాసి' నిర్వచనాన్ని వలస కార్మికుల వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సవరించాలి. రాజకీయ పక్షాలు వలస కార్మికుల సమస్యలపై అవగాహన కలిగి ఉన్నప్పటికీ, వాటిని ఓటు రాజకీయాల్లో ఆయుధాలుగా మాత్రమే ఉపయోగిస్తున్నాయి. కాంగ్రెస్ 'పలయన్ రోకో నౌక్రీ దో' (వలసలు ఆపండి, ఉద్యోగం ఇవ్వండి) అనే నినాదంతో ప్రజల దృష్టిని ఆకర్షించగా, జనతాదళ్ (యు) బిహార్ దివస్ ఉత్సవాల ద్వారా వలస కార్మికులను ఆకట్టుకోవాలనుకుంది. ఆర్జెడీ నేత తేజస్వీ యాదవ్ వలస సమస్యల పరిష్కారానికి ధర్నాలు కూడా చేశారు. కానీ ఇవన్నీ ఎన్నికల వ్యూహాలకే పరిమితమైపోయాయి. వాస్తవంగా వలస కార్మికుల ఓటుహక్కును కాపాడే పథకాలు ఏవీ అమలు కాలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో వలస కార్మికుల ఓటుహక్కు కేవలం రాజ్యాంగ పరిరక్షణ అంశం మాత్రమే కాదు, ఇది సామాజిక న్యాయం ప్రశ్న కూడా. ఎందుకంటే, దేశ ఆర్థిక వ్యవస్థకు వలస కార్మికులు అపారంగా తోడ్పడుతున్నారు. నిర్మాణ రంగం, రవాణా రంగం, వ్యవసాయం, పారిశ్రామిక రంగం అన్నింటిలోనూ వారి శ్రమ ప్రధానాధారం. కానీ వారికే ఓటు హక్కు లభించకపోవడం అన్యాయం. శ్రమ ద్వారా దేశానికి పునాది వేసే వారి గళం ప్రజాస్వామ్యంలో వినిపించకపోతే, అది ప్రజాస్వామ్యానికి ఒక పెద్ద లోటు. భారతదేశ ప్రజాస్వామ్యం వలస కార్మికుల ఓటు హక్కును గౌరవించి కాపాడగలిగితేనే తన గొప్పతనాన్ని నిలబెట్టుకుంటుంది. లేకపోతే ఎన్నికలలో నిజమైన ప్రతినిధిత్వం అసాధ్యం. కేవలం స్థిర నివాసులు మాత్రమే ఓటు వేయగలరన్న తర్కం పేదరికం, వలసలు అనే వాస్తవాలను విస్మరించడమే అవుతుంది. న్యాయపరమైన సంస్కరణలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, మరియు ప్రభుత్వాల నిబద్ధత మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం చూపగలవు.
ఇప్పటి వరకు మనం చర్చించిన అంశాలు వలస కార్మికుల ఓటుహక్కు ప్రాముఖ్యతను స్పష్టంగా తెలియజేశాయి. అయినప్పటికీ, ఈ సమస్యలో ఇంకా కొన్ని కీలక కోణాలు లోతుగా అర్థం చేసుకోవాలి. ఎందుకంటే ఇది కేవలం ఒక రాష్ట్రం లేదా ఒక వర్గానికి మాత్రమే పరిమితమై ఉండే సమస్య కాదు. భారతదేశ ప్రజాస్వామ్యం మొత్తం భవిష్యత్తును నిర్ధారించే పరీక్ష ఇది. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు వేసే హక్కు మాత్రమే కాదు. అది సమానత్వం, న్యాయం, భాగస్వామ్యం అనే విలువల సమాహారం. వలస కార్మికులకు ఓటు హక్కు నిరాకరించడం ద్వారా వారిని దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ నుండి వేరు చేస్తే, అది దేశం నడిపే మూల సూత్రాలకు విరుద్ధం అవుతుంది. ఒక వర్గాన్ని నిర్లక్ష్యం చేయడం అనేది మిగతా వర్గాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది.
ప్రతి నిర్మాణ ప్రాజెక్ట్, ప్రతి ఫ్యాక్టరీ, ప్రతి పొలం వెనుక వలస కార్మికుల చెమట ఉంది. నగరాల వేగవంతమైన అభివృద్ధికి వారు కారణం. అయితే ఓటర్ల జాబితాలో వారికి స్థానం లేకపోవడం అంటే వారి కృషి కనిపించనట్టే. ఒకవైపు వారి శ్రమను వినియోగించుకుంటూ, మరోవైపు వారి హక్కులను నిర్లక్ష్యం చేయడం సామాజిక అన్యాయం.
డిజిటల్ ఇండియా యుగంలో వలస కార్మికుల ఓటుహక్కు సమస్యకు పరిష్కారం కనుగొనడం అసాధ్యం కాదు. ఆధార్‌వోటర్ కార్డ్ అనుసంధానం, బ్లాక్‌చెయిన్ ఆధారిత ఓటింగ్ సిస్టమ్‌లు, మొబైల్‌ఆధారిత రిమోట్ ఓటింగ్ వంటి పరిష్కారాలు పరిశీలించాలి. పరీక్షాత్మకంగా కొన్ని నియోజకవర్గాలలో వీటిని అమలు చేసి, విజయవంతమైతే దేశవ్యాప్తంగా విస్తరించవచ్చు.
'సాధారణ నివాసి' అనే పదానికి సరైన నిర్వచనం లేకపోవడం వల్లే ఈ సమస్య ఎక్కువగా ఉత్పన్నమవుతోంది. ఒక కార్మికుడు ఆరు నెలల పాటు తన స్వగ్రామంలో లేకపోయినా, అతను అక్కడే ఓటరుగా ఉండటానికి అర్హుడు కావాలి. ఎందుకంటే అతని మూలాలు, కుటుంబం, గ్రామం అన్నీ అక్కడే ఉంటాయి. కాబట్టి చట్టంలో ఈ అంశం మీద ప్రత్యేక సవరణ అవసరం.
ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు నిజమైన నిబద్ధతతో ముందుకు రాకపోతే, ఎలాంటి చట్టాలు, సాంకేతిక పరిష్కారాలు పనిచేయవు. ఇప్పటివరకు వలస కార్మికుల సమస్య ఎన్నికల నినాదాల వరకే పరిమితమైంది. "పలయన్ రోకో నౌక్రీ దో" (వలసలు ఆపండి, ఉద్యోగాలు ఇవ్వండి) అని నినాదాలు ఇచ్చినా, వాస్తవ సమస్యలను పరిష్కరించడంలో పెద్దగా మార్పు కనిపించలేదు.
ప్రపంచంలోని కొన్ని దేశాలు తమ వలస కార్మికుల హక్కులను కాపాడటానికి ప్రత్యేక విధానాలను అమలు చేశాయి. ఉదాహరణకు, ఫిలిప్పీన్స్ దేశం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన కార్మికులకు రిమోట్ ఓటింగ్ సదుపాయం కల్పించింది. అదే విధంగా మెక్సికో కూడా అమెరికాలో పనిచేస్తున్న తన పౌరులకు ఓటు వేసే హక్కును నిలబెట్టింది. భారత్ కూడా ఈ అనుభవాలనుంచి పాఠాలు నేర్చుకోవాలి.
వలస కార్మికులు కేవలం ఆర్థిక దృక్కోణంలో కాకుండా సామాజిక దృక్కోణంలో కూడా వెనుకబడిన వర్గం. వారి పిల్లలకు విద్య, ఆరోగ్యం అందకపోవడం, మహిళలు అనేక రకాల దోపిడీలకు గురవడం సాధారణమే. ఈ నేపథ్యంలో వారి ఓటు హక్కు కోల్పోవడం మరింత అన్యాయం. ఓటు హక్కు ద్వారా వారు తమ సమస్యలను ప్రజా ప్రతినిధుల ముందు ఉంచే అవకాశం పొందుతారు.
-తీయ స్థాయిలో వలస కార్మికుల గణాంకాలులిలి: ప్రతి రాష్ట్రం వలస కార్మికుల వివరాలను సేకరించి, కేంద్ర డేటాబేస్‌కి అందించాలి.
- తాత్కాలిక ఓటరు గుర్తింపు కార్డులిలి: వలస ప్రదేశంలో వారికి తాత్కాలికంగా ఓటు హక్కు వినియోగించే వీలు కల్పించాలి.
- సాంకేతిక వినియోగంలిలి: రిమోట్ ఓటింగ్ పద్ధతులను త్వరితగతిన పరీక్షించి అమలు చేయాలి.
- లిలిచట్ట సవరణలులిలి: 'ప్రజా ప్రతినిధ్య చట్టం1950'లో స్పష్టత ఇచ్చి వలస కార్మికుల హక్కులను రక్షించాలి. వలస కార్మికుల ఓటుహక్కు కేవలం ఓ చిన్న సమస్యగా కాకుండా, దేశ ప్రజాస్వామ్య సమగ్రతకు కీలకమైన అంశంగా చూడాలి. ప్రజాస్వామ్యం అంటే ప్రతి పౌరుని గళం వినిపించాలి అన్నదే. వలస కార్మికుల గళం వినిపించకపోతే, భారత ప్రజాస్వామ్యం అసంపూర్ణంగా మిగిలిపోతుంది. కాబట్టి వలస కార్మికుల ఓటు హక్కు రక్షణ దేశ భవిష్యత్తుకు అత్యంత ప్రాధాన్యమైన కర్తవ్యం.


## అంతటా గణేశు

భక్తి



హిందూ ధర్మంలో గణేశుడికి మహెూన్నతమైన స్థానం ఉంది. ప్రతి శుభకార్యం ఆయన ప్రార్థనతో ప్రారంభమవుతుంది. ఎందుకంటే ఆయనే ప్రారంభకర్త, జీవితంలోని అన్ని దశల్లో విఘ్నాలను తొలగించేవాడు. భౌతిక, మానసిక, జ్ఞాన సంబంధమైన ఆటంకాలను తొలగించే శక్తి. ఆయన అనుగ్రహంతో బుద్ధిని, వికాసాన్ని, సరైన మార్గదర్శనాన్ని పొందగలుగుతాం.
%మనలో ఉండే ఏడుచక్రాలలో మొట్టమొదటి శక్తి కేంద్రం... మూలాధార చక్రం. అదే గణేశుడి నివాస స్థానం. ఆ చక్రానికి ఆయన అధిష్ఠాన దేవత. ఆయ చక్రం పృధ్వీతత్త్వంతో రూపొంది ఉంటుంది. గణేశుణ్ణి కూడా ఆయన తల్లి అయిన గౌరీమాత భూతత్త్వంతోనే తయారు చేసింది. మన షట్ చక్రాలలోనూ గణేశ తత్త్వం నిండి ఉంటుంది. అంటే అంతటా ఆయనే. మూలాధార చక్రంలో ఉండే ఆయన మనల్ని సదా రక్షిస్తూ ఉంటాడు. ఆత్మసాక్షాత్కారాన్ని పొందడానికి మూలమైన కుండలినీ శక్తి మేలుకొని.. ఊర్ధ్వముఖంగా పయనిస్తున్నప్పుడు... ఆ శక్తిని సదా కాపాడేది ఆయన. ఆయన ప్రమేయం లేకుండా కుండలినీ శక్తి జాగృతం కాదు. అది జాగృతం కాకపోతే మనకు ఆత్మసాక్షాత్కారం అసాధ్యం. కుండలినీ మాతయే గణేశుని తల్లి అయిన గౌరీమాతగా... మన మూలాధారంలో మూడున్నర చుట్లతో నిద్రాణ స్థితిలో ఉంటుంది. వినాయకుణ్ణి ప్రసన్నం చేసుకోవాలంటే... ఆయన గుణగణాలు, లక్షణాలు, శక్తులు మనలో స్థిరపరుచుకోవాలి. గణేశునిలో ప్రప్రథమంగా చెప్పుకోవలసిన ముఖ్యమైన గుణం... అమాయకత్వం. దాన్నే ఆధ్యాత్మికంగా 'అభోదిత తత్త్వం' అంటారు. అది మనలో ఉంటే... మనల్ని ఎవరూ మోసం చేయలేరు. ఎవరూ హాని కలిగించలేరు. అటువంటి అమాయకత్వాన్ని మనలో స్థిరపరుచుకుంటే ఎలాంటి సమస్యలనైనా సునాయాసంగా పరిష్కరించుకోగలుగుతాం.
ప్రజల దృష్టిలో అమాయకత్వం అంటే చేతకానితనం. అమాయకత్వంతో ఉంటే ఇతరుల చేతిలో మోసపోతామనే అపోహ వారిలో ఉంటుంది. కానీ వాస్తవానికి అమాయకత్వం అంటే విచక్షణ, వివేకంతో కూడిన గణేశుని శక్తి. ఆ లక్షణం ఉన్నవారికి సదా గణేశుని రక్షణ ఉంటుంది. ఇక... ఆయన శరీరం మానవుల మాదిరిగా ఉన్నప్పటికీ... శిరస్సు ఏనుగు శిరస్సు. ఏనుగు జంతు ప్రపంచంలో అత్యంత తెలివైనది. దాని చెవులు ఎంత దూరంలోని శబ్దాన్నైనా వినగలవు, కళ్ళు చాలా దూరం చూడగలవు. నైపుణ్యం, నేర్పరితనం గణేశుని గుణాలు. ఆయన వివేకాన్ని, విచక్షణను అనుగ్రహిస్తాడు. ఆయన ఎంత మహెూన్నతుడో అంత సూక్ష్మరూపుడు. పెద్ద పొట్టతో ఉన్నప్పటికీ ఎంతో తేలికగా ఉంటాడు. అందుకే అతి చిన్నదైన ఎలుక మీద కూర్చోగలుగుతాడు. ఆయన నిరాండబరతకు చిహ్నమే ఎలుక వాహనం. ఆయనకు ఉన్న గుణగణాలలో మరొకటి... తల్లిపట్ల శరణాగతి. ఎల్లప్పుడూ తల్లిని ప్రసన్నం చేసుకొనే ప్రయత్నంలో ఉంటాడు. అతనిలోని సమస్త జ్ఞానానికి, ఆనందానికి ఆ తల్లే మూలం. తల్లి పట్ల ఉండవలసిన వినయవిధేయతలు, గౌరవం ఆయన నుంచి నేర్చుకోవాలి.

# నవ విశ్వం



## మాజీ సీఎం విమర్శ.. హీరో విజయ్‌వి పగటి కలలే..




**చెన్నై- నవభూమి:** రాజకీయాల్లో అంతగా అనుభవంలేని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, నటుడు విజయ్ ఉన్నపళంగా అధికారంలోకి రావాలని పగటి కలలు కంటున్నారని, ప్రజల అండదండలు లేకుండా ఇది ఎప్పటికీ నెరవేరదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి విమర్శించారు. డీఎంకే అవినీతిని ఎండగట్టడానికే అన్నాడీఎంకేను ఎంజీఆర్ స్థాపించి ప్రజా సమస్యలపై దాదాపు ఐదేళ్లు పోరాడి అధికారంలో కూర్చున్నారని గతాన్ని గుర్తుచేసుకున్నారు. రాష్ట్రంలో కొత్తగా పార్టీలు ప్రారంభించే నాయకులంతా ఎంజీఆర్, జయలలితల ఫొటోలతో ప్రజలను ఆకట్టుకుంటున్నారని, విజయ్ కూడా టీవీకే మహానాడులో అన్నాదురై, ఎంజీఆర్ ఫొటోలు పెట్టారని వ్యాఖ్యానించారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో ఈపీఎస్ సాగిస్తున్న ప్రచారయాత్ర గురువారం ఉదయం కాంచీపురం చేరుకుంది. ఆయన ముందుగా కామాక్షి అమ్మవారిని దర్శించి విశేష పూజలు చేశారు. అనంతరం కాంచీపురం జంక్షన్‌లో సాయంత్రం జరిగిన రెడ్‌షోలో ఈపీఎస్ మాట్లాడుతూ రాజకీయ పార్టీని ప్రారంభించిన వెంటనే అధికారంలోకి వచ్చిన చరిత్ర ఇప్పటివరకు ఎవరికీ లేదని, ప్రజల కోసం విరామం లేకుండా శ్రమించిన పార్టీలకే తగిన గుర్తింపు ఉంటుందన్నారు. అలా కాకుండా పార్టీ ప్రారంభించిన సంవత్సరానికే అధికార పీఠమెక్కాలని నటుడు విజయ్ కంటున్న పగటి కలలు నెరవేరబోవని ఆయన విమర్శించారు. చేనేత రంగాన్ని కాపాడి నేత కార్మికుల జీవనశైలిని మెరుగుపరిచేందుకు అన్నాడీఎంకే ప్రభుత్వం అమలుపరిచిన పథకాలను, చేసిన కృషిని వస్త్ర పరిశ్రమలకు పేరెన్నికగన్న కాంచీపురం ప్రజలు మరిచిపోలేదన్నారు.

## ఎన్డీయే అభ్యర్థికి మద్దతుపై బీజేపీకి పవార్, ఉద్ధవ్ ఠాక్రే ఏం చెప్పారంటే



**ముంబై- నవభూమి:** ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాల్సిందిగా విపక్ష నేతలను బీజేపీ సంప్రదిస్తోంది. ఇందులో భాగంగా నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్‌చంద్ర పవార్) చీఫ్ శరద్ పవార్, శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రేలను మద్దతు కోరుతూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ సంప్రదించారు. దీనిపై శుక్రవారంనాడు మీడియాతో ఫడ్నవిస్ మాట్లాడుతూ, మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు మద్దతు ఇవ్వాల్సిందిగా పవార్‌ను కోరానని, అయితే విపక్ష కూటమి అభ్యర్థి వెంటే తాము వెళ్తామని ఆయన చెప్పారని తెలియజేశారు. ఉద్ధవ్ ఠాక్రే మాత్రం దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారని వివరించారు. దీనికి ముందు శివసేన నేత సంజయ్ రౌత్ మాట్లాడుతూ, దేవేంద్ర ఫడ్నవిస్‌తో పాటు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం ఠాక్రేను సంప్రదించారని, ఎన్డీయే అభ్యర్థికి మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారని తెలిపారు. మహారాష్ట్రలోని విపక్ష మహాకూటమిలో కాంగ్రెస్‌తో ఎన్‌సీపీ (ఎస్‌పీ), శివసేన (యూబీటీ) భాగస్వాములుగా ఉన్నాయి. జాతీయ స్థాయిలో 'ఇండియా' కూటమిలో మూడు పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. శివసేన (యూబీటీ)కు లోక్‌సభలో 9 మంది, ఎన్‌సీపీ (ఎస్‌పీ)కి 10 మంది ఎంపీలు ఉండగా, రెండు పార్టీలకు రాజ్యసభలో చెరో ఇద్దరు ఎంపీలు ఉన్నారు. కేంద్రంలోని అధికార ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయగా, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డిని విపక్ష కూటమి ఎంపిక చేసింది. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగనుంది. ఎలక్టోరల్ కాలేజీలో 781 మంది ఉండగా, మెజారిటీ మార్క్ 391గా ఉంది.

## వాహనదారులకు గుడ్ న్యూస్ చెప్పిన ట్రాఫిక్ పోలీసులు



**బెంగళూరు - నవభూమి:** వాహనదారులకు బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం గుడ్ న్యూస్ చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు అతి క్రమించిన వాహనదారులకు గతంలో విధించిన చలానాల్లో చెల్లించే రుసుంను భారీగా తగ్గించినట్లు వెల్లడించారు. చెల్లించాల్సిన రుసంలో సగం.. అంటే 50 శాతం నగదు చెల్లిస్తే సరిపోతుందని వాహనాదారులకు ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. ఈ డిస్కౌంట్ ఆఫర్ గడువు ఆగస్ట్ 23వ తేదీ నుంచి ప్రారంభమవుతుందన్నారు. సెప్టెంబర్ 12వ తేదీ వరకు ఈ చలానాలు చెల్లించ వచ్చని వివరించారు. నగరంలోని వాహనదారులకు జరిమాన భారం నుంచి ఉపశమనం కలిగించడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. అంతేకాదు.. ఈ చెల్లింపులను క్రమబద్ధీకరించు కోవడంతోపాటు చట్టపరమైన సహాయాన్ని నివారించడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు బెంగళూరు ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఈ నగదును వివిధ మార్గాల్లో చెల్లించ వచ్చని వాహనదారులకు ఈ సందర్భంగా సూచించారు. ఆన్‌లైన్ పేమెంట్‌ను బెంగళూరు ట్రాఫిక్ పోలీసుల (బీపీటీ) వెబ్‌సైట్, కర్ణాటక స్టేట్ పోలీస్ తోపాటు బీటీపీ అస్త్రంమొబైల్ యాప్ ద్వారా జరిమాన నగదు చెల్లించ వచ్చని వాహనదారులకు వివరించారు. అలాగే స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లేదా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సెంటర్‌లో ఈ జరిమాన పడిన వ్యక్తి స్వయంగా వెళ్లి నగదు చెల్లించకోవచ్చన్నారు. అంతేకాకుండా.. కర్ణాటకవన్, బెంగళూరువన్ సేవా కేంద్రాల్లో సైతం ఈ నగదు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అయితే కారు రిజిస్ట్రేషన్ నెంబర్లకు లింక్ చేయబడిన ఏమైనా బకాయిలు ఉన్నాయో.. చలాన్లలను తనిఖీ చేసుకోవాలని వాహనాదారులకు వారు స్పష్టం చేశారు. ఇక చెల్లింపులు ఈ చలాన్లకు మాత్రమే వర్తిస్తుందని బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

## 'శ్రీరామ్' బ్యాగ్‌తో తాజ్‌మహల్ చూసేందుకు అనుమతించలేదు.. పర్యాటకుడి ఆరోపణ



**న్యూఢిల్లీ-నవభూమి:** తాజ్ మహల్ చూసేందుకు వెళ్లిన ఓ వ్యక్తి తాజాగా అక్కడి సెక్యూరిటీ సిబ్బం దిపై సంచలన ఆరోపణలు చేశాడు. శ్రీరామ్ అని రాసున్న బ్యాగు తీసుకుని తాజ్‌మహల్ చూసేందుకు వెళుతున్న తనను సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారని ఆరోపించాడు. బ్యాగ్ తీసుకుని లోపలకు వెళ్లనివ్వలేదని చెప్పాడు. యూపీలోని కాన్పూర్‌కు చెందిన ఆశిష్ చేసిన ఈ ఆరోపణలు ప్రస్తుతం సంచలనం రేకెత్తిస్తున్నాయి. ఆశిష్ సోషల్ మీడియాలో ఈ ఆరోపణలు చేశాడు. ఎంట్రీ టిక్కెట్ ఉన్నా తనను లోపలకు పంపించలేదని చెప్పాడు. శ్రీరామ్ అని రాసున్న బ్యాగ్ కారణంగానే సెక్యూరిటీ సిబ్బంది తనను అనుమతించలేదని అన్నాడు. అయితే, తాజ్‌మహల్ సెక్యూరిటీ సిబ్బంది మాత్రం ఆశిష్ ఆరోపణలను కొట్టిపారేశారు. ఈ ఉదంతానికి మత పరమైన కోణం జోడించే ప్రయత్నం చేయడం విచారకరమని వ్యాఖ్యానించారు. ఆశిష్ బ్యాగును స్కాన్ చేయగా అందులో పలు నిషేధిత వస్తువులు కనిపించాయని తెలిపారు. బ్యాగుపైనున్న మతపరమైన రాతలకు ఈ వివాదానికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఈ విషయంపై సీనియర్ కమాండెంట్ వైభవ్ దూబే మాట్లాడుతూ.. అశిష్ బ్యాగులో సుపారీ, కట్టర్ వంటి పలు నిషేధిత వస్తువులు కనిపించాయని అన్నారు.

బ్యాగును క్లోక్ రూమ్‌లో దాచిపెట్టి రావాలి లేదా వాటిని బయటే వదిలేయాలని స్పష్టం చేశామని చెప్పారు. కానీ అతడు మాత్రం ఈ ఉదంతాన్ని రికార్డు చేసి మతపరమైన కోణం జోడించే ప్రయత్నం చేయడం విచారకరమని అన్నారు. మరో ఘటనలో ఓ వ్యక్తి తాజ్‌మహల్ లోపలి భాగాన్ని ఫొటో తీసే ప్రయత్నం చేశాడు. షాజహాన్, ముమ్‌తాజ్ మహల్‌లకు లోపలి నుంచి ఉన్న మార్గాన్ని కెమెరాతో రికార్డు చేశారు. దీంతో ఈ రెండు టూంబ్స్‌కు ఉన్న సీక్రెట్ మార్గాలు వైరల్ అయ్యాయి.

# ముఖ్యమంత్రిపై దాడి.. మర్నాడే ఢిల్లీకి కొత్త పోలీస్ బాస్!



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుత ఢిల్లీ పోలీస్ కమిషనర్ ఎస్బీకే సింగ్‌ను తప్పించి.. ఆయన స్థానంలో మరో అధికారిని ప్రభుత్వం నియమించింది. ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడి జరిగిన మర్నాడే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. 92 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సతీష్ గోల్చాను ఢిల్లీ పోలీస్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. 1998 ఏజీఎంయూటీ (అరుణాచల్ ప్రదేశ్, గోవా, మిజోరామ్, యూనియన్ టెరిటోరియల్స్) కేడర్ ఐపీఎస్ అధికారి అయిన ఎస్బీకే సింగ్.. హోమ్ గార్డ్స్ డీజీగా కొనసాగుతూనే ఢిల్లీ పోలీస్ కమిషనర్‌గా ఆగస్టు 1న అదనపు బాధ్యతలు చేపట్టారు. గోల్చా సైతం ఏజీఎంయూటీ కేడర్ అధికారి కావడం గమనార్హం. డీసీపీ, జేసీపీగా, ఎస్పీపీ (లా అండ్ ఆర్డర్, నిఘ) సహా ఢిల్లీ పోలీస్ విభాగంలో పలు బాధ్యతలు నిర్వర్తించారు. ఈశాన్య ఢిల్లీలో 2020 నాటి మత ఘర్షణల సమయంలో గోల్చా ప్రత్యేక కమిషనర్‌గా ఉన్నారు. గతేడాది ఏప్రిల్‌లో ఆయన జైళ్ల శాఖ డీజీగా నియమితులయ్యారు. జన్ సున్వాయ్‌లో ముఖ్యమంత్రిపై అధికారిక నివాసంలో దాడి జరగడం అతిపెద్ద భద్రతా వైఫల్యమే. సీఎంను చెంపదెబ్బ కొట్టిన నిందితుడు.. ఆమె జుట్టుపట్టుకుని లాగే ప్రయత్నం చేశాడు. ఇది యాదృచ్ఛికంగా జరిగింది కాదని, పథకం ప్రకారమే దాడిచేసినట్టు గుర్తించారు. షాలీమార్ బాగ్‌లోని సీఎం వ్యక్తిగత నివాసం వద్ద రెక్కీ నిర్వహించినట్టు సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డయ్యింది. నిందితుడు గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన రాజేశ్ భాయ్ సకారియాగా గుర్తించారు. జైల్లో ఉన్న తన బంధువును విడిపించడం కోసమే సీఎంపై దాడిచేసినట్టు భావిస్తున్నారు. అయితే, ఢిల్లీలో వీధి కుక్కల సంరక్షణ గురించి పట్టించుకోకపోవడంతోనే తాను ఇలా చేశానని చెబుతున్నాడు. అతడి తల్లి కూడా తన కుమారుడు జంతు ప్రేమికుడని, ఇటీవల శునకాల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆవేదనగా ఉన్నాడని చెప్పారు. ఇక, తనపై జరిగిన దాడి గురించి బుధవారం సాయంత్రం ఢిల్లీ సీఎం రేఖా గుప్తా స్పందించారు. తాను క్షేమంగా ఉన్నాని, ఇలాంటి పిరికిపంద చర్యలు ప్రజా సేవ చేయాలనే తన సంకల్పాన్ని అడ్డుకోలేవని ఆమె స్పష్టం చేశారు.

## వాహనదారులకు గుడ్‌న్యూస్.. పెండింగ్ చలాన్లపై 50 శాతం డిస్కౌంట్



**న్యూఢిల్లీ-నవభూమి:** వాహనదారులు రోడ్డు ఎక్కారంటే చాలు.. ట్రాఫిక్ పోలీసులు డేగ కళ్లతో చూస్తుంటారు. ఏ చిన్న తప్పు చేసినా సరే.. చలాన్ విధించి.. వాహనదారుల జేబుకు చిల్లు పెట్టేందుకు రెడీ అవుతుంటారు. వాహనాలకు సంబంధించిన కాగితాలు మొదలు.. ట్రాఫిక్ రూల్స్ వంటి పలు అంశాల్లో కచ్చితంగా ఉంటూ ఏ చిన్న పొరపాటు చేసినా.. భారీ ఎత్తున చలాన్ విధిస్తుంటారు. ఇది కట్టలేక చాలా మంది ఇబ్బంది పడుతుంటారు. ఈ క్రమంలో వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు శుభవార్త చెప్పారు. పెండింగ్ చలాన్ల మీద 50 డిస్కౌంట్ ప్రకటించారు. ఆ వివరాలు.. బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు శుభవార్త చెప్పారు. పెండింగ్ చలాన్ల మీద 50 శాతం డిస్కౌంట్ ప్రకటించారు. రేపటి నుంచి అనగా ఆగస్టు 23 నుంచి సెప్టెంబ్ 12 వరకు ఈ డిస్కౌంట్ ఆఫర్ అమల్లో ఉంటుందని తెలిపారు. అయితే ఈ డిస్కౌంట్ ఆఫర్ కేవలం ఈ చలాన్ల మీదనే వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. ఈపెండింగ్ జరిమానాలను బీటీపీ వెబ్‌సైట్ లేదా కర్ణాటక రాష్ట్ర పోలీస్/%దీూ ూౌుథువీ% యాప్‌లో లేదా సమీపంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కి కూడా వెళ్లి చెల్లించవచ్చు అని తెలిపారు. లేదా ఇన్‌ఫాంట్రీ రోడ్‌లోని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సెంటర్‌కు కూడా వెళ్లి చెల్లించవచ్చని అధికారులు తెలిపారు. ఇవే కాక కర్ణాటక వన్, బెంగళూరు వన్ కేంద్రాల ద్వారా పెండింగ్ చలాన్లు చెల్లించవచ్చని ప్రకటించారు..రెండు సంవత్సరాల క్రితం కూడా బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు ఇలానే పెండింగ్ చలాన్ల మీద డిస్కౌంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. 2023లో పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ జరిమానాలపై బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు రెండుసార్లు డిస్కౌంట్ ఆఫర్ ప్రకటించారు. దీంతో వేల మంది వాహనాదారుల.. తమ పెండింగ్ చలాన్లను చెల్లించారు. అయితే ఈ సారి కేవలం ఈ చలాన్ల మీదనే డిస్కౌంట్ ఆఫర్ ప్రకటించారు. గతంలో ఇలా ఆఫర్ ప్రకటించిన మరుసటి రోజే రూ.5.6 కోట్లు వసూలు అయినట్లు అధికారులు తెలిపారు. గతంలో డిస్కౌంట్ ఆఫర్ ప్రకటించిన సమయంలో కర్ణాటకలో మొత్తం రూ.530 కోట్ల మేర వాహనాదరులు పెండింగ్ చలాన్లను కట్టాల్సి ఉండే. ఈ మొత్తంలో కేవలం బెంగళూరుకు చెందినవారే రూ.500కోట్లు మేర చెల్లించాల్సి ఉంది. దీంతో ప్రభుత్వం 50 శాతం డిస్కౌంట్ ఆఫర్ ప్రకటించింది. దీనికి వాహనదారుల నుంచి మంచి స్పందన వచ్చింది. చలాన్లు కట్టేందుకు ఎగబడ్డారు. మరి ఈసారి ఎలా స్పందిస్తారో.. ఎంత మేర ఈ అవకాశాన్ని వినియోగించుకుంటారో చూడాలి అంటున్నారు.

## శాంతించిన తుంగభద్రమ్మ



**బళ్ళారి-నవభూమి:** శనివారం కాస్త శాంతించింది. జలాశయం నుంచి నదికి నీరు విడుదల తక్కువ కావడంతో లోతట్టు ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. కంప్లి కోట వద్ద బ్రిడ్జిని తాకుతున్న నీరు తగ్గుముఖం పట్టింది. కోట వద్ద ఆంజనేయస్వామి దేవస్థానంలో నీరు తగ్గుముఖం పట్టింది. నదికి ఎక్కువగా నీరు పోటెత్తడంతో మత్స్యకారులు తెప్పలను గట్టుకు చేర్చారు. ఈ యేడాది గత మూడు నాలుగు సార్లు నదికి నీరు పోటెత్తడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రైతులు పొలాల్లోకి వెళ్లాలన్నా తెప్పలపైన వెళ్లవలసిన అవసరం ఏర్పడింది. మొత్తానికి జలాశయంపై భాగంలో వర్షాలు తక్కువ కావడంతో నదికి నీరు కూ డా వరద తక్కువైంది. కంప్లి వంతెనపై ఇంకా వాహనాలను అనుమ తించడంలేదు.

## అగ్నిమాపక శాఖలో ఉద్యోగాల జాతర..



**చెన్నై- నవభూమి:** రాష్ట్ర అగ్నిమాపక శాఖలో వేలం సంఖ్యలోని ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఈ శాఖతో పాటు పోలీస్ కానిస్టేబుల్, యూనిఫార్మ్ సర్వీస్ కానిస్టేబుల్‌తో కలిపి మొత్తం 3644 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందుకోసం గురువారం నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించారు. తమిళనాడు యూనిఫార్మ్‌డ్ సర్వీస్ సెక్షన్ బోర్డు ఆధ్వర్యంలో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. దీని కోసం రాత పరీక్ష నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ యేడాది ఖాళీ పోస్టులను వెల్లడించి భర్తీ చేయనుంది. 2833 సెకండరీ గ్రేడ్ కానిస్టేబుల్ పోస్టులు, 180 జైలు సిబ్బంది, 631 అగ్నిమాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టులకు ఈ నెల 22 నుంచి సెప్టెంబరు 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. సెప్టెంబరు 25న దరఖాస్తుల్లో తప్పొప్పుల సవరణకు అనుమతిస్తారు. నవంబరు 11న రాత పరీక్ష జరుగనుంది. కానిస్టేబుల్ పోస్టుకు రూ.18,200 నుంచి రూ.67,100 వేతనం ఇస్తారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జూలై ఒకటో తేదీ నాటికి 18 యేళ్ళు పూర్తయి, 26 యేళ్ళకు మించరాదని ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

## తేల్చి చెప్పిన టీవీకే.. ఎన్నికల్లో ఒంటరి పోరాటమే..

**న్యూఢిల్లీ-నవభూమి:** వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో ఫాసిస్టు బీజేపీని, పాయిజన్ డీఎంకేని చిత్తుగా ఓడించడమే తమిళగ వెట్రికళగం (టీవీకే) ప్రధాన కర్తవ్యమని ఆ పార్టీ అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ శపథం చేశారు. మదురై సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన పార్టీ ద్వితీయ మహానాడులో ఆయన ఉద్వేగంగా ప్రసంగిస్తూ.. తమ పార్టీకి సైద్ధాంతికి శత్రువు బీజేపీ అని, రాజకీయ శత్రువు డీఎంకే అని ప్రకటించారు. చెన్నై: వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో ఫాసిస్టు బీజేపీని, పాయిజన్ డీఎంకేని చిత్తుగా ఓడించడమే తమిళగ వెట్రికళగం (టీవీకే) ప్రధాన కర్తవ్యమని ఆ పార్టీ అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ శపథం చేశారు. మదురై సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన పార్టీ ద్వితీయ మహానాడులో ఆయన ఉద్వేగంగా ప్రసంగిస్తూ.. తమ పార్టీకి సైద్ధాంతికి శత్రువు బీజేపీ అని, రాజకీయ శత్రువు డీఎంకే అని ప్రకటించారు. అదే సమయంలో అన్నాడీఎంకే పేరు ప్రస్తావించకుండా ఆ పార్టీపై పరోక్ష విమర్శలు చేశారు. అడవిలోని సింహం ఒంటరిగానే వేటకు వెళ్తుందని,
తనకంటే బలమైన ఎరను మాత్రమే వేటాడుతుందని, ఆ రీతిలోనే తాను రాజకీయాల్లో తాడోపేడో తేల్చుకోవాలనే డీఎంకేతో తలపడేందుకు సిద్ధమయ్యాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే ఒంటరిగా బరిలోకి దిగుతుందని స్పష్టం చేశారు. సినీ రంగంలో ఛాన్సులు లేక తాను రాజకీయాల్లోకి రాలేదని, ఆ రంగంలో ఉన్నతస్థితిలో ఉన్నప్పుడే రాజకీయ ప్రవేశం చేశానని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో 234 నియోజకవర్గాలలోనూ తానే అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు భావించి ప్రజలంతా పార్టీకి ఘనవిజయం చేకూర్చాలని పిలుపునిచ్చారు.
రాష్ట్రంలో తాము చేసిన అవినీతి అక్రమాలకు భయపడుతూ ఓ పార్టీ బీజేపీతో ప్రత్యక్షంగా పొత్తుపెట్టుకుందని, మరొక పార్టీ రహస్యంగా పొత్తు కుదుర్చుకుందని విజయ్ ఆరోపించారు. ఆ రెండు పార్టీల బాటలో టీవీకే కూడా బీజేపీతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ పట్టలేదని, ఆ పార్టీతో పొత్తు పెట్టుకునేందుకు తామెలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదన్నారు. మదురై నగరంలో పార్టీ ద్వితీయ మహానాడు ఇంత గొప్పగా జరుగటం తనకెంతో ఆనందం కలిగిస్తోందని, మదురై ప్రజలు నిజాయితీ పరులను ఆదరిస్తారని, అందుకు మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ చక్కటి ఉదాహరణ అని, ఆయనను చూడలేకపోయినా ఆయన గుణాలను పుణికి పుచ్చుకున్న విజయకాంత్‌తో మంచి పరిచయాలున్నాయని, ఆ నాయకుడిని స్ఫూర్తిగా తీసుకునే నిజాయితీతో రాజకీయాలు చేస్తున్నానని వెల్లడించారు. విక్రవాండిలో తమ పార్టీ తొలి మహానాడు రాష్ట్ర రాజకీయాలను వేడెక్కించిందని, ఆ రీతిలోనే మదురై మహానాడు ప్రత్యర్థుల గుండెల్లో గుబులు పుట్టిస్తోందని అన్నారు. పార్టీని ప్రారంభించినప్పడి నుండి ప్రత్యర్థులంతా పనిగట్టుకుని విమర్శలు చేస్తున్నారన్నారు. రాజకీయాల్లోకి ఆయనే (రజినికాంత్) రాలేదు ఈయన వస్తారా? అని ఎగతాళి చేశారని, రాజకీయాల్లోకి వచ్చాక అధికారంలోకి రాలేరని నిరుత్సాహపరుస్తున్నారని, ఏది ఏమైనప్పటికీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ డీఎంకేతోనే తలపడుతుందని, ఈ రెండు పార్టీ మధ్యే గట్టి పోటీ ఉంటుందన్నారు.

## సరిహద్దుల్లో 150 కి.మీ. వెనక్కి తగ్గినా.. చైనాను నమ్మొద్దు.. ఆర్మీ హెచ్చరికలు



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్, చైనా సంబంధాల్లో సానుకూలత నెలకున్నా.. సరిహద్దుల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిందేనని ఆర్మీ అధికారులు హెచ్చరించారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతలను తగ్గించుకునేందుకు భారత్, చైనాలు ఐదేళ్ల తర్వాత ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో ఈ హెచ్చరికలు రావడం గమనార్హం. జూన్ 2020లో గల్వాన్ లోయ ఘర్షణల తర్వాత తొలిసారి చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యీ ఈ వారం భారత్ పర్యటనకు వచ్చిన సంగతి తెలిసిందే. ఉద్రిక్తతలు సద్దుమణిగే ప్రక్రియ రాబోయే రోజుల్లో మొదలైనా..భారత సైన్యం అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎందుకంటే చైనా 150 కిలోమీటర్లు వెనక్కి తగ్గినా కేవలం రెండు మూడు గంటల్లోనే స్థావరాలకు చేరుకునేందుకు అవసరమైన మౌలిక వసతులు సిద్ధంగా ఉన్నాయని ఆర్మీ అధికారులు పేర్కొన్నారు.

సీనియర్ ఆర్మీ అధికారి మాట్లాడుతూ.. "తూర్పు లడఖ్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకూ వాస్తవాధీన రేఖ వెంబడి గత ఐదేళ్లుగా చైనా రోడ్లు, వంతెనలు, సొరంగాలు, స్థావరాలను నిర్మించుకుంది.. దీంతో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ 100 నుంచి 150 కిలోమీటర్ల వెనక్కి తగ్గినా కేవలం 2 నుంచి 3 గంటల్లోనే స్థావరాలకు చేరుకోగలదు.. మన సైన్యాలకు అది సాధ్యం కాదు.. ఉద్రిక్తతలను తగ్గించే చర్చల సమయంలో ప్రత్యర్థి శక్తుల మధ్య సమీకరణలో ఈ భారీ సమయ వ్యత్యాసాన్ని పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది" అని అన్నారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ పర్యటన సందర్భంగా భారత్, చైనా ఉద్రిక్తతను తగ్గించడం గురించి ఇంకా చర్చించాలని, అందుకు మార్గదర్శకాలు, పద్ధతులతో ప్రారంభించాలని మాత్రమే నిర్ణయించాయి. 2020 ఏప్రిల్-మేలో తూర్పు లడఖ్‌లోకి పీఎల్ఏ చొరబాట్ల తర్వాత ఎల్ఏసీ వెంబడి భారీగా సైన్యాలను మోహరించడంతో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. కానీ, ఇరుదేశాల ఉన్నతాధికారుల మధ్య జరిగిన చర్చలతో పాటు గతేడాది అక్టోబరు దెప్సాంగ్, దేమ్‌చోక్‌లోని ముఖాముఖి ప్రదేశాలలో దళాలు వెనక్కి మళ్లడంతో పరిస్థితి చక్కబడింది. "అక్కడ ప్రత్యర్థి సైనికుల సమన్వయంతో కూడిన పెట్రోలింగ్‌లో ఎటువంటి అంతరాయం లేదు. కానీ చైనా సైన్యం సంసిద్ధత, మౌలిక సదుపాయాల నిర్మాణం కొనసాగుతున్నందున మన భద్రతను తగ్గించలేం' అని మరొక అధికారి చెప్పారు. కొద్ది నెలలుగా చైనా కంబైన్డ్ ఆర్మ్స్ బ్రిగేడ్స్‌లోకి కొన్ని యూనిట్లు ఎల్ఏసీ నుంచి 100 కిలోమీటర్ల దూరం వెనక్కి వెళ్లినప్పటికీ ఇంకా కొన్ని రెజ్మింట్లు సరిహద్దుల్లోనే మోహరించి ఉన్నాయి.. ప్రతిప క్యాబ్ యూనిట్‌లో 4,500 నుంచి 5,000 మంది సైనికులు ఉంటారు.. వీరి వద్ద యుద్ధ ట్యాంకులు, ఆర్మర్డ్ వాహనాలు, ఆర్టిలరీ, ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణులు సహా ఆధునిక ఆయుధ వ్యవస్థలు ఉన్నాయి' అని తెలిపారు.

## పార్లమెంట్‌లో భద్రతా లోపం.. ఉలిక్కిపడిన దేశం..!



**న్యూఢిల్లీ-నవభూమి:** శుక్రవారం ఉదయం పార్లమెంటు భవనం వద్ద భద్రతా ఉల్లంఘన చోటు చేసుకుంది. గుర్తు తెలియని ఆగంతుకుడు ఒకరు.. రైల్ భవన్ వైపు నుండి గోడ దూకి, చెట్టు సహాయంతో పార్లమెంట్ భవనం లోపలికి ప్రవేశించడానికి ప్రయత్నించాడు. గరుడ్ గేట్ వరకు చేరుకున్న అతడిని.. అక్కడ విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతడిని విచారిస్తున్నారు. వర్షాకాల సమావేశాలు ముగిసిన మరుసటి రోజే ఈ ఘటన జరగడం గమనార్హం. దీంతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

శుక్రవారం పార్లమెంటు భవనం వద్ద భద్రతా ఉల్లంఘన ఘటన చోటు చేసుకుంది. ఆగంతకుడు ఒకరు శుక్రవారం నాడు.. పార్లమెంటు భవనంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించాడు. ఒక వ్యక్తి గోడ దూకి పార్లమెంటు భవనంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించినట్లు అధికారులు తెలపారు. అయితే పార్లమెంటు భవనం ఆవరణలో ఉన్న భద్రతా దళాలు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆగంతకుడు శుక్రవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో చెట్టు సహాయంతో గోడ ఎక్కి పార్లమెంటులోకి ప్రవేశించాడని భద్రతా వర్గాల సమాచారం. అతను రైల్ భవన్ వైపు నుండి గోడ దూకి కొత్త పార్లమెంటు భవనం గరుడ్ గేట్ వరకు చేరుకున్నాడు. అయితే పార్లమెంట్ లోపల ఉన్న భద్రతా సిబ్బంది ఆ వ్యక్తిని పట్టుకున్నారు. ప్రస్తుతం అతడిని విచారిస్తున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసిన మరుసటి రోజు ఈ సంఘటన వెలుగులోకి రావడం సంచలనంగా మారింది. ఈ ఏడాది పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై 21న ప్రారంభమై ఆగస్టు 21న ముగిశాయి. 32 రోజుల వ్యవధిలో మొత్తం 21 సెషన్లు జరిగాయి. గత సంవత్సరం ఆగస్టులో కూడా ఇలాంటి భద్రతా ఉల్లంఘన సంఘటన జరిగింది. 20 ఏళ్ల ఒక వ్యక్తి గోడ దూకి పార్లమెంటు అనుబంధ ప్రాంగణంలోకి ప్రవేశించిన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి అలాంటి సంఘటనే చోటు చేసుకోవడంతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. దీనిపై పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం అవుతోంది.
ఢిల్లీ పోలీసులు ఈ సంఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ వ్యక్తి ఎవరు.. ఎందుకు రహస్యంగా పార్లమెంట్ గోడ ఎక్కేందుకు ప్రయత్నం చేశాడు.. ఏదైనా కుట్రలో భాగంగా ఇలాంటి పని చేశాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి స్థాయిలో విచారించిన తర్వాత మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉందని అంటున్నారు. పార్లమెంట్లోకి ఇలా అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించడం ఇది రెండో సారి. దాదాపు రెండేళ్ల క్రితం ఇలాంటి సంఘటనే చోటు చేసుకుంది. రెండు సంవత్సరాల క్రితం అనగా 2023 డిసెంబర్ 13న, ఇద్దరు వ్యక్తులు లోక్‌సభ ఛాంబర్‌లోకి దూకిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. 2001 పార్లమెంట్ మీద ఉగ్రదాడి జరిగి 22 సంవత్సరాలు పూర్తైన రోజునే ఈ సంఘటన చోటు చేసుకోవడం గమనార్హం.





నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 హైదరాబాద్ శనివారం 23 । ఆగస్టు । 2025


## మళ్లీ 82000 పైకి సెన్సెక్స్

**ముంబై-నవభూమి:** స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఆరో రోజూ లాభాల్లో పయనించాయి. గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 373.33 పాయింట్లు ఎగబాకి 82,231.17 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 142.87 పాయింట్ల లాభంతో 82,000.71 వద్ద ముగిసింది. నిఫ్టీ 33.20 పాయింట్ల వృద్ధితో 25,083.75 వద్ద స్థిరపడింది. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 13 రాణించాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ స్టాక్స్ ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. బజాజ్





ఫైనాన్స్, రిలయన్స్ 0.90 శాతం వరకు పెరిగాయి.
జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ రూ.5,000 కోట్ల
సమీకరణ: సెక్యూరిటీల జారీ ద్వారా ఒకేసారి లేదా పలు విడతల్లో రూ.5,000 కోట్ల వరకు సమీకరించే ప్రతిపాదనకు జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్ బోర్డు ఆమోదం తెలిపింది. అలాగే, ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని 50.5 ఎకరాల స్థలంలో కార్గో సిటీ ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు కంపెనీకి పూర్తి అనుబంధ విభాగంగా ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ)ను ఏర్పాటు చేసేందుకూ బోర్డు అంగీకరించింది.

## కో-ఆపరేటివ్ బ్యాంకులకూ పూర్తిస్థాయి ఆధార్ ఆథెంటికేషన్ సేవలు.. యూఐడీఏఐ నిర్ణయం



**న్యూఢిల్లీ-నవభూమి:** గ్రామీణ ప్రాంతాల వారికి బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ చేసేందుకు యూనీక్ అథారిటీ ఐడెంటిఫికేషన్ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) కీలక నిర్ణయం తీసుకుంది. కస్టమర్ల ఐడీ ధ్రువీకరణకు వినియోగించే ఆధార్ ఆథెంటికేషన్ సేవలను పూర్తిస్థాయిలో రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంకులకూ అనుమతించేలా కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. సహకార మంత్రిత్వ శాఖ, నాబార్డ్, ఎన్‌పీసీఐ, కోఆపరేటివ్ బ్యాంక్స్‌తో చర్చల అనంతరం ఈ కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో, దేశంలోని 34 రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంకులు, 352 జిల్లా కోఆపరేటివ్ బ్యాంకులు పూర్తిస్థాయిలో ఆధార్ ఆథెంటికేషన్ సేవల పరిధిలోకి వచ్చినట్లైంది. కొత్త విధానంలో భాగంగా రాష్ట్ర స్థాయి కోఆపరేటివ్ బ్యాంకులను ఆథెంటికేషన్ యూజర్ ఏజెన్సీలుగా, ఈకేవైసీ యూజర్ ఏజెన్సీలుగా యూఐడీఏఐ వద్ద రిజిస్టర్ చేస్తారు. ఇక జిల్లా స్థాయి కోఆపరేటివ్ బ్యాంకులు తమ రాష్ట్రస్థాయి సహకార బ్యాంకుల ద్వారా ఆధార్ ఆథెంటికేషన్ సేవలను పొందొచ్చు. ఫలితంగా, జిల్లా సహకార బ్యాంకులు ప్రత్యేకంగా ఐటీ మౌలిక వసతులు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉండదు. దీంతో, నిర్వహణ ఖర్చులు తగ్గి, కార్యకలాపాలు మరింత సరళతరం అవుతాయి. తాజా విధానంలో కోఆపరేటివ్ బ్యాంకులు ఆధార్ ఆథెంటికేషన్ సేవల సాయంతో మరింత సులువుగా కొత్త కస్టమర్లను చేర్చుకోగలుగుతాయి. బయోమెట్రిక్ ఈకేవైసీ, ఫేస్ రికగ్నిషన్ వంటివి అందుబాటులోకి రావడంతో బ్యాంకు ఖాతాలు తెరవడం గ్రామీణులకు మరింత సులభం అవుతుంది. సబ్సిడీలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశ ప్రజలందరికీ చేరుతాయి. ఆధార్ సాయంతో ఈ చెల్లింపులు నేరుగా వారి కోఆపరేటివ్ బ్యాంకు అకౌంట్‌లలోకి బదిలీ అవుతాయని నిపుణులు చెబుతున్నారు. కొత్త విధానం వల్ల కోఆపరేటివ్ బ్యాంకులు తమ ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థలను మరింతగా విస్తరించే అవకాశం ఉందని కూడా చెబుతున్నారు.

## ఇండియాలోకి ఓపెన్ ఏఐ.. త్వరలో కొత్త యూనిట్ ప్రారంభం..!




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచ ప్రసిద్ధ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఓపెన్‌ఏఐ త్వరలోనే భారతదేశంలో తన కార్యకలాపాలను విస్తరించేందుకు సిద్ధమవుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ ఏడాది చివర్లో దేశ రాజధాని న్యూఢిల్లీలో తన తొలి కార్యాలయం ప్రారంభించే దిశగా ప్రయత్నాలు చేస్తోంది. భారత మార్కెట్లో చాట్‌జీపీటీ వినియోగం భారీగా పెరగడం ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈ విషయాన్ని ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ స్వయంగా ప్రకటించారుచాట్‌జీపీటీ మాతృసంస్థ ఓపెన్‌ఏఐ ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ మాట్లాడుతూ, 'భారత్ ఒక గ్లోబల్ ఏఐ లీడర్‌గా ఎదిగేందుకు అవసరమైన ప్రతిభ, మద్దతు, మౌలిక సదుపాయాలన్నీ కలిగి ఉంది. ఇండియా ఏఐ మిషన్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సహకారం అభినందనీయమైనది' అని తెలిపారు. భారత్‌లో కార్యాలయం ప్రారంభించడం తమ స్థానిక సేవలను బలోపేతం చేయడంలో తొలి అడుగు అవుతుందని అన్నారు. అయితే, ఈ విషయంపై భారత ప్రభుత్వం అధికారికంగా స్పందించాల్సి ఉంది. ఓపెన్‌ఏఐ ఇప్పటికే ఇండియా ఏఐ మిషన్ భాగస్వామిగా పని చేయడానికి అంగీకరించింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రభుత్వ అవసరాల కోసం ప్రత్యేక ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేస్తుంది. భారత వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. గణాంకాల ప్రకారం, అమెరికా తర్వాత ఇండియా చాట్‌జీపీటీకి రెండవ అతిపెద్ద మార్కెట్‌గా కొనసాగుతోంది. వీక్లీ యాక్టివ్ యూజర్ల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే నాలుగు రెట్లు పెరిగినట్లు సంస్థ పేర్కొంది. అంతేగాక, చాట్‌జీపీటీ ప్లాట్ ఫాంను ఇండియాలో అత్యధికంగా విద్యార్థులు, డెవలపర్లే వినియోగిస్తున్నారు. ఇప్పటికే ఓపెన్‌ఏఐ, భారత వినియోగదారుల కోసం 'చాట్‌జీపీటీ గో' పేరుతో ప్రత్యేక సబ్‌స్క్రిప్షన్ సేవలను ప్రకటించింది. రూ.399 ధరతో అందుబాటులో ఉండే ఈ ప్లాన్‌లో మెసేజ్‌లు, ఫైల్ అప్‌లోడ్లు, ఇమేజ్ క్రియేట్ వంటి ఫీచర్లను విస్తృత స్థాయిలో వినియోగించుకునే అవకాశం కల్పించనుంది. అంతేకాదు, ఇండిక్ లాంగ్వేజ్ మద్దతుతో పాటు యూపీఐ పేమెంట్స్‌ను కూడా ఇందులో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కూడా ప్రకటించింది.

## బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..

**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయులకు బంగారం కేవలం పెట్టుబడి సాధనంగానే కాకుండా సాంస్కృతిక పరమైన ప్రాముఖ్యత కూడా ఉంది. అందుకే బంగారం ధరలపై నిత్యం ఓ కన్నేసి ఉంచాలి. ధరల హెచ్చుతగ్గులను బట్టి వేగంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది ఇక కొన్ని రోజులుగా దేశంలో బంగారం ధరలు తగ్గుతున్న విషయం తెలిసిందే. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ప్రస్తుతం దేశంలో 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర స్వల్పంగా తగ్గి రూ.1,00,760కు చేరుకుంది. 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ92,310గా ఉంది. కిలో వెండి ధర రూ.1,16,100గా ఉంది. 10 గ్రాముల ప్లాటినం ధర రూ.37,330

దేశంలోని వివిధ నగరాల్లోని బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే..

చెన్నై: 1,00,760-92,310 -76,310
ముంబయి: -1,00,760 -92,310 -75,530
ఢిల్లీ: 1,00,910-92,460-75,660
కోల్‌కతా: -1,00,760 -92,310- 75,530
బెంగళూరు: -1,00,760-92,310-75,530
హైదరాబాద్: -1,00,760 -92,310-75,530
కేరళ: -1,00,760 -92,310-75,530
పుణె: -1,00,760-92,310-75,530
వడోదరా: -1,00,810 -92,360-75,570
అహ్మదాబాద్: -1,00,810 -92,360-75,570



## అందుబాటులో 6 కొత్త పథకాలు.. సబ్‌స్క్రిప్షన్ తేదీలు ఇవే.. లాస్ట్ డేట్ ఎప్పుడంటే?




**ముంబై-నవభూమి:** ఈక్విటీ పెట్టుబడుల ద్వారా హైరిటర్న్స్ అందుకోవచ్చనే కారణంతో చాలా మంది ఇప్పుడు మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. తమ ఆర్థిక లక్ష్యాలు, రిస్క్ సామర్థ్యాన్ని బట్టి అనువైన ఫండ్స్ ఎంచుకుని దీర్ఘకాలం పాటు పెట్టుబడులు కొనసాగిస్తుంటారు. అయితే, చాలా మంది ఇప్పటికే అందుబాటులో ఉన్న పథకాలను గత చరిత్ర, పనితీరును బట్టి ఎంచుకుంటారు. కొందరు మాత్రం కొత్తగా మార్కెట్లోకి వచ్చే పథకాల కోసం చూస్తుంటారు. అందులో మీరు కూడా ఉన్నారా? మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల్లో న్యూ ఫండ్ ఆఫర్ కోసం చూస్తున్నారా? అయితే, మీకు ఇదే మంచి అవకాశం. ప్రస్తుతం ప్రముఖ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీలు 6 కొత్త ఫండ్ పథకాలను తీసుకొచ్చాయి. ఈ స్కీమ్స్ సబ్‌స్క్రిప్షన్స్ ఇప్పటికే మొదలయ్యాయి. ప్రస్తుతం సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైన 6 పథకాల్లో రెండు పథకాలు ఫండ్ ఆఫ్ ఫండ్, ఫండ్ ఆఫ్ ఫండ్ (డొమెస్టిక్), ఒక ఈటీఎఫ్ ఫండ్, ఒక ఇండెక్స్ ఫండ్ ఉన్నాయి. ఇందులో ప్రధానంగా మీరే అసెట్ మ్యూచువల్ ఫండ్ తీసుకొచ్చిన మీరే అసెట్ గోల్డ్ సిల్వర్ పాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ ఏంజెల్ వన్ గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ మొదలైంయింది. మొదటి స్కీమ్ ఆగస్టు 25 వరకు అందుబాటులో ఉంటుంది. అలాగే ఏంజెల్ వన్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 3 వరకు కొనసాగుతోంది. ఇలాగే మీరే అసెట్ మల్టీ ఫ్యాక్టర్ పాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (డొమెస్టిక్) సబ్‌స్క్రిప్షన్ గడువు ఆగస్టు 25 వరకు ఉంటుంది. అలాగే ఎడెల్వేయిస్ మల్టీ అసెట్ ఓమ్నీ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 26వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఆలోపు బిడ్లు దాఖలు చేసిన వారికి యూనిట్లు కేటాయిస్తారు.

ఇక ప్రముఖ ఏఎంసీ ఏంజెన్ వన్ మ్యూచువల్ ఫండ్ నుంచి గోల్డ్ స్కీమ్ వచ్చింది. ఏజెల్ వన్ గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ సబ్?స్క్రిప్షన్ అందుబాటులో ఉంది. సెప్టెంబర్ 2వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇక ఇండెక్స్ ఫండ్ కేటగిరీలోకి వస్తే యాక్సిస్ నిఫ్టీ 500 ఈక్వాలిటీ 50 ఇండెక్స్ ఫండ్ ఉంది. ఇండెక్స్ ఫండ్‌లో వస్తున్న ఏకైక ఫండ్ కావడంతో ఆదరణ లభిస్తోంది. ఈ స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 4 వరకు కొనసాగుతుంది.

## నెలకు రూ. 3500తో 30 ఏళ్లు.. నెలకు రూ. 35 వేలతో పదేళ్లు.. దేంట్లో ఎంతొస్తుంది.. ఏది బెస్ట్?



**ముంబై-నవభూమి:** మీరు పెట్టుబడులు పెడుతున్నారా.. మరి ఏ ఆప్షన్లు చూస్తున్నారు. మీ పెట్టుబడులపై సురక్షిత రాబడి కోసం అయితే పోస్టాఫీస్ పథకాలు, బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, గోల్డ్ బాండ్లు ఇలాంటివి ఎంచుకోవాలి. మరి రాబడి దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణాన్ని మించేలా ఎక్కువగా ఉండాలంటే మాత్రం నిపుణులు చెప్పే కీలక సలహా మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేయడం. అవును ఇక్కడ రిస్క్ తీసుకున్నప్పటికీ.. లాంగ్ రన్‌లో మంచి రాబడి అందిస్తాయని చెబుతుంటారు. గత రిటర్న్స్ దీనిని నిజం చేసింది. ఇక్కడ మ్యూచువల్ ఫండ్లలో రెండు రకాలుగా ఇన్వెస్ట్ చేయొచ్చు. ఒకేసారి పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయడం (లంప్ సమ్), లేదా సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో పెట్టుబడులు పెట్టడం. అయితే ఒకేసారి పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయడం కంటే.. వారానికి ఓసారి లేదా నెలవారీగా, 3 నెలలకు ఓసారి, 6 నెలలు లేదా సంవత్సరానికి ఒకసారి ఇలా సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేయొచ్చు. మీ స్థోమత, లక్ష్యాలకు అనుగుణంగా ఇక్కడ నిర్ణయం ఉండాలి. ఏదో పెట్టుబడి పెట్టి 2, 3 ఏళ్లలో తీస్తా అంటే మ్యూచువల్ ఫండ్స్‌లో కుదరదు. ఇక్కడ పదేళ్లు ఆపైన కొనసాగిస్తే మంచి రాబడి ఆశించవచ్చు. ఇది రిటైర్మెంట్ తర్వాత ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు సహాయపడుతుంది. ఇంకా పిల్లల చదువులు, కారు లేదా ఇల్లు కొనుగోలు చేసేందుకు, ఇతర అత్యవసర పరిస్థితులకు ఉపయోగపడుతుంది.

మ్యూచువల్ ఫండ్లలో కాంపౌండ్ ఇంట్రెస్ట్ అత్యంత కీలకం. ఇదే మీ సంపదను కాలం గడుస్తున్న కొద్దీ విపరీతంగా పెంచేందుకు దోహదం చేస్తుంది. అంటే ఏటా వడ్డీపై వడ్డీ పెరుగుతుంటుంది. ఎంత ఎక్కువ కాలం పెట్టుబడి కొనసాగిస్తే రాబడి అంత ఎక్కువగా ఉంటుందని చెప్పొచ్చు. సిప్ రూపంలో కనీసం నెలకు రూ. 500 నుంచి కూడా ప్రారంభించొచ్చు. ఇక చాలా వరకు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ సగటున 12-15 శాతం చొప్పున రాబడి అందించాయి. ఇప్పుడు మనం 12 శాతం వార్షిక రాబడి లెక్కన సిప్ పెట్టుబడులపై రాబడి ఎంతొస్తుందో చూద్దాం. ఇక్కడ ముందుగా నెలకు రూ. 3500 సిప్‌ను 30 ఏళ్లు కొనసాగిస్తే ఎంతొస్తుందో చూద్దాం. ప్రతి నెలా రూ. 3500 చొప్పున 30 ఏళ్లు కొనసాగిస్తే మీకు రూ. 1.07 కోట్లు వస్తాయి. ఇక్కడ మీ మొత్తం పెట్టుబడి రూ. 12.60 లక్షలుగా ఉంది. రిటర్న్స్ రూ. 95 లక్షలకుపైగా వచ్చింది. ఇదే పదేళ్ల కాలానికి ప్రతి నెలా రూ. 35 వేలతో ఇన్వెస్ట్ చేస్తే.. ఇక్కడ మీ పెట్టుబడి రూ. 42 లక్షలు అవుతుంది. అయితే ఇక్కడ పదేళ్లకు చూస్తే మీకు రూ. 78 లక్షలు మాత్రమే వస్తాయి. ఇక్కడ రూ. 42 లక్షల పెట్టుబడిపై మరో రూ. 36 లక్షలే వస్తాయి. ఇక్కడ రాబడి కాస్త అటుఇటు కావొచ్చని గుర్తుంచుకోవాలి. సగటున 12 శాతం లెక్కన ఈ లెక్కలు ఉన్నాయి. ఇక్కడే మీరు కాంపౌండింగ్ ఇంట్రెస్ట్ బెనిఫిట్ అర్థం చేసుకోగలరు. పైన రూ. 3500 నెలకు అనేది చిన్న మొత్తంలో పెట్టుబడి. మొత్తం 30 ఏళ్లకు కూడా పెట్టుబడి చాలా తక్కువే ఉంది. రిటర్న్స్ మాత్రం ఊహించని రీతిలో రూ. కోటికిపైనే వచ్చింది. అందుకే మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి అలా కొనసాగిస్తూ వెళ్తేనే మంచి రాబడి వస్తుందని తెలుసుకోవచ్చు.

## ఈ పని పూర్తి చేసిన వారికే ట్యాక్స్ 'రీఫండ్'..

### లేదంటే ఖాతాలోకి డబ్బులు రావు!




**ముంబై-నవభూమి:** ఐటీఆర్ ఫైల్ చేసిన తర్వాత దానిని వెరిఫై చేయడం అనేది తప్పనిసరి. ఈ ప్రక్రియ పూర్తి చేస్తేనే ఐటీ రిటర్నుల దాఖలు పూర్తవుతుంది. ఆ తర్వాతనే ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం మీ రిటర్నులను ప్రాసెస్ చేస్తుంది. ఇప్పటికే లక్షల మంది తమ రిటర్నులు దాఖలు చేసి రీఫండ్ కోసం వేచి ఉన్నారు. 90 శాతం వరకు ప్రాసెస్ సైతం పూర్తయినట్లు తెలుస్తోంది. అయితే, అందులో చాలా మందికి రీఫండ్ రావడం లేదు. అందుకు ఓ ప్రధాన కారణం ఉండవచ్చుంటున్నారు ట్యాక్స్ నిపుణులు. అదే బ్యాంక్ ఖాతాను జత చేయకపోవడం లేదా బ్యాంక్ అకౌంట్ ప్రీ- వాలిడేట్ చేయకపోవడం. వాలిడ్ బ్యాంక్ అకౌంట్ ఉన్న వారికి మాత్రమే రీఫండ్ జారీ చేస్తామని ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం అవగాహన కల్పిస్తోంది. మరి బ్యాంక్ అకౌంట్ ప్రీ వాలిడేట్ ఎలా చేయాలి? అనేది ఇప్పుడు మనం తెలుసుకుందాం. ఇన్‌కమ్ ట్యాక్స్ పోర్టల్‌లో తమ బ్యాంక్ అకౌంట్ యాడ్ చేయడమే కాదు పని చేయని బ్యాంక్ అకౌంట్ ఉంటే దానిని తొలగించడమూ ఒక ముఖ్యమైన పనే. అలాగే వాలిడ్ బ్యాంక్ ఖాతాను ఇవ్వాలి. ఇప్పటికే బ్యాంక్ అకౌంట్ యాడ్ చేసి ఉంటే దానిని ప్రీ వాలిడేట్ చేయాలి. ఒక వేళ ప్రీ వాలిడేట్ ఫెయిల్ అయితే, దానిని రీవాలిడేట్ చేయాల్సి ఉంటుంది. వాలిడ్ బ్యాంక్ అకౌంట్లోనే రీఫండ్ సొమ్ములు జమ చేస్తారు. లేదంటే రీఫండ్ జారీ కాకుండా నిలిచిపోతుంది. వాలిడ్ బ్యాంక్ అకౌంట్ నంబర్ ద్వారా ఇ-ఫైలింగ్ పోర్టల్‌లోకి వెళ్లి బ్యాంక్ ఖాతా జత చేయడం, ప్రీ వాలిడేట్ చేయడం వంటివి పూర్తి చేయవచ్చు. ఇ-ఫైలింగ్ పోర్టల్ లోకి లాగిన్ అయిన తర్వాత బ్యాంక్ ఖాతాను జత చేసి ప్రీ వాలిడేట్ చేయాలి. మూసివేసిన లేదా డీయాక్టివేట్ అయిన బ్యాంక్ ఖాతాను తొలగించాలి. వాలిడేటెడ్ బ్యాంక్ ఖాతాను నామినేట్ చేయాలి. వ్యక్తిగత ట్యాక్స్ పేయర్లు వాలిడేటెడ్ బ్యాంక్ అకౌంట్‌కు సంబంధించి ఎనేబుల్ లేదా డిసేబుల్ ఈవీసీ చేయాలి. ఒక వేళ ప్రీ వాలిడేటెడ్ ఫెయిల్ అయినట్లయితే రీవాలిడేట్ చేయాలి.

ముందుగా ఇ-ఫైలింగ్ పోర్టల్ లోకి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ కావాలి

డ్యాష్ బోర్డులో కనిపించే మై ప్రొఫైల్ పేజీలోకి వెళ్లాలి.

మై బ్యాంక్ అకౌంట్ పై క్లిక్ చేయాలి.

మై బ్యాంక్ అకౌంట్స్ పేజీలో యాడ్ బ్యాంక్ అకౌంట్ పై క్లిక్ చేయాలి.

బ్యాంక్ అకౌంట్ నంబర్ ఎంటర్ చేసి అకౌంట్ ఎలాంటిది, ఖాతాదారు ఎవరు సెలెక్ట్ చేయాలి. ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎంటర్ చేయాలి. ఈ కోడ్ ద్వారా మీ వివరాలు ఆటోమేటిక్ గా అప్డేట్ అవుతాయి. మీ బ్యాంకు ఇ-ఫైలింగ్ పోర్టల్‌తో ఇంటిగ్రేట్ అయితే మీ మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడీ సైతం ఆటోమేటిక్ గా వస్తాయి.

## ఆ దిగ్గజ బ్యాంకులో వాటా విక్రయం..

### కేంద్రం కీలక అప్డేట్.. 9 శాతం పెరిగిన షేర్లు





**ముంబై-నవభూమి:** దేశీయ దిగ్గజ బ్యాంకుల్లో ఒకటైన ఐడీబీఐ బ్యాంకులో వాటా విక్రయ ప్రక్రియ కొలిక్కి వచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఈ వాటా విక్రయ ప్రక్రియ పూర్తవుతుందని దీపమ్ సెక్రెటరీ అరుణీశ్ చావ్లా తెలిపారు. వాటా కొనుగోలుకు అర్హులైన బిడ్డర్లలో నెలకొన్న సందేహాలు నివృత్తి చేయడం, వివరాల పరిశీలన వంటి పనులు దాదాపుగా పూర్తి కావచ్చినట్లు తెలిపారు. పరిశ్రమల సమాఖ్యా ఫిక్కీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మాట్లాడారు. ఐడీబీఐ బ్యాంకులో వాటా విక్రయంపై వాళ్లు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఐడీబీఐ బ్యాంకులో వాటా విక్రయానికి సంబంధించి బిడ్డర్లు అడిగిన వివరాలు, గణాంకాలు అందజేశామని, టెక్నాలజీ పరమైన పత్రాలను కూడా వాళ్లు సిద్ధం చేసుకుంటున్నట్లు చెప్పారు అరుణీశ్ చావ్లా. ఈ ప్రక్రియ మొత్తం సెప్టెంబర్ నాటికి పూర్తిపోయి ఈ ఏడాది చివరి నాటి కల్లా బ్యాంకులో వాటా విక్రయం పూర్తవుతుందని అనుకుంటున్నట్లు చెప్పారు. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఐడీబీఐలో కేంద్రం వాటా విక్రయం పూర్తి చేయాలని లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. ప్రముఖ సంస్థలు ఈ బ్యాంకులో వాటా కొనేందుకు బిడ్లు దాఖలు చేసినట్లు చెప్పు

ఐడీబీఐ బ్యాంకులో వాటా విక్రయంపై దీపమ్ సెక్రెటరీ కీలక అప్డేట్ ఇచ్చిన క్రమంలో ఈ బ్యాంకు షేరు దూసుకెళ్లింది. గురువారం రోజు మార్కెట్ ఇంట్రాడే ట్రేడింగ్‌లో 9 శాతం వరకు ర్యాలీ చేశాయి. అయితే, శుక్రవారం ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్స్ కి దిగడంతో నష్టాల్లో ప్రారంభమైంది. స్వలం నష్టం 1 శాతం పడిపోయి రూ.96 వద్ద ట్రేడింగ్ అవుతోంది.

**ఎల్ఐసీలో వాటా విక్రయం ..**


ఇక భారతీయ జీవిత బీమా సంస్థలోనూ కేంద్ర ప్రభుత్వం కొద్ది వాటాను విక్రయిస్తున్న సంగతి తెలిసిందే. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిబంధనల ప్రకారం ప్రజా వాటా పెంచేందుకు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. పలు విడతల్లో ఈ వాటా విక్రయం ఉండనుంది. తాజాగా ఎల్ఐసీ వాటా విక్రయంపై అప్డేట్ ఇచ్చారు దీపమ్ కార్యదర్శి అరుణీశ్ చావ్లా . ఎల్ఐసీలో మలివిడత వాటా అమ్మకంపై నిర్ణయం తీసుకునేందుకు మర్చంట్ బ్యాంకర్లు, దీపమ్, ఎల్ఐసీ కలిసి ఒక అంతర్ మంత్రిత్వ బృందం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 'ప్రస్తుతం ఎల్ఐసీ మార్కెట్ విలువ దాదాపు 6 లక్షల కోట్ల రూపాయలకుపైగా ఉంది. మార్కెట్ల ప్రస్తుత అనుకూల పరిస్థితుల దృష్ట్యా వాటా విలువపై ఊహాతీత నిర్ణయం తీసుకోవడం కుదరదు. ఊహాగానాల రూపంలో ఒక అంకె చెప్పడమనేది సరైన నిర్ణయం కాదు. దీనిపై సరైన టైంలో సరైన ప్రకటన ఉంటుంది' అని దీపమ్ కార్యదర్శి అరుణీశ్ చావ్లా పేర్కొన్నారు. తొలి విడతలో వాటా విక్రయం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి రూ.17 వేల కోట్ల వరకు అందుతాయని పలు నివేదికలు చెబుతున్నాయి. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు.

## కార్వీ ఇన్వెస్టర్ల క్లెయిమ్‌లకు డిసెంబరు వరకు గడువు




**ముంబై-నవభూమి:** కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ (కేఎస్‌బీఎల్) చేతుల్లో మోసపోయిన ఇన్వెస్టర్లు తమ సొమ్మును క్లెయిమ్ చేసుకునేందుకు గడువును డిసెంబరు 31 వరకు పొడిగిస్తున్న ట్లు మార్కెట్ల నియంత్రణ మండలి సెబీ గురువారం తెలిపింది. గతంలో ప్రకటించిన గడువు ఈ జూన్ 2 తోనే ముగిసింది. 2020 నవంబరు 23న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ కార్వీని డిఫాల్టర్‌గా ప్రకటించింది. సొమ్ము క్లెయిమ్ చేసుకునేందుకు ఇన్వెస్టర్లు 1800 266 0050 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేయడం లేదా మెయిల్ చేయడం ద్వారా ఎన్ఎస్ఈని సంప్రదించవచ్చని పేర్కొంది. ఇన్వెస్టర్ల నిధులను దుర్వినియోగం చేసినందుకు గాను కేఎస్‌బీఎల్ ఛైర్మన్, ఎండీ పార్థసారధిని సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి 7 ఏళ్ల పాటు నిషేధించడంతో పాటు ఆయనపై రూ.21 కోట్ల జరిమానా విధిస్తూ సెబీ 2023 ఏప్రిల్‌లో ఆదేశాలు జారీ చేసింది.

## బిఎఫ్ఎస్ఐలో కొలువుల జోరు




**ముంబై-నవభూమి:** ప్రస్తుతం ఐటీ రంగం అంత ఆకర్షణీయంగా లేకపోయినా బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా కంపెనీల్లో మాత్రం నియామకాలు జోరందుకున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో ఈ కంపెనీల నియామకాలు 27 శాతం పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీల్లో నియామకాలు 8.7 శాతం పెరగనున్నాయని నియామకాల సేవలందించే అడెకో ఇండియా గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో ఈ విషయం వెల్లడించింది. 2030 నాటికి ఈ కంపెనీల్లో నియామకాలు 10 శాతం చొప్పున పెరిగి కొత్తగా 2.5 లక్షల మందికి పర్మినెంట్ ఉద్యోగాలు కల్పిస్తాయని పేర్కొంది.

**నివేదిక ముఖ్యాంశాలు**

మెట్రో నగరాలతో పోలిస్తే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనే ఎక్కువ కొలువులు

డిజిటల్, కంప్లయెన్స్ విధుల్లో అధికంగా ఉద్యోగాలు

స్థానిక భాషల్లో ప్రావీణ్యత, క్షేత్రస్థాయి అమ్మకాల్లో అనుభవం ఉన్న వారికి 15 శాతం వరకు అదనపు జీతాలు


సంప్రదాయ ఆస్తుల నుంచి మార్కెట్ ఆధారిత యూలిప్స్, మ్యూచు వల్ ఫండ్స్, పెన్షన్ ఫండ్ల వైపు మళ్లుతున్న మదుపరులు

రిలేషన్‌షిప ఎగ్జిక్యూటివ్‌లు, డిజిటల్ ప్రొడక్ట్ మేనేజర్లు, క్రెడిట్ రిస్క్ అనలిస్టులకు పెరుగుతున్న గిరాకీ

ఫైనాన్షియల్ ప్లాన్లు, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు, క్లెయిమ్స్ ఆటోమేషన్ స్పెషలిస్టుల కోసం చూస్తున్న వెల్త్, ఇన్సూరెన్స్ కంపెనీలు

నైపుణ్యాల అభివృద్ధితో బీమా కంపెనీల్లో 30 శాతం పెరిగిన క్లెయిమ్స్ సెటిల్‌మెంట్

## అపోలో హాస్పిటల్స్‌లో బల్క్ డీల్



**ముంబై-నవభూమి:** అపోలో హాస్పిటల్స్ ప్రమోటర్, ఎండీ సునీతా రెడ్డి కంపెనీలో 1.25 శాతం వరకు వాటాను శుక్రవారం బ్లాక్ డీల్స్ ద్వారా విక్రయించనున్నట్లు తెలిసింది. షేరు కనీస ధరను రూ.7,747గా నిర్ణయించినట్లు సమా చారం. బీఎస్ఈలో గురువారం అపోలో హాస్పి టల్స్ షేరు ముగింపు ధర రూ.7,920తో పోలిస్తే 2 శాతం తక్కువిది. కాగా ఈ వాటా విక్రయం ద్వారా రూ.1,395 కోట్ల వరకు సమకూరే అవకాశం ఉంది. ప్రస్తుతం సునీతా రెడ్డికి అపోలో హాస్పిటల్స్‌లో 3.36 శాతం వాటా ఉంది.

## లారస్ ల్యాబ్స్ పునర్ వ్యవస్థీకరణ




**హైదరాబాద్-నవభూమి:** లారస్ లేబొరేటరీస్ తన వ్యాపారాలను పునర్‌వ్యవస్థీకరిస్తోంది. ఇందులో భాగంగా అనుబంధ సంస్థ లారస్ సింథసిస్ కంపెనీకి చెందిన ఒక యూనిట్‌ను మరో అనుబంధ సంస్థ శ్రియమ్ ల్యాబ్స్‌లో, మిగతా యూనిట్లను లారస్ ల్యాబ్స్‌లో విలీనం చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన తీర్మానానికి గురువారం జరిగిన భేటీలో లారస్ ల్యాబ్స్ బోర్డు ఆమో దం తెలిపింది. ఎన్‌సీఎల్‌టీ ఆమోదానికి లోబడి వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి ఈ పునర్ వ్యవస్థీకరణ అమల్లోకి వస్తుందని తెలిపింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 హైదరాబాద్ శనివారం 23 । ఆగస్టు । 2025



# చిరిగిన చొక్కాతోనే తాళి కట్టిన మెగాస్టార్ చిరంజీవి

జ్ఞాపకాలు

మెగాస్టార్ చిరంజీవి ఇవాళ 70వ పుట్టిన రోజు జరుపుకుంటున్నారు. విజయవంతంగా 69ఏళ్లు పూర్తి చేసుకున్న చిరు.. నేడు 70వ పడిలోకి అడుగుపెట్టారు. 45ఏళ్లకుపైగా సినిమా కెరీర్, అనేక అవార్డులు, ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. ఇండస్ట్రీలోనే మెగాస్టార్ గా , బిగ్ బాస్ గా ఎదిగారు. అయితే ఇవాళ ఆయన జన్మదినం సందర్భంగా చిరు జీవితంలో జరిగిన ఓ ఆసక్తి కర సంఘటన గురించి తెలుసుకుందాం. అల్లు రామలింగయ్య కూతురు సురేఖను చిరంజీవి 1980 ఫిబ్రవరి 20న పెళ్లి చేసుకున్నారు. అయితే ఈ పెళ్ళికి చిరు చిరిగిన చొక్కాతోనే పెళ్లి పీటలెక్కారని మీకు తెలుసా? అవును ఇది నిజం! ఆయన పెళ్లికి చిరు, చిరిగిన చొక్కాతో వెళ్లారట. మరి ఆయన అలా ఎందుకు వెళ్లారంటే.. చిరంజీవి పెళ్లి జరిగే రోజు ఆయన తాతయ్య ప్రేమలీలలు అనే సినిమాలో నటిస్తున్నారు. పెళ్లి రోజు సైతం ఆయన షూటింగ్‌కు హాజరయ్యారు. అక్కడ్నుంచే నేరుగా పెళ్లి మండపానికి వచ్చారు. ఈ క్రమంలో డ్రెస్ మార్చుకునే సమయం లేకపోవడంతో మెగాస్టార్ అలాగే పెళ్లి పీటలెక్కారు. అలా చిరిగిన చొక్కాతోనే చిరంజీవి పీటలపై కూర్చున్నారు. ఈ సమయంలో అక్కడున్న వారు ఎవరో.. చొక్కా చిరిగింది. అని అన్నారు. దానికి రిప్లైగా చిరు.. ఏం చొక్కా చిరిగితే, తాళి కట్టనివ్వరా? అంటూ సరదాగా బదులిచ్చారు. దీంతో మండపంలో నవ్వులు పూశాయట. ఈ విషయాన్ని చిరు తానే స్వయంగా గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. కాగా, ప్రముఖ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ కు సురేఖ సొంత సొదరి అవుతారు. అలాగే అల్లు అర్జున్, శిరీశ్ సురేఖకు మేనల్లుళ్లు అవుతారు. దీంతో అప్పట్నుంచి అల్లు- మెగా ఫ్యామిలీల మధ్య బంధం మరింత బలపడింది.

నవచిత్ర



## అనుష్క.. భలే ఛాన్సులే




తెలుగులో హీరోలతో సమానంగా స్టార్ ఇమేజ్, మార్కెట్ సంపాదించిన కథానాయికల్లో అనుష్క ఒకరు. అరుంధతి, రుద్రమదేవి, భాగమతి లాంటి లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో ఆమె రేపిన సంచలనాల గురించి ఎంత చెప్పినా తక్కువే. ఐతే 'బాహుబలి' తర్వాత అనుష్క ఇంతకుముందులా రెగ్యులర్‌గా సినిమాలు చేయట్లేదు. కొన్నేళ్ల గ్యాప్ తర్వాత 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రంతో పలకరించిన ఆమెకు మంచి విజయమే దక్కింది. కానీ మళ్లీ గ్యాప్ తప్పలేదు. ఇప్పుడు ఆమె నుంచి 'ఘాటి' అనే ఇంటెన్స్ మూవీ రాబోతోంది. విలక్షణ దర్శకుడు క్రిష్ డైరెక్ట్ చేసిన చిత్రమిది. ఈ సినిమా ఎప్పుడో ర్వావాల్సింది. ఆలస్యమై సెప్టెంబరు 5న ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమైంది. ఐతే కొంచెం లేటైనప్పటికీ.. ఈ సినిమాకు మంచి టైమింగే కుదిరింది. 'మిరాయ్' లాంటి క్రేజీ మూవీతో పోటీ పడాల్సిన సినిమాకు కాస్తా సోలో డేట్ ఖరారైంది. సెప్టెంబరు 5కే అనుకున్న 'మిరాయ్' వాయిదా పడిపోయింది. అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నా.. ఈ సినిమా పోటీ నుంచి తప్పుకుందన్నది స్పష్టం. ముందు వారం రావాల్సిన మాస్ రాజా రవితేజ చిత్రం 'మాస్ జాతర' కూడా వాయిదా పడింది. ఇండిపెండెన్స్ డే వీకెండ్ చిత్రాలు వార్-2, కూలీ ఆల్రెడీ డౌన్ అయిపోయాయి. 'ఘాటి' వచ్చే సమయానికి బాక్సాఫీస్ ఖాళీగా ఉంటుంది. ఇంత అనుకూల వాతావరణం 'ఘాటి'కి బ్గాగా ప్లస్ అవుతుందనడంలో సందేహం లేదు. ట్రైలర్ చూస్తే 'ఘాటి' బలమైన కంటెంట్ ఉన్న సినిమాలాగే కనిపిస్తోంది. క్రిష్ దర్శకత్వ ప్రతిభకు, అనుష్క స్టార్ పవర్ తోడైతే.. ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర అద్భుతాలు చేయడానికి అవకాశముంది. మరి ఈ గోల్డెన్ ఛాన్స్‌ను 'ఘాటి' ఎంతమేర ఉపయోగించుకుంటుందో చూడాలి.

## గోవాలో చిరు 70వ జన్మదిన వేడుకలు..



నేడు (ఆగస్టు 22) మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టినరోజు. ఈ ప్రత్యేక సందర్భాన్ని ఆయన తన కుటుంబంతో కలిసి గోవాలో జరుపుకుంటున్నారు. బర్త్‌డే వేడుకలు ఎంతో ఘనంగా, సంతోషంగా జరుగుతున్నాయి. అభిమానులు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు సోషల్ మీడియా వేదికగా చిరుకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్ట్‌లు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిరు తనయుడు మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ తన తండ్రికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఓ ఎమోషనల్ వీడియోను షేర్ చేశాడు. వీడియోలో చరణ్ తండ్రికి కేక్ తినిపిస్తూ, చిరు పాదాలకు నమస్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నాడు. ఆ తర్వాత ఇద్దరూ ప్రేమతో ఆలింగనం చేసుకున్నారు. చిరంజీవి కూడా చరణ్‌కు కేక్ తినిపిస్తూ కుమారుడిపై తనకున్న ప్రేమని తెలియజేశారు. అయితే రామ్ చరణ్ తన తండ్రికి శుభాకాంక్షలు తెలియజేస్తూ పెట్టిన పోస్ట్ అందరిని టచ్ చేసింది. "ఇది కేవలం మీ పుట్టినరోజు మాత్రమే కాదు నాన్న ఇది మీ లాంటి గొప్ప వ్యక్తికి జరుపుతున్న గొప్ప సంబరమూ! నా హీరో, నా గైడ్, నా ప్రేరణ మీరు. నా ప్రతి విజయం, నేను మోసే విలువలు అన్నీ మీ నుంచే వచ్చాయి. 70 ఏళ్ల వయసులో కూడా మీరు మా హృదయంలో యువకుడిగా ఉండి, మాకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మీరు ఆనందంగా, ఆరోగ్యంగా మరెన్నో సంవత్సరాలు ఉండాలని ప్రార్థిస్తున్నాను. ఎవరైనా కోరుకునే ఉత్తమ తండ్రిగా ఉన్నందుకు ధన్యవాదాలు నాన్న అంటూ రామ్ చరణ్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ పోస్ట్ క్షణాల్లోనే వైరల్‌గా మారింది. మెగా అభిమానులు ఈ వీడియోను పెద్దఎత్తున షేర్ చేస్తూ #%HappyBirthdayChiranjeevi%–#%Mega%70 అనే హ్యాష్‌ట్యాగ్‌లతో సోషల్ మీడియాని షేక్ చేస్తున్నారు. ఇక చిరంజీవి-అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న మెగా 157 సినిమా టైటిల్ గ్లింప్స్ కూడా బర్త్‌డే సందర్భంగా విడుదలైంది. చిరు లుక్ ఆకట్టుకుంటూ అభిమానుల్లో కొత్త ఉత్సాహం నింపింది. 70 ఏళ్ల వయసులోనూ యంగ్ అండ్ ఎనర్జిటిక్, ఇన్‌స్పైరింగ్ లీడర్‌గా నిలుస్తున్న చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ, దేశం అంతటా అభిమానుల సందడి కొనసాగుతోంది. మెగాస్టార్ చిరంజీవి గారికి హృదయపూర్వక 70వ జన్మదిన శుభాకాంక్షలు. సినీ ప్రయాణం, ప్రజా జీవితం, సేవా కార్యక్రమాల్లో మీ విశిష్టమైన ప్రస్థానం లక్షలాది మందికి ఎంతో స్ఫూర్తినిచ్చింది. మీ ఉదారత, అంకితభావంతో మరెన్నో జీవితాలకు వెలుగునిస్తూ ముందుకు సాగాలని కోరుకుంటున్నాను. ఆనందం, ఆరోగ్యంతో మీరు సంతోషంగా కలకాలం జీవించాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.

## కిరణ్ అబ్బవరం- రహస్య ఫస్ట్ యానివర్సరీ.. వైరల్ అవుతున్న క్యూట్ పిక్స్



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులని అలరిస్తున్న విషయం తెలిసిందే. ఆయన ఇటీవల 'క' సినిమా సక్సెస్‌తో మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాడు. ఈ చిత్రం ద్వారా కొత్తగా కనిపించాడు. సుజిత్ -సందీప్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం దాదాసాహెబ్ ఫిల్మ్ ఫెస్టివల్ 2025లో ఉత్తమ చిత్రం అవార్డును సొంతం చేసుకుంది. చిన్న బడ్జెట్‌తో తెరకెక్కినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించింది. ప్రస్తుతం కిరణ్ అనే కొత్త ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నాడు. ఇటీవలే విడుదలైన 'రిచెస్ట్ చిల్లర్ గయ్' గ్లింప్స్‌కి మంచి స్పందన లభించింది. పంచకట్టులో ఎనర్జిటిక్ లుక్‌తో కిరణ్ ఆకట్టుకున్నప్పటికీ, కొన్ని డబుల్ మీనింగ్ డైలాగ్స్ పై నెటిజన్ల నుంచి విమర్శలు కూడా వచ్చాయి. అయినప్పటికీ, కిరణ్ మాస్, ఫన్ స్టైల్ తో మరోసారి ఆకట్టుకున్నాడు. ఈ సినిమాను జేమ్స్ నాని దర్శకత్వం వహించగా, హాస్య మూవీస్ - రుద్రాంశ్ సెల్యులోయిడ్స్ బ్యానర్‌పై యుక్తి తరేజా, రాజేశ్ దండ, శివ బొమ్మక్ కలిసి నిర్మిస్తున్నారు. ఈ సినిమా 2025 అక్టోబర్ 18న థియేటర్లలో విడుదల కానుంది. వైవిధ్యభరితమైన కథలతో ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న కిరణ్ అబ్బవరం, ప్రస్తుతం వ్యక్తిగతంగా, వృత్తిపరంగా రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ ముందుకు వెళ్తున్నాడు. కిరణ్ అబ్బవరం- రహస్య 2024 ఆగస్టు 22న కుటుంబ సభ్యుల సమక్షంలో వివాహబంధంతో ఒక్కటయ్యారు. అనంతరం 2025 మేలో తల్లి తండ్రులయ్యారు. అయితే నేడు ఈ జంట ఫస్ట్ వెడ్డింగ్ యానివర్సరీ జరుపుకుంటుంది. ఈ సందర్భంగా కిరణ్ తన సోషల్ మీడియాలో కొన్ని పిక్స్ షేర్ చేయగా, అవి వైరల్ అవుతున్నాయి. మరోవైపు పలువురు ప్రముఖులు, నెటిజన్స్ వారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇక ఇటీవల కిరణ్ అబ్బవరం -రహస్య గోరఖ్ దంపతులకు పండంటి అబ్బాయి జన్మించగా, తమ కొడుకు నామకరణ మహోత్సవాన్ని కుటుంబ సభ్యుల మధ్య గ్రాండ్‌గా నిర్వహించారు. తన కుమారుడికి 'హను అబ్బవరం' అనే పేరు పెట్టిన కిరణ్, ఇదే సందర్భంగా తొలిసారి బాబు ఫోటోను పబ్లిక్‌గా షేర్ చేశారు. ఫోటోలో పంచకట్టుతో, నుదుటిపై నామాలు వేసుకుని ఉన్న చిన్నారి హను అబ్బవరం అందరినీ మంత్రముగ్ధులను చేస్తూ క్యూట్‌నెస్‌తో సోషల్ మీడియాను షేక్ చేసాడు.

## బాలయ్య ఒక పవర్ హౌజ్



ఆయన ఒక పవర్ హౌజ్.. అందుకే ఆయనతో నటించడం అదృష్టంగా భావిస్తాను.. నందమూరి బాలకృష్ణను చూసినవాళ్లెవరైనా ఆయన ఎనర్జీకి ఫిదా అయిపోవాల్సిందే. తాజాగా టాలెంటెడ్ యాక్టర్ ఆది పినిశెట్టి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. బాలయ్యతో కలిసి నటించడం ఓ ప్రత్యేక అనుభవంగా మిగిలిందని చెబుతూ, "బాలకృష్ణ ఒక వ్యక్తి కాదు ఓ శక్తి. ఆయన ఒరిజినల్ గా స్క్రీన్ మీద కనిపించేలా నిజ జీవితంలోనూ పవర్ హౌస్ లాంటి వ్యక్తిత్వం కలవారు" అంటూ పొగడ్తల వర్షం కురిపించారు. తెలుగులో మోస్ట్ అవైటెడ్ మూవీగా వస్తున్న అఖండ 2 కోసం బాలయ్య-బోయపాటి శ్రీను మళ్లీ కలిశారు. ఈ సినిమాలో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో కనిపించనున్నాడు.



ఈ విషయమై ఓ ఇంటర్వ్యూలో స్పందించిన ఆయన, "బాలయ్య పనితీరు, కష్టపడే తత్వం చాలా మందికి స్ఫూర్తిదాయకం. స్క్రీన్ పైనా, ఆఫ్ స్క్రీన్ పైనా ఆయన ఎనర్జీ అసాధారణం" అన్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వ శైలిపై ఆది ప్రశంసలు కురిపిస్తూ, "ఆయన డైరెక్షన్‌లో ఓ మ్యాజిక్ ఉంటుంది. బాలయ్య-బోయపాటి కాంబినేషన్ అంటేనే ఆడియన్స్‌లో భారీ అంచనాలు ఉంటాయి. అలాంటి సినిమా లో నాకూ ఛాన్స్ రావడం అదృష్టంగా భావిస్తున్నాను" అన్నారు. గతంలోనూ బోయపాటి దర్శకత్వంలో పనిచేసిన అనుభవం ఉందని, ఈ సారి మరింత బలమైన పాత్ర దక్కిందని వెల్లడించారు ఆది.

తనకు విలన్ పాత్రల్లో నటించడంపై ఉన్న ఆసక్తిని వెల్లడించిన ఆది, "విలన్ క్యారెక్టర్లకు ఎలాంటి పరిమితులు ఉండవు. అవి నటనకు విశేషమైన అవకాశాలు కలిగిస్తాయి. మంచివాడు కాదు, చెడ్డవాడు కాదు, మిడిల్‌లో ఉండే పాత్రలే ఎక్కువ బలాన్నిస్తాయి. అందుకే విలన్ పాత్రలు నాకు ఎక్కువ ఇష్టంగా ఉంటాయి అని అన్నారు. ఇక అఖండ 2 సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేయాలని మొదట భావించగా, పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం వల్ల సినిమా వాయిదా పడే అవకాశం ఉందని ఫిలింనగర్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. ప్రగ్యా జైస్వాల్, సంయుక్త మీనన్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీతం అందిస్తున్నారు.

## వివాదంలో జాన్వీ కపూర్..! సింగర్ పవిత్ర విమర్శలతో సోషల్ మీడియాలో దుమారం..!




బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ వరుస ప్రాజెక్టులతో దూసుకెళ్తున్న యంగ్ అండ్ టాలెంటెడ్ నటి జాన్వీ కపూర్.. తాజాగా ఓ వివాదంలో చిక్కుకున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న హిందీ చిత్రం 'పరమ్ సుందరి'తో ఈ వివాదం తలెత్తింది. ఈ సినిమాలో జాన్వీ పోషించిన మలయాళీ యువతి పాత్రపై ఓ మలయాళ గాయని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సిద్ధార్థ్ మల్హోత్రా జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ చిత్రానికి తుషార్ జలోటా దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఆగస్టు 29న విడుదల కానుంది. ఇందులో జాన్వీ ఒక మలయాళీ యువతిగా కనిపించనున్నారు. లుక్, డ్రెస్సింగ్ స్టయిల్ విషయంలో జాన్వీకి మంచి ప్రశంసలు వచ్చాయి. జాన్వీ మలయాళ యాసపై నెటిజన్ల నుంచి విమర్శలు మొదలయ్యాయి. జాన్వీ పాత్రపై సోషల్ మీడియాలో ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ 'ఒక మలయాళీ పాత్రకు మలయాళ నటిని ఎందుకు ఎంపిక చేయలేదు? ఒకటే సంస్కృతిని సరైన రీతిలో ప్రతిబింబించాలంటే.. అక్కడి వ్యక్తుల్ని తీసుకోవాల్సిందే కదా!' అంటూ కామెంట్ చేసింది. అంతేకాకుండా జాన్వీ మాట్లాడిన మలయాళ యాసను ఉద్దేశించి వ్యంగ్యంగా మాట్లాడిన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఈ వీడియో క్షణాల్లో వైరల్ అయ్యింది. అయితే, జాన్వీ అభిమానులు తీవ్రంగా స్పందించారు. పవిత్ర మీనన్‌పై మండిపడ్డారు. ఆమె వీడియోను పెద్ద ఎత్తున రిపోర్ట్ చేయగా.. ఇన్‌స్టాగ్రామ్ ఆ వీడియోను తొలగించింది. దాంతో పవిత్ర ఇంతటితో ఆగకుండా తాను పోస్ట్ చేసిన వీడియో తొలగించారని.. స్క్రీన్‌షాట్‌లను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ మరోసారి తన అభిప్రాయాన్ని మరోసారి కుండబద్దలు కొట్టారు. ఇది వివాదాన్ని మరింత ఉధృతం చేసింది. ప్రస్తుతం ఈ విషయంపై నెటిజన్ల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు 'ప్రాంతీయ పాత్రలకు ఆయా భాషలకే చెందిన నటులను తీసుకోవడమే సరైన విధానం' అంటూ పవిత్రకు మద్దతు తెలుపగా.. నటనకు భాషతో సంబంధం లేదు.. ఒక నటి పాత్రను నిజాయితీగా పోషిస్తే చాలు అంటూ జాన్వీకి మద్దతు తెలిపారు. ఈ వివాదం సినిమా విడుదలకు ముందు ఊహించని హైప్‌ను తీసుకువచ్చింది. అయితే, ఈ వివాదంపై చిత్రబృందం ఇప్పటి వరకు స్పందించలేదు. మరి ఈ అంశంపై జాన్వీ ఎలా స్పందిస్తుందో చూడాల్సిందే.

## హీరోయిన్‌గా ఘట్టమనేని వారి అమ్మాయి.. డైరెక్టర్ ఎవరంటే!



సినీ రంగంలో సూపర్‌స్టార్ కృష్ణ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఓ సామాన్యుడిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టి 300లకి పైగా చిత్రాల్లో హీరోగా నటించిన చరిత్ర ఆయనది. నిర్మాతగా, దర్శకుడిగా, డిస్ట్రిబ్యూటర్‌గా ఎన్నో రకాలు సినీ రంగానికి సేవ చేశారు. ఆయన ఇద్దరు కుమారుడు రమేష్‌బాబు , మహేశ్‌బాబు కూడా హీరోలుగా ఎంట్రీ ఇవ్వగా రమేష్‌బాబుకి లక్ కలిసిరాకపోవడంతో పెద్దగా రాణించలేకపోయారు. ఇక బాలనటుడిగా అదరగొట్టేసిన మహేశ్‌బాబు ఇప్పుడు టాలీవుడ్‌లో టాప్ హీరోల్లో ఒకరిగా ఎదిగి అభిమానుల చేత సూపర్‌స్టార్ అనిపించుకుంటున్నారు. రమేష్ కొన్నాళ్ల క్రితం అనారోగ్యంగా కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆయన కుమారుడు జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. ఇండస్ట్రీకి అంత మంది హీరోలని అందించిన ఘట్టమనేని కుటుంబం నుంచి ఓ హీరోయిన్ అరంగ్రేటం చేస్తుండం విశేషం. ఆమె ఎవరో కాదు రమేష్‌బాబు కుమార్తె భారతి. ఇన్‌స్టాగ్రామ్‌లో యాక్టివ్‌గా ఉండే ఈ అమ్మాయి ఇప్పుడు హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వబోతుందన్న వార్త ఘట్టమనేని అభిమానులకు కిక్ ఇస్తోంది. ఆమెకు సంబంధించి లుక్ టెస్ట్ కూడా పూర్తయినట్లు తెలుస్తోంది. ఒక ప్యూర్ లవ్‌స్టోరీగా తెరకెక్కనున్న ఈ చిత్రానికి తేజ దర్శకత్వం వహించబోతున్నారట. మహేశ్‌బాబు 'గుంటూరు కారం' సినిమా కుర్చీ మడతబెట్టి సాంగ్‌కి డ్యాన్స్ చేసిన భారతి వీడియో గతంలో తెగ వైరల్ అయింది. భారతి తన కజిన్ సితారతో కలిసి యానీ మాస్టర్ దగ్గర డ్యాన్స్ నేర్చుకుంది. తెలుగు సినీ ఇండస్ట్రీలో తేజకు మంచి ట్రాక్ రికార్డు ఉన్న సంగతి తెలిసిందే. 'చిత్రం'తో ఉదయ్‌కిరణ్, రీమాసేన్‌లను పరిచయం చేసిన ఆయన 'జయం'తో నితిన్, సదాని, 'లక్ష్మీ కల్యాణం'తో కాజల్‌ని పరిచయం చేశారు. వీరంతా ఆ తర్వాత కాలంలో పెద్దస్టార్లుగా ఎదిగారు దీంతో తేజని లక్కీ డైరెక్టర్‌గా చెబుతుంటారు. అలాంటి డైరెక్టర్‌తో భారతి ఘట్టమనేని ఎంట్రీ ఇస్తుందంటే కచ్చితంగా టాప్ హీరోయిన్ అవుతుందని ఫ్యాన్స్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ చిత్రంలో హీరో ఎవరన్నది ఇంకా క్లారిటీ రాలేదు. భారతి పక్కన లవర్ బాయ్‌గా ఫిట్ అయ్యే డెబ్యూ హీరో కోసం తేజ సెర్చ్ చేసుతున్నారట. రమేష్‌బాబు చనిపోయినప్పటి నుంచి తన అన్న కుటుం బానికి మహేశ్‌బాబు అండగా ఉంటున్న సంగతి తెలిసిందే. మహేశ్‌బాబు ప్రోద్బలంతోనే రమేష్‌బాబు కుమారుడు జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు.

## టీమిండియాకు గ్రీన్‌సిగ్నల్



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్-పాకిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ జరగవని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. అయితే వచ్చే నెల 9 నుంచి జరిగే ఆసియా క్‌పలో పాల్గొనకుండా భారత జట్టును అడ్డుకోలేమని తెలిపింది. దీంతో సెప్టెంబరు 14న దుబాయ్‌లో జరిగే దాయాదుల పోరుకు అడ్డంకి తొలగినట్ట యింది. ఈ టోర్నీలో భారత్-పాక్ మూడు సార్లు తలపడే అవకాశం ఉంది. ఇటీవలే పార్లమెంట్‌లో సరికొత్త జాతీయ క్రీడా బిల్లు ఆమోదం పొందిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఏ క్రీడలోనైనా ఇకపై భారత్‌కు చెందిన అథ్లెట్లు పాక్‌లో.. పాక్ ఆటగాళ్లు భారత్‌లోగానీ పర్యటించడం కుదరదని తేల్చింది. అంతేకాకుండా ఈ రెండు దేశాల జట్ల ద్వైపాక్షిక సిరీస్‌లు తటస్థ వేదికలపైనా జరగబోవని స్పష్టం చేసింది.

అయితే ఒలింపిక్ చార్టర్‌ను అనుసరించి ఐసీసీ వరల్డ్‌కప్, ఆసియాక్‌పలాంటి మెగా టోర్నీల్లో పాక్‌తో తలపడేందుకు ఎలాంటి అభ్యంతరమూ ఉండదని క్రీడాశాఖ పేర్కొంది. వీటికి పాకిస్థాన్ ఆతిథ్యమిస్తే మాత్రం జోక్యం చేసుకోవాల్సి ఉంటుందని చెప్పింది. మరోవైపు భవిష్యత్‌లో ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగైతే ఈ నిర్ణయంలో మార్పు ఉంటుందా? అనే ప్రశ్నకు సమాధానంగా.. ప్రస్తుతానికైతే అలాంటి ఆలోచన లేవని క్రీడా శాఖ వర్గాలు తెలిపాయి.

## ఆటగాళ్లకు అగ్నిపరీక్ష బ్రాంకో టెస్ట్




**న్యూఢిల్లీ-నవభూమి:** ఆటగాళ్ల ఫిట్‌నెస్ సమస్య టీమిండియాను వెంటాడుతోంది. ఎవరు ఎంత ఫిట్‌గా ఉన్నారో కచ్చితంగా తెలుసుకోలేకపో తున్నారు. కొందరైతే పెయిన్‌కిల్లర్లు తీసుకొని మ్యాచ్‌లో బరిలోకి దిగుతున్నారని వార్తలు కూడా వచ్చాయి. తాజా ఇంగ్లండ్ టూర్‌ని గమనిస్తే..మనోళ్ల ఫిట్‌నెస్ ఎంత తక్కువ స్థాయిలో ఉందో అందరికీ తెలిసిందే. దీనికి బుమ్రానే ఉదాహరణ. ఈ నేపథ్యంలో భారత జట్టు ఫిట్‌నెస్ విషయంలో బీసీసీఐ సరికొత్త ప్రమాణాలు నెలకొల్పాలనుకొంటోం ది. ఇందులో భాగంగా రగ్బీ ఆటగాళ్లను పరీక్షించే బ్రాంకో టెస్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టీమిండియా కొత్త ఫిట్‌నెస్, కండీషనింగ్ కోచ్ అడ్రియన్ లే రూ ఈ టెస్ట్‌ను ప్రవేశపెట్టగా..చీఫ్‌కోచ్ గౌతమ్ గంభీర్ దానికి మద్దతు ప్రకటించాడు. తాజాగా జరిగే ఫిట్‌నెస్ టెస్ట్‌లో యో-యో టెస్ట్‌తోపాటు బ్రాంకో టెస్ట్ కూడా పాస్ కావాలి. దీంతోపాటు 2 కిలోమీటర్ల టైమ్ ట్రయల్‌ను అధిగమించాలి. ప్లేయర్ల సత్తువ, వేగంతోపాటు కార్డియో వాస్క్యులర్ కండిషన్‌ను కొలిచేందుకు రూపొందించిన తీవ్రమైన రన్నింగ్ డ్రిల్ ఇది. ఆటగాళ్ల శరీరానికి, మైండ్‌కు సవాళ్లు విసురుతుంది. క్రికెటర్ ఫిట్‌నెసలోని సూక్ష్మమైన లోపాలు కూడా ఈ టెస్ట్‌లో బయటపడతాయి. బ్రాంకో టెస్ట్‌లో 20, 40, 60 మీటర్ల షటిల్స్ ఉంటాయి. ప్రతి దూరాన్ని ఐదు సెట్లపాటు విరామం తీసుకోకుండా పూర్తి చేయాలి. అంటే ఒక్కోటి ఐదుసార్ల చొప్పున మొత్తం 15 సార్లు... 1200 మీటర్ల దూరాన్ని ఆగకుండా పరిగెత్తాలి.

నవక్రీడ

## ఎరాని జోడీ వన్స్‌మోర్



**న్యూయార్క్-నవభూమి:** డిఫెండింగ్ చాంప్ సారా ఎరాని జోడీ పునర్ వ్యవస్థీకరించిన యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను నిలబెట్టుకొంది. గురువా రం జరిగిన ఫైనల్లో ఇటలీ జంట ఎరాని-ఆండ్రియా వవస్సోరి జోడీ 6-3, 5-7, 10-6తో మూడో సీడ్ ఇగా స్వియటెక్-కాస్పర్ రూడ్ జంటపై గెలిచింది. తుది పోరును మాత్రం రెగ్యులర్ ఫార్మాట్‌లో నిర్వహించారు. సింగిల్స్ స్టార్లతో డ్రాను నింపేసినా అంతిమంగా డబుల్స్ స్పెషలిస్టులకే టైటిల్ దక్కింది. అంతకుముందు జరిగిన సెమీసలో ఎరాని-వవస్సోరి జంట 4-2, 4-2తో డేనియల్ కొలిన్స్-క్రిస్టియన్ హ్యారిసన్‌ను చిత్తు చేసింది. మరో మ్యాచ్‌లో స్వియటెక్-రూడ్ ద్వయం 3-5, 5-3, 10-8తో టాప్ సీడ్ జెస్సికా పెగుల-జేక్ డ్రేపర్‌పై పోరాడి నెగ్గింది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**